జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంచార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.


ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి | సోమవారం 16 జూన్ 2025 | సంపుటి : 15 | సంచిక : 263 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



## పుణెలో ఘోర ప్రమాదం

- నదిలో కూలిన వంతెన..
- అనేక మంది గల్లంతు!
- వీరిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా ఆరుగురిని స్థానికులు రక్షించినట్లు సమాచారం
- మిగతావారి కోసం గాలింపు

## ఆక్వా ఎగుమతులు, మ్యాంగో పల్ప్‌పై

# జీఎస్టీ తగ్గించండి

- పీయూష్ గోయల్‌ను కోరిన చంద్రబాబు
- రాష్ట్రంలోని వివిధ అంశాలపై సీఎం, కేంద్రమంత్రి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం.
- పొగాకు ధరలు తగ్గినందున రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడి
- బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఏడు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- పొగాకు కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.300 కోట్లు ఖర్చు చేస్తోందని
- టొబాకో బోర్డు రూ.150 కోట్లు భరించేలా చూడాలన్నారు.



ప్రజాజ్యోతి అమరావతి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ని సీఎం చంద్రబాబు భోజనానికి ఆహ్వానించారు. దీంతో వారిద్దరూ ఉండవల్లిలోని సీఎం నివాసానికి చేరుకున్నారు. అనంతరం లంచ్ మీటింగ్‌లో ఏపీకి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లు, పామాయిల్‌పై దిగుమతి సుంకం తగ్గింపు, ఆక్వా ఎగుమతులు, మ్యాంగో పల్ప్ పై జీఎస్టీ తగ్గింపుపై చర్చించారు. టొబాకో బోర్డు ద్వారా ఏపీలో పొగాకు కొనుగోళ్ల నిమిత్తం రూ.150 కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విన్నవించారు. పొగాకు ధరలు తగ్గిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వమే రూ.300 కోట్లతో 20 మిలియన్ కేజీలు కొనుగోలు చేస్తున్నట్లు కేంద్ర మంత్రికి సీఎం చంద్రబాబు వివరించారు. బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఏడు చోట్ల పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని సీఎం చంద్రబాబు వివరించారు. పొగాకు కొనుగోళ్ల - మిగతా3లో



## సూపర్ సిక్స్ కాదు.. ఫస్ట్ బాల్‌కే కూటమి ఔట్

- వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్
- మూడు ఉచిత సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒక్కటే ఇచ్చి చేతులు దులుపుకున్నారు
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారు
- కుటుంబంలో ఎంత మంది పిల్లలున్నా తల్లికి వందనం ఇస్తామన్నారు, ఏమైంది?
- తల్లికి వందనం పేరుతో కూటమి సర్కార్ మహా మోసం చేస్తోంది.



## ఆత్మరక్షణ కోసమే ప్రతిదాడులు..

- అందుకు అంగీకరిస్తే ఆపేస్తాం
- ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాక్చీ వెల్లడి
- పరిస్థితులు డిమాండ్ చేస్తే తప్ప ఇజ్రాయెల్‌తో వివాదాన్ని పొరుగుదేశాలకు విస్తరించాలని ఇరాన్ భావించడం లేదు
- మరోవైపు టెహ్రాన్ అణ్వాయుధాలు తయారు చేస్తే తమకు ముప్పు ఉంది
- దానిని అడ్డుకునేందుకే అణు స్థావరాలపై దాడులు చేస్తున్నాం




## తల్లికి వందనం సూపర్ సక్సెస్

- జగన్ కడుపుమంట మూడింతలు పెరిగింది: లోకేశ్
- మరోసారి తన విష పత్రికలో ఫేక్ ప్రచారానికి తెరలేపారు.
- ఆరుగురు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న తల్లులు, అనాథ శరణాలయాల్లో ఉంటున్న పిల్లలకు ఇంకా డబ్బులు జమ చేయలేదు
- గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం సిబ్బంది ఫీల్డ్ వెరిఫికేషన్ చేసిన తరువాత మాత్రమే వారికి నిధులు విడుదల అవుతాయి

## ఇజ్రాయెల్-ఇరాన్ కూడా ఒక ఒప్పందం కుదుర్చుకోవాలి

ఇటీవల భారత్-పాక్ మధ్య తాను డీల్ కుదిర్చిన వైనం ప్రస్తావన.. అమెరికాతో వాణిజ్యం ద్వారానే ఇది సాధ్యమైందని వెల్లడి

సెర్బియా-కొసావో, ఈజిప్ట్-ఇథియోపియా వివాదాలనూ పరిష్కరించానన్న ట్రంప్

మధ్యప్రాచ్యంలో త్వరలో శాంతి నెలకొంటుందని ధీమా వ్యక్తీకరణ.. తాను ఎంతో చేసినా గుర్తింపు దక్కడం లేదని ఆవేదన


## మరోవైపు జెట్ స్పీడ్‌లో

# అమరావతి పనులు

### అమరావతిలో ముమ్మరంగా పనులు

ప్రజాజ్యోతి అమరావతి

ఏపీలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రాజధాని అమరావతి పూర్వవైభవం సంతరించుకుంటోంది. గత టీడీపీ సర్కార్‌లో కనిపించిన సందడి మళ్లీ మొదలైంది. 2019 ప్రథమార్థం వరకు రేయింబవళ్లు విద్యుత్ దీపాల వెలుగుల మధ్య యుద్ధ ప్రాతిపదికన సాగిన పనులు, ఆ తర్వాత వైఎస్సార్సీపీ ప్రభుత్వం రాకతో ఆగిపోయాయి. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. గత మే నెలలో ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌కు చోదకశక్తిగా అక్కరకురానున్న రాజధాని నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. రేయింబవళ్లు అని తేడా లేకుండా కార్మికులు, అధికారులు పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఐదు సంవత్సరాల నిర్లక్ష్యం వల్ల ఇనుప చువ్వలు తుప్పుపట్టి నేలచూపులు చూశాయి. కానీ కూటమి వచ్చిన ఏడాదిలోనే భవన నిర్మాణాలై తలెత్తుకొని నిల్చుంటున్నాయి. నిలిచిపోయిన - మిగతా3లో





## బాసరలో విషాద ఘటన... గోదావరిలో నీటమునిగి

# ఐదుగురు మృతి

- పుణ్యస్నానానికి వెళ్లి ఐదుగురు యువకులు గోదావరిలో మునిగి మృతి
- మృతులంతా హైదరాబాద్ చింతల్‌కు చెందిన ఒకే కుటుంబ సభ్యులు
- నీటి లోతుపై అవగాహన లేకపోవడమే ప్రమాదానికి కారణం
- మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి, అధికారులకు కీలక ఆదేశాలు

## సైప్రస్ చేరుకున్న ప్రధాని మోదీ..

### ఎయిర్ పోర్టుకు వచ్చిన దేశాధ్యక్షుడు

- ప్రధాని మోదీ మూడు దేశాల పర్యటన ప్రారంభం
- తొలి విడతగా సైప్రస్‌కు చేరుకున్న భారత ప్రధాని
- విమానాశ్రయంలో మోదీకి ఆత్మీయ స్వాగతం పలికిన సైప్రస్ అధ్యక్షుడు
- భారత్-సైప్రస్ ద్వైపాక్షిక సంబంధాలపై కీలక చర్చలు
- వాణిజ్యం, పెట్టుబడులే ప్రధాన అజెండా
- రెండు దశాబ్దాల తర్వాత ఓ భారత ప్రధాని సైప్రస్ సందర్శన



# ఆత్మరక్షణ కోసమే ప్రతిదాడులు



**ఇంటర్నెట్‌డెస్క్:** అణుస్థావరాలే లక్ష్యంగా గగనతల దాడులకు దిగిన ఇజ్రాయెల్‌పై అంతే స్థాయిలో ప్రతిదాడి చేసిన ఇరాన్ కీలక ప్రకటన చేసింది. కేవలం ఆత్మరక్షణ కోసమే 'టెల్ అవీవ్'పై దాడి చేయాల్సి వచ్చిందని పేర్కొంది. ఇస్లామిక్ రిపబ్లిక్‌పై ఇజ్రాయెల్ సైనిక చర్యను నిలిపివేస్తే.. తాము కూడా దాడులు ఆపేస్తామని ప్రకటించింది. ఈమేరకు ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాక్చీ వెల్లడించారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం వరకు వందల సంఖ్యలో క్షిపణులను ఇరాన్ ఇజ్రాయెల్‌పైకి ప్రయోగించిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో సుమారు 10 మంది మృతి చెందగా.. 200 మంది వరకు గాయపడినట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. పరిస్థితులు డిమాండ్ చేస్తే తప్ప ఇజ్రాయెల్‌తో వివాదాన్ని పొరుగుదేశాలకు విస్తరించాలని ఇరాన్ భావించడం లేదని అబ్బాస్ అరాక్చీపేర్కొన్నారు. మరోవైపు టెహ్రాన్ అణ్వాయుధాలు తయారు చేస్తే తమకు ముప్పు ఉందని, దానిని అడ్డుకునేందుకే అణు స్థావరాలపై దాడులు చేస్తున్నామని ఇజ్రాయెల్ వాదిస్తోంది. వాటిని సమూలంగా నేలమట్టం చేసేంత వరకు దాడులు కొనసాగిస్తామని చెబుతోంది. ఈ నేపథ్యంలో అబ్బాస్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

**ఇజ్రాయెల్‌ది వ్యూహాత్మక తప్పిదం**

ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ క్షేత్రమైన 'ది సౌత్ పార్స్ క్షేత్రం' ఇజ్రాయెల్ దాడి చేయడంపై అబ్బాస్ తీవ్రంగా మండిపడ్డారు. ఈ క్షేత్రాన్ని ఖతార్ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నట్లు చెప్పిన ఆయన.. ఇజ్రాయెల్ దుందుడుకు చర్యకు ఇదో ఉదాహరణ అని అన్నారు. యుద్ధాన్ని విస్తరించాలన్న కాంక్షతోనే ఇలాంటి ప్రమాదకర చర్యకు పాల్పడిందని వ్యాఖ్యానించారు. "వివాదాన్ని పర్షియన్ గల్ఫ్ వరకు లాగడం ఓ వ్యూహాత్మక తప్పిదం, యుద్ధాన్ని ఇరానియన్ భూభాగం దాటి విస్తరించాలనే ఉద్దేశంతోనే ఇజ్రాయెల్ ఇలాంటి చర్యలకు పాల్పడుతోంది" అని అబ్బాస్ అన్నారు.

**డేంజర్ లైన్ దాటేసింది**

అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ ఇరాన్‌లోని అణుస్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయెల్ ఇప్పటికే డేంజర్ లైన్ దాటేసిందని అబ్బాస్ అన్నారు. ఇరాన్–అమెరికా మధ్య అణు చర్చలను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ తరహా పరిస్థితులు ఎదురుకాకపోతే అమెరికాతో అణు ఒప్పందానికి మార్గం తెరిచే ఉండేదని అన్నారు. ఇజ్రాయెల్ దాడులకు అమెరికా మద్దతిస్తున్నట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, అగ్రరాజ్యం గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోతే ఇజ్రాయెల్ తమపై దాడి చేసి ఉండేది కాదని తెలిపారు. తన తప్పు లేదని అమెరికా నిరూపించుకోవాలంటే ఇజ్రాయెల్ దాడులను బహిరంగంగా ఖండించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా టెల్ అవీవ్ చేస్తున్న దాడులపై ఐక్యరాజ్యసమితి ఉదాసీనత చూపిస్తోందని ఆరోపించారు. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించిన ఇజ్రాయెల్‌ను కాదని, పాశ్చాత్య దేశాలు ఇరాన్‌ను తప్పుబడుతున్నాయని అన్నారు.


# దొరికిన మాజీ సీఎం విజయ్ రూపానీ భౌతికఖాయం

**గాంధీ నగర్:** భారత విమానయాన రంగంలో అత్యంత ఘోర విషాదం నింపిన అహ్మదాబాద్ ఎయిరిండియా బోయింగ్ 787–8 డ్రీమ్ లైనర్ విమాన ప్రమాద మృతులు వివరాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఆదివారం ఒంటిగంట సమయంలో గుజరాత్ బీజేపీ సీనియర్ నేత మాజీ సీఎం విజయ్ రుపానీ భౌతికకాయాన్ని వైద్యులు గుర్తించారు. కుటుంబ సభ్యుల నుంచి సేకరించిన డీఎన్ఏ ఆధారంగా రూపానీ భౌతికకాయాన్ని గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం భౌతికకాయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందించే ఏర్పాట్లు ముమ్మరం చేశారు. రాజ్ కోట్‌లో రూపానీ అంత్యక్రియలు జరగనున్నాయి. జూన్ 12న సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి టేకాఫ్ అయిన %ూ×%171 బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ విమానం టేకాఫ్ అయిన కొద్ది క్షణాల్లోనే కూలిపోయింది. అందులో ఉన్న 242 మందిలో 241 మంది మరణించారు. మృతుల్లో 68 ఏళ్ల రూపానీ ఉన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్ అయిన కొద్ది సెకన్లలోని కూలిపోయింది. విమానాశ్రయ రన్‌వే నుండి కేవలం ఒక కిలోమీటరు దూరంలో ఉన్న మేఘానీ నగరం ప్రాంతంలోని బీజే మెడికల్ కాలేజీ క్యాంపస్ భవనంపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో విమానంలో ప్రయాణికులు సహా, మెడికల్ కాలేజీలో భోజనం చేస్తున్న వైద్య విద్యార్థులు, డాక్టర్లు, క్యాంటీన్‌లో పనిచేస్తున్న సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు.



# ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితులు.. భారతీయులకు అడ్వైజరీ

**ఇంటర్నెట్ డెస్క్:** ఇజ్రాయెల్– ఇరాన్ మధ్య దాడులతో పశ్చిమాసియాలో మరోసారి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఇరాన్‌లోని భారతీయులకు అక్కడి మన రాయబార కార్యాలయం పలు సూచనలు జారీ చేసింది. దేశంలో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా.. ఎవరూ భయాందోళనకు గురికావొద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపింది. అదేవిధంగా టెహ్రాన్‌లోని దేశ రాయబార కార్యాలయంతో టచ్‌లో ఉండాలని సూచించింది. "ఇరాన్‌లోని భారత పౌరులు, భారత సంతతి వ్యక్తులు అప్రమత్తంగా వ్యవహరించాలి. అనవసర ప్రయాణాలు మానుకోవాలి. రాయబార కార్యాలయం సోషల్ మీడియా ఖాతాలను అనుసరించాలి. స్థానిక అధికారులు సూచించిన భద్రతా నిబంధనలు పాటించాలి" అని టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం 'ఎక్స్' వేదికగా తెలిపింది. ఓ గూగుల్ ఫాంను పోస్ట్ చేసి.. భారత పౌరులు తమ వివరాలను పొందుపర్చాలని సూచించింది. స్థానిక పరిస్థితులపై తాజా వివరాల కోసం ఓ టెలిగ్రామ్ లింక్‌ను షేర్ చేసింది. అదేవిధంగా హెల్ప్‌లైన్ నంబర్లను పోస్ట్ చేసింది. ఇరాన్‌లోని అణు, ఆయుధ, సైనిక స్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ శుక్రవారం భీకర దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. దీంతో టెహ్రాన్ సైతం ప్రతీకార దాడులకు దిగింది. ఇరాన్ అణు కార్యక్రమాన్ని, క్షిపణి వ్యవస్థలను సమూలంగా నిర్మూలించడమే తమ ధ్యేయమని నెతన్యాహు ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ ప్రయత్నంలో ఇది ఆరంభం మాత్రమేనని, మరిన్ని వైమానిక, క్షిపణి దాడులు చేపడతామని చెప్పారు. ఈ క్రమంలోనే ఇరాన్ ఆయుధ తయారీ కర్మాగారాల సమీపంలో నివసించే పౌరులు తక్షణమే ఆ ప్రదేశాలను ఖాళీ చేయాలని ఐడీఎఫ్ కోరింది.



# వీరంతా మృత్యువును తప్పించుకున్నారిలా..

**న్యూఢిల్లీ:** అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం చరిత్రలో పెను విషాదంగా నిలిచిపోనుంది. ఈ ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న మొత్తం 242 మంది ప్రయాణికులలో 241 మంది మృతి చెందారు. విశ్వాస్ రమేష్ అనే ప్రయాణికుడు మాత్రం ప్రమాదం నుంచి బయపడ్డారు. అయితే తల్లి మాట కారణంగా యమన్ వ్యాస్, సరైన పత్రాలు లేక జామిని, ప్రియా పటేల్, ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి భూమి చౌహాన్ ఈ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ప్రమాదం జరిగిన జూన్ 12న గుజరాత్‌కు చెందిన యమన్ వ్యాస్ అదే విమానంలో ఎక్కేందుకు ఇంటి నుంచి బయలుదేరారు. కుమారునికి వీడ్కోలు పలికే సమయంలో వ్యాస్ తల్లి భావోద్వేగానికి లోనయ్యింది. 'కొన్ని రోజులు ఇక్కడే ఉండవచ్చు కదా' అని అడిగింది. అంతే తల్లి ప్రేమకు తలొగ్గిన వ్యాస్ వెంటనే తన విమాన టికెట్‌ను రద్దు చేసుకున్నాడు. ఈ విమానం టేకాఫ్ అయిన కొన్ని సెకెన్లకే నేల కూలింది. విమాన ప్రమాదం వార్త వినగానే యమన్ దిగ్భ్రాంతికి లోనయ్యారు. తన తల్లే తనను కాపాడిందని ఆయన మీడియాకు తెలిపారు. యమన్ వ్యాస్ కొన్నేళ్లుగా యూకేలో పనిచేస్తున్నారు. రెండేళ్ల తర్వాత వడోదర వచ్చారు. తన కుటుంబంతో కొన్ని రోజులు ఉన్నాక, తిరిగి లండన్‌కు బయలుదేరారు. అయితే అతని తల్లి పట్టుబట్టడంతో తన ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. దీంతో ఆయన విమాన ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అహ్మదాబాద్‌లోని చంద్లోడియాకు చెందిన జామిని, ప్రియా పటేల్ కూడా ప్రమాదం నుంచి బయటపడ్డారు. వీరు తమ స్నేహితుని



ఆహ్వానం మేరకు ఎయిర్ ఇండియా బోయింగ్ 787–8 డ్రీమ్‌లైనర్ విమానంలో లండన్ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వీరు విజిటర్ వీసాపై ప్రయాణానికి బయలుదేరారు. అయితే వీరి దగ్గర కొన్ని పత్రాలు లేని?? కారణంగా, విమానం ఎక్కేందుకు అనుమతి లభించలేదు. దీంతో నిరాశగా ఇంటికి తిరుగుముఖం పట్టారు. ఇంతలో విమాన ప్రమాదం గురించి వారికి తెలిసింది. ఇదేవిధంగా భారత్‌కు వచ్చిన బ్రిటన్ నివాసి భూమి చౌహాన్ అహ్మదాబాద్‌లో భారీ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. దీంతో ఆమె విమానాశ్రయానికి చేరుకోవడంలో ఆలస్యమైంది. దీంతో ఆమె విమానం ఎక్కలేకపోయారు.

## పుణెలో ఘోర ప్రమాదం



ఇంటర్నెట్ డెస్క్: పుణెలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ఇంద్రాయణి నదిపై ఉన్న ఓ వంతెన కుప్పకూలింది. ఈ ఘటనలో అనేక మంది పర్యటకులు గల్లంతయ్యారు. వీరిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా ఆరుగురిని స్థానికులు రక్షించినట్లు సమాచారం. మిగతావారి కోసం గాలింపు కొనసాగుతోంది. పుణె జిల్లాలోని ఇంద్రాయణి నదిపై కుందమాలా పర్యాటక ప్రాంతానికి ఆదివారం పర్యటకులు పోటెత్తారు. అక్కడున్న ఇనుప వంతెనపై అనేక మంది వచ్చి నిలబడిన క్రమంలోనే కొంతభాగం ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో అనేక మంది నదిలో కొట్టుకుపోయారు. వెంటనే రంగంలోకి దిగిన స్థానిక పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. పలువురిని రక్షించినప్పటికీ.. అనేక మంది జాడ తెలియరాలేదు. ఇంద్రాయణి నదిపై ఈ ఇనుప వంతెనను 30 ఏళ్ల క్రితం నిర్మించినట్లు స్థానిక ఎమ్మెల్యే వెల్లడించారు. ఇది కేవలం కాలినడక మార్గమే. ప్రమాద సమయంలో వంతెనపై దాదాపు 100 మంది ఉన్నారని, అందులో అనేక మంది ఒడ్డుకు చేరుకున్నప్పటికీ పలువురు గల్లంతయ్యారని చెప్పారు. ఇదిలాఉంటే, మహారాష్ట్రలో అనేక ప్రాంతాల్లో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. పుణెతోపాటు, పింప్రీ చించ్వాడ్ ప్రాంతాలకు వాతావరణశాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

## నా భార్యకింకా తెలియదు..!



**అహ్మదాబాద్:** ప్రమాదానికి గురైన ఎయిరిండియా విమానం బీజే మెడికల్ కాలేజీ ప్రాంగణంలో ఓ టీ స్టాల్ వెనక కూలింది. ఆ టీ కొట్టు నడిపే సీతాబెన్ అనే మహిళ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకుంది. కాలిన గాయాలతో బతికి బయటపడింది. చెట్టుకింద టీస్టాల్లో నిద్రపోతున్న 14 ఏళ్ల కుమారుడు ఆకాశ్ మాత్రం మంటలకు బలయ్యాడు. తన వెనకగా చెలరేగుతున్న మంటల నుంచి సీతాబెన్ తప్పించుకుని పరుగెత్తుకుంటూ వస్తున్న వీడియో వైరల్‌గా మారింది. ఐసీయూలో కోలుకుంటున్న ఆమె మీడియాతో మాట్లాడింది. "నేను విమానాన్ని చూడలేదు. కానీ భారీ శబ్దం విన్పించింది. వెంటనే మంటలు, పొగ కమ్ము కుంటుండటంతో ఏమీ కన్పించకుండా పోయింది. భయపడి పరుగులు తీశాను" అంటూ గుర్తు చేసుకుంది.

**నా భార్యకింకా తెలియదు**

సీతాబెన్ భర్త సురేశ్‌కుమార్ కూడా ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. "ప్రమాద సమ యంలో నేను ఇంట్లో ఉన్నా. టీ స్టాల్లో ఉన్న నా భార్యకు ఆకాశ్ లంచ్ బాక్స్ తీసుకెళ్లాడు. తర్వాత అక్కడే పడుకుని ప్రమాదానికి బలైపో యాడు" అంటూ కన్నీటిపర్యంతమయ్యాడు. "ఈ ఘోరం గురించి నా భార్యకు ఇంకా చెప్పలేదు. నా కొడుకు మృతదేహం గుర్తించలేనంతగా కాలిపోయింది. దాంతో పరీక్షల నిమిత్తం నా డీఎన్ఏ నమూనా ఇచ్చా" అంటూ గుండెలవిసేలా రోదించాడు.

## జిప్‌లైన్ తెగడంతో 30 అడుగుల ఎత్తు నుంచి కింద పడ్డ బాలిక



**ఇంటర్నెట్ డెస్క్:** జిప్‌లైన్ తెగడంతో ఓ బాలిక కింద పడి తీవ్ర గాయాలపాలైన ఘటన మనాలీలో వెలుగు చూసింది. దాదాపు 30 అడుగుల ఎత్తు నుంచి కింద పడ్డ బాలికకు పలు చోట్ల ఫ్రాక్చర్‌లు అయ్యాయి. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన బాలిక (12) త్రిష బిజ్వే మనాలీలో విహారయాత్రకు వెళ్లిన సందర్భంగా ఈ ప్రమాదం జరిగింది. జిప్‌లైన్ ద్వారా లోయమీదుగా కిందకు వస్తుండగా ఒక్కసారిగా తాడు తెగింది. దీంతో, చిన్నారి దాదాపు 30 అడుగుల ఎత్తు నుంచి లోయలో పడిపోయింది. చిన్నారిని తీవ్ర గాయాలయ్యాయని కుటుంబసభ్యులు తెలిపారు. శస్త్రచికిత్స కూడా జరిగిందని అన్నారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు బాధిత బాలిక తండ్రి తెలిపారు. ఇదిలా ఉంటే.. ఆదివారం ఉత్తరాఖండ్‌లో హెలికాప్టర్ కుప్పకూలింది. డెహ్రాడూన్ నుంచి కేదార్‌నాథ్ వెళ్తున్న సమయంలో గౌరికుండ్, త్రిజుగి నారాయణ్ మధ్య హెలికాప్టర్ కూలిపోయింది. ఇది ఆర్యన్ కంపెనీకి చెందిన హెలికాప్టర్ అని తెలుస్తోంది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రతికూల వాతావరణమే ప్రమాదానికి కారణంగా సమాచారం. అంతకుమునుపు మరో హెలికాప్టర్ కూడా ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఈ వరుస ప్రమాదాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి సీరియస్ అయ్యారు. హెలీ సర్వీసులపై స్పెషల్ ఆపరేషన్ ప్రొసీజర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

## మరో ఎయిరిండియా విమానంలో సాంకేతిక సమస్య

**లక్నో:** మరో ఎయిరిండియా విమానంలో సాంకేతిక సమస్య తలెత్తింది. ఉత్తర ప్రదేశ్ నుంచి కోల్‌కతా బయల్దేరాల్సిన విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో సిబ్బంది ప్రయాణాన్ని నిలిపివేశారు. ముందస్తు షెడ్యూల్ ప్రకారం.. ఆదివారం (జూన్15)న ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌లోని హిండన్ విమానాశ్రయం నుంచి ఎయిరిండియాకు చెందిన ఎయిరిండియా విమానం కోల్‌కతాకు బయల్దేరాల్సి ఉంది. అయితే, ఎయిర్‌పోర్టు నుంచి విమానం టేకాఫ్ అవ్వాల్సి ఉండగా.. సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో అప్రమత్తమైన పైలెట్ వెంటనే విమానాన్ని నిలిపివేశారు. సాంకేతిక లోపంపై సమాచారం అందుకున్న ఇంజినీర్లు విమానంలో తలెత్తిన సమస్యను పరిష్కరించే పనిలోపడ్డారు. ఫలితంగా, భద్రతా కారణాల దృష్ట్యా టేకాఫ్ వాయిదా పడింది. తిరిగి విమాన కార్యకలాపాలపై అంతరాయం ఏర్పడింది.

# సూపర్ సిక్స్ కాదు.. ఫస్ట్ బాల్‌కే కూటమి ఔట్

**హైదరాబాద్:** తల్లికి వందనం పేరుతో కూటమి సర్కార్ మహా మోసం చేస్తోందని ఆరోపించారు మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్. మీకు 15వేలు, మీకు 18వేలు ఇస్తామని ఎన్నికల ముందు బీరాలు పలికి ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. మూడు ఉచిత సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒక్కటే ఇచ్చి చేతులు దులుపుకున్నారు అంటూ ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారని చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రజలు అడుగుతున్నారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలున్నా తల్లికి వందనం ఇస్తామన్నారు, ఏమైంది?. తల్లికి వందనం పేరుతో కూటమి సర్కార్ మహా మోసం చేస్తోంది. రూ.3000 నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు, ఇచ్చారా?. మీకు 15వేలు, మీకు 18వేలు ఇస్తామని ఎన్నికల ముందు బీరాలు పలికారు. మూడు ఉచిత సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒక్కటే ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఆడబిడ్డ నిధి కింద రూ.1500 ఇస్తామన్నారు.. ఏమైంది?. మహిళలకు ఉచిత బస్సు ఇంకా ఎప్పుడు ఇస్తారు?. అన్నదాత సుఖీభవ కింద ఇస్తామన్న రూ.20వేలు ఎక్కడ?. రాష్ట్రంలో దాదాపు 88 లక్షల మంది విద్యార్థులకు తల్లికి వందనం ఇవ్వాలి. సవాలక్ష ఆంక్షలతో పిల్లల సంఖ్య 66 లక్షలకు తగ్గించే కుట్ర చేస్తున్నారు. రాష్ట్ర ఖనిజ సంపదను రూ.9 వేల కోట్లకు తాకట్టు పెట్టారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో జరిగే కార్యక్రమాలు జరగడం లేదని ప్రజలు అంటున్నారు. సూపర్ సిక్స్ ఏమో కానీ.. ఫస్ట్ బాల్‌కే కూటమి ఔట్ అని సెటైర్లు వేశారు.

**ప్రశ్నలు చంద్రబాబుకు నచ్చవు..**

ఎవరైనా ప్రశ్నిస్తే చంద్రబాబుకు ఇష్టం ఉండదు. అది ప్రజలు అయినా ప్రతిపక్షం అయినా సరే. ఆర్థికశాఖ మీరే రివ్యూ చేస్తే మరి ఆర్థికశాఖ మంత్రి ఏం చేస్తున్నారు. ఏపీఎండీసీని శాశ్వతంగా తాకట్టు పెట్టారు. ఎన్నికల ముందు ఇంటి ఇంటికి వెళ్లి అబద్దాలు చెప్పారు. అధికారం లోకి వస్తే ఒకటికి నాలుగురెట్లు హామీలు ఇస్తామన్నారు. ఇప్పుడిపుడే ప్రజలకు మొత్తం అర్థం అవుతుంది. మీరు చెప్పింది చేయక పోతేనే ప్రజల్లో ఆగ్రహం వ్యక్తం అవుతుంది.



**ఇప్పుడు శ్రీలంక కావడం లేదా?**

మా హయాంలో ఒక పథకం ఒకరోజు ఆలస్యం అయితే మీడియా హడావుడి చేసింది. మరి ఇప్పుడు ఏమైంది ఒక్కరూ ప్రశ్నించరు. ఇప్పుడు మీరు మాకంటే ఎక్కువ అప్పులు చేస్తుంటే శ్రీలంక అవడం లేదా?. సంక్షేమ పథకాల్లో పీపీపీ కాన్సెప్ట్ ఏంటో అర్థం కావట్లేదు. పథకాల పేర్లు అయితే బాగుంటాయి. కానీ ఒక్కటి నెరవేరదు. టీడీపీకి పునాది సినిమా ఫీల్డ్ అందుకే పథకాల పేర్లు బాగుంటాయి. యువగలం పేరుతో యువకులను మోసం చేశారు. 20 లక్షల మంది యువకులను మోసం చేశారు. పోయిన బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు బడ్జెట్ కేటాయించినట్లు ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. మరి ప్రజలకు ఇచ్చారా?. ఆస్తి పోయినా ఆరోగ్యం పోయిన సంపాదించుకోవచ్చు. చంద్రబాబు ప్రతీసారి మోసాలతో క్రెడిబిలిటీ పోగొట్టుకున్నారు. బడ్జెట్ బుక్కులో ఎంత అప్పు ఉందనే సమాచారం కూడా పెట్టలేదు.

**ప్రశ్నిస్తాన్న వ్యక్తి ఎక్కడ?**

మేము ఏం చేస్తామో అది చెప్తాం. మీరేమో ఇవ్వబోతున్నాం.. రాబోతుంది అని చెబుతారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారు. సంక్షేమ క్యాలెండర్ ఇచ్చి మరీ మేము.. ప్రతి నెల ఒక పథకం అమలు చేశాం. చంద్రబాబు అధికారంలోకి వచ్చినపుడే ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి అని చెప్పారు. మాకంటే ఎక్కువ ఇబ్బందులు ఉన్నాయా?. కరోనా కూడా ఏమి లేదు కదా. మీ బడ్జెట్‌కు మా బడ్జెట్‌కు తేడా 10వేల కోట్లే. కానీ మీ డబ్బంతా ఎటు పోయింది?. ఒక్క సంక్షేమం అమలు చేయలేదు. ప్రశ్నిస్తా అన్న వ్యక్తి ఎటు పోయాడు. బయట వ్యాపారం జరగడం లేదు. సాయంత్రం 7 గంటలకే షాపులు అన్ని బంద్ అవుతున్నాయి. రాత్రి అయినా కూడా వెలుగులతో నడిచేది వైన్ షాప్ మాత్రమే. ఏపీ లో ప్రజలు మళ్లి అప్పుల్లో మునుగుతున్నారు. మళ్లీ కాల్ మనీ వ్యవహారం జరుగుతుంది. వ్యాపారాలు లేక ప్రైవేటు ఫైనాన్స్ సంస్థల వద్ద అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. సంపద సృష్టిలో వైఎస్సార్‌సీపీ హయంలో చివరి ఏడాది పది శాతం సంపద పెంచాం. మీరు మూడు శాతం పెంచారు. మరి ఎవరిది సంపద సృష్టి. అప్పు మాత్రం 30 శాతం పెంచారు. జీఎస్టీ వసూళ్ళలో కూడా 24 శాతం తగ్గింది. కానీ, చరిత్రలో అత్యధిక జీఎస్టీ వసూలు అని అబద్దాలు చెప్తున్నారు.

**ఉద్యోగులకు మోసం..**

ఉద్యోగులను చంద్రబాబు ప్రభుత్వం అడ్డంగా మోసం చేసింది. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్‌ను వాడుకుంది. రాష్ట్ర విభజన జరిగినపుడు పబ్లిక్ అకౌంట్ లయబిలిటీస్‌లో 2014 ఏడాదికి 32,990 కోట్లు ఉండగా అందులో ఆంధ్ర భాగం 19,130 కోట్లు దక్కింది. దాన్ని కాస్త చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయేసరికి అది 76,516 కోట్లకి పెంచారు. మా ప్రభుత్వం దిగిపోయేసరికి దాన్ని 76,038 కోట్లకు తగ్గించాం. 478 కోట్లు మేము తిరిగి ఉద్యోగులకు కట్టేశాం. ఇది ఉద్యోగులు బాగా గమనించాలి. దాదాపు 57వేల కోట్లు ఉద్యోగుల డబ్బులు వాడుకుంది బాబు ప్రభుత్వం.

**సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టు..**

ఎంతోమంది ప్రముఖ జర్నలిస్టులు వారి అభిప్రాయం తెలియజేస్తారు. కానీ, కొమ్మినేని మీద అంత ద్వేషం ఎందుకు?. ఆయన వయసు చూసైనా బాధ అనిపించలేదా?. మీ కోపాన్ని జర్నలిస్టుల మీద చూపిస్తారా?. జర్నలిస్టుకు ఉండాల్సిన హక్కులు కాపాడాలని సుప్రీంకోర్టు చెప్పింది. ప్రజా పరిపాలన చేయండి.. అంతేకానీ.. కోపం, ద్వేషంతో కూటమి పాలన నడుస్తోంది. మీటింగ్స్ పెట్టి మరి వైఎస్సార్‌సీపీ ఓటు వేస్తే పథకాలు ఇవ్వద్దని చెప్పడం అన్యాయం. మీరు ఒక్క పార్టీకి మాత్రమే ముఖ్యమంత్రి కాదు' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## ఇజ్రాయెల్-ఇరాన్ కూడా ఒక ఒప్పందం కుదుర్చుకోవాలి


అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రస్తుతం ఉద్రిక్తంగా మారిన ఇజ్రాయెల్-ఇరాన్ వివాదంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాలు చర్చల ద్వారా ఓ ఒప్పందానికి రావాలని, ఇటీవల తాను భారత్-పాకిస్తాన్‌ల మధ్య ఒప్పందం కుదిర్చిన తరహాలోనే ఇజ్రాయెల్-ఇరాన్ కూడా ఓ ఒప్పందం కుదుర్చుకోవాలని సూచించారు. ఇది కూడా సాధ్యమవుతుందని భావిస్తున్నానని ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం 'ట్రూత్ సోషల్'లో పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్ తనదైన శైలిలో స్పందించారు. "ఇరాన్, ఇజ్రాయెల్ ఓ ఒప్పందం చేసుకోవాలి, కచ్చితంగా చేసుకుంటాయి. గతంలో నేను భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఒప్పందం కుదిర్చినట్లే ఇది కూడా జరుగుతుంది. అమెరికాతో వాణిజ్యాన్ని (ట్రేడ్) ఉపయోగించి ఇరు దేశాల అద్భుతమైన నేతలతో చర్చలు జరిపి, సహేతుకత, సమన్వయం, వివేకాన్ని తీసుకువచ్చి, వారిని త్వరితగతిన ఓ నిర్ణయానికి వచ్చేలా చేసి, వివాదాన్ని ఆపగలిగాను!" అని ట్రంప్ తన పోస్ట్‌లో రాశారు. కేవలం భారత్-పాకిస్తాన్ వివాదమే కాకుండా, తాను మరికొన్ని అంతర్జాతీయ సమస్యలను కూడా పరిష్కరించానని ట్రంప్ చెప్పుకొచ్చారు. "నా మొదటి విడత అధ్యక్ష పదవీకాలంలో, సెర్బియా, కొసావోలు దశాబ్దాలుగా తీవ్రంగా ఘర్షణ పడుతుండేవి. ఆ చిరకాల వివాదం యుద్ధంగా మారేందుకు సిద్ధంగా ఉండేది. నేను దాన్ని ఆపాను. గత అధ్యక్షుడు బైడెన్ కొన్ని తెలివితక్కువ నిర్ణయాలతో దీర్ఘకాలిక అవకాశాలను దెబ్బతీశారు, కానీ నేను దాన్ని మళ్ళీ సరిచేస్తాను!" అని ట్రంప్ పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈజిప్ట్, ఇథియోపియాల మధ్య నైలు నదిపై నిర్మిస్తున్న భారీ డ్యామ్ విషయంలో తలెత్తిన వివాదాన్ని కూడా తానే పరిష్కరించానని ఆయన తెలిపారు. "నా జోక్యం వల్లే, కనీసం ఇప్పటికైనా అక్కడ శాంతి నెలకొంది, అది అలాగే ఉంటుంది! అదేవిధంగా, ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య కూడా త్వరలోనే శాంతి నెలకొంటుంది! ప్రస్తుతం అనేక ఫోన్ కాల్స్, సమావేశాలు జరుగుతున్నాయి. నేను చాలా చేస్తాను, కానీ దేనికీ నాకు గుర్తింపు రాదు, అయినా ఫర్వాలేదు, ప్రజలకు అర్థమవుతుంది"

## సైప్రస్ చేరుకున్న ప్రధాని మోదీ..



భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా ఆదివారం సైప్రస్‌కు చేరుకున్నారు. కెనడా, క్రొయేషియాలను కూడా సందర్శించనున్న ఈ పర్యటనకు సైప్రస్‌తో శ్రీకారం చుట్టారు. ఈ పర్యటన ద్వారా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడం, వాణిజ్యం, పెట్టుబడులు వంటి కీలక రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నారు. సైప్రస్‌లోని విమానాశ్రయంలో ప్రధానమంత్రి మోదీకి ఆ దేశ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్, ఆర్థిక మంత్రి కాన్‌స్టాంటినోస్ కోంబోస్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ ఘన స్వాగతం ఇరు దేశాల మధ్య ఉన్న చారిత్రక, గాఢమైన సంబంధాలకు అద్దం పడుతోంది. తన రాకకు సంబంధించిన చిత్రాలను ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ సందర్భంగా సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ కూడా ఎక్స్ ద్వారా ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతూ, "ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సైప్రస్‌కు స్వాగతం! యూరోపియన్ యూనియన్ ఆగ్నేయ సరిహద్దు, మధ్యధరా సముద్ర ముఖద్వారం వద్ద ఇది ఒక చారిత్రాత్మక పర్యటన. అపరిమితమైన వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఇది ఒక నూతన అధ్యాయం. మనం కలిసికట్టుగా మరింత పురోగతి సాధించడానికి, పరివర్తన చెందడానికి, మరింత అభివృద్ధి చెందడానికి వాగ్దానం చేస్తున్నాం" అని పేర్కొన్నారు. సైప్రస్ అధ్యక్షుడి ఆత్మీయ ఆతిథ్యానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలుపుతూ, "సైప్రస్‌లో అడుగుపెట్టాను. విమానాశ్రయంలో నన్ను స్వాగతించినందుకు సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్‌కు నా ధన్యవాదాలు. ఈ పర్యటన భారత్-సైప్రస్ సంబంధాలకు, ముఖ్యంగా వాణిజ్యం, పెట్టుబడులు వంటి రంగాల్లో మరింత ఊపునిస్తుంది" అని తన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. రెండు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని సైప్రస్‌లో పర్యటించడం ఇదే ప్రథమం కావడం గమనార్హం. ఈ పర్యటన సందర్భంగా ఇరు దేశాల నేతలు ద్వైపాక్షిక సంబంధాలను మరింతగా పెంపొందించుకోవడం, వాణిజ్యం, పెట్టుబడులు, భద్రత, సాంకేతికత వంటి రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకునే మార్గాలపై విస్తృతంగా చర్చించనున్నారు.

## బాసరలో విషాద ఘటన...
## గోదావరిలో నీటమునిగి ఐదుగురు మృతి



తెలంగాణలోని నిర్మల్ జిల్లాలో ఆదివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన బాసరలో గోదావరి నదిలో పుణ్యస్నానానికి వెళ్లిన ఐదుగురు యువకులు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో బాసరలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతులంతా హైదరాబాద్‌లోని చింతల్ ప్రాంతానికి చెందిన ఒకే కుటుంబ సభ్యులు కావడం గమనార్హం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రాజస్థాన్‌కు చెందిన ఒక కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. ఈ కుటుంబంలోని మొత్తం 18 మంది సభ్యులు ఆదివారం బాసరలోని సరస్వతీ అమ్మవారి దర్శనం కోసం, అలాగే గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించేందుకు వచ్చారు. ఆలయ దర్శనానికి ముందు, సంప్రదాయం ప్రకారం నదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఐదుగురు యువకులు నదిలోకి దిగి, నీటి ప్రవాహంలో లోపలికి వెళ్లారు. నీటి లోతుపై సరైన అంచనా లేకపోవడంతో వారు ఒక్కసారిగా మునిగిపోవడం ప్రారంభించారు. నది ఒడ్డున ఉన్న కుటుంబ సభ్యులు ఇది గమనించి కేకలు వేశారు. స్థానికులు వెంటనే స్పందించి వారిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు, నిపుణులైన ఈతగాళ్ల సహాయంతో నదిలో గాలింపు చర్యలు చేపట్టి ఐదుగురి మృతదేహాలను వెలికితీశారు. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా గోదావరి నదిలో నీటి ప్రవాహం పెరిగిందని అధికారులు తెలిపారు. మృతులను రాకేశ్, వినోద్, మదన్, రుతిక్, భరత్‌లుగా గుర్తించారు. వీరంతా 20 ఏళ్ల లోపు వయస్సు వారే కావడం మరింత ఆవేదనకు గురిచేస్తోంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గోదావరి ఘాట్ వద్ద తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు తక్షణమే తగిన భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి, అధికారులకు ఆదేశాలు**

ఈ దుర్ఘటనపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఐదుగురు యువకుల మృతి వార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఆయన అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నదులు, నీటిపారుదల ప్రాజెక్టుల వద్దకు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జలాశయాలు, నదులు, ప్రాజెక్టుల వద్ద లోతును తెలియజేస్తూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది జనవరిలో కొండపోచమ్మ జలాశయంలో ఐదుగురు హైదరాబాద్ విద్యార్థులు సెల్ఫీ తీసుకునే ప్రయత్నంలో నీట మునిగి చనిపోయారని, అలాగే వారం రోజుల క్రితం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బ్యారేజీలో ఆరుగురు యువకులు గల్లంతయ్యారని మంత్రి గుర్తుచేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు.

## ఆక్వా ఎగుమతులు, మ్యాంగో పల్ప్‌పై జీఎస్టీ తగ్గించండి

-మొదటిపేజీ తరువాయి

నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసే రూ.300 కోట్లలో టొబాకో బోర్డు రూ.150 కోట్లు భరించేలా చూడాలంటూ కేంద్ర మంత్రికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. పొగాకు ఉత్పత్తి, మార్కెటింగ్ వంటి అంశాలను టొబాకో బోర్డు ద్వారా నియంత్రించేలా చట్ట సవరణ చేయాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు కోరారు. ఆయిల్ పామ్ దిగుమతి సుంకాన్ని 10 శాతానికి తగ్గించడంపై పునరాలోచన చేయాలని పీయూష్ గోయల్‌ను చంద్రబాబు కోరారు. దిగుమతి సుంకం తగ్గించడం వల్ల రాష్ట్రంలోని పామాయిల్ రైతులకు సరైన ధర రావడం లేదని.. తీవ్రంగా నష్టపోతారని కేంద్ర మంత్రికి సీఎం చంద్రబాబు వివరించారు. దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయం.. కేంద్రం నిర్దేశించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ లక్ష్యాలకూ ఇబ్బందికరంగా ఉంటుందనే విషయాన్ని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. ఆక్వా ఎగుమతులపై అమెరికా విధించిన సుంకాల విషయంలో ఆ దేశంతో చర్చలు జరపాలని సీఎం చంద్రబాబు సూచించారు. సీఫుడ్‌పై అమెరికా విధించిన 27 శాతం సుంకం ఏపీలోని 8 లక్షల మంది ఆక్వా రైతులపై ప్రభావితం చూపుతోందని సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించారు. ఏపీ ఆక్వా రైతులపై ఈ భారాన్ని తగ్గించేలా చొరవ తీసుకోవాలని కేంద్రమంత్రికి విన్నవించారు. మ్యాంగో పల్ప్‌పై జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ని సీఎం చంద్రబాబు కోరారు. ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్టు పీయూష్ గోయల్‌కు సీఎం చంద్రబాబు గుర్తు చేశారు.

## తల్లికి వందనం సూపర్ సక్సెస్..

**అమరావతి:** తల్లికి వందనం సూపర్ సక్సెస్ అవ్వటంతో తల్లుల కళ్లలో ఆనందం చూసి జగన్ రెడ్డి కడుపు మంట మూడింతలు పెరిగిందని మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. మరోసారి తన విష పత్రికలో ఫేక్ ప్రచారానికి తెరలేపారని మండిపడ్డారు. ఆరుగురు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న తల్లులు, అనాథ శరణాలయాల్లో ఉంటున్న పిల్లలకు ఇంకా డబ్బులు జమ చేయలేదని వెల్లడించారు. గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం సిబ్బంది ఫీల్డ్ వెరిఫికేషన్ చేసిన తరువాత మాత్రమే వారికి నిధులు విడుదల అవుతాయన్నారు. దొంగ లెక్కలు, డబ్బులు కొట్టేయడం జగన్ రెడ్డి బ్రాండ్ అని దుయ్యబట్టారు. వైకాపా పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలే అందరూ చేస్తారనుకుంటే ఎలా అని ప్రశ్నించారు. మాది ప్రజా ప్రభుత్వం తప్పు చెయ్యం.. చెయ్యనివ్వమని స్పష్టం చేశారు. జగన్ రెడ్డికి కడుపు మంటగా ఉన్నట్టుంది.. రెండు ఈనో ప్యాకెట్లు పంపిస్తాను వాడండి.. కాస్త తగ్గుతుందని ఎద్దేవా చేశారు.

## మరోవైపు జెట్ స్పీడ్‌లో అమరావతి పనులు

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ భవనాలు, రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అమరావతిలో వేల మంది కార్మికులతో ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రాత్రిళ్లు రాజధాని వైపు చూస్తే విద్యుత్ వెలుగుల్లో యంత్రాలతో పోటీపడుతూ పనులు చేస్తున్న కార్మికులను చూడొచ్చు. అదేవిధంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల కోసం గుత్తేదారులు పని ప్రదేశాల వద్ద షెడ్లతో తాత్కాలిక నివాస సముదాయాలను ఏర్పాటు చేశారు. వారికి తాగునీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలను కల్పించారు. పశ్చిమ బెంగాల్, తెలంగాణ, బిహార్, ఒడిశా, వంటి రాష్ట్రాలకు చెందిన వారు వచ్చారు. మరోవైపు రాజధాని అమరావతిలో కూటమి ప్రభుత్వం ప్రపంచ స్థాయిలో మౌలిక వసతులను ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా అమరావతి అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో రాజధాని సీడ్ యాక్సెస్ రహదారి పక్కన భూగర్భ విధానంలో విద్యుత్ కేబుళ్ల ఏర్పాటుకు హెచ్‌డీపీఈ సిలికాన్ పైపుల నిర్మాణం చేస్తోంది. శనివారం రాజధాని గ్రామం ఉద్ధండరాయునిపాలెం వద్ద సీడ్ యాక్సెస్ రహదారి (ఈ-3) పక్కన ఎన్‌సీసీ గుత్తేదారు సంస్థ పనులను మొదలుపెట్టింది. ఐదు పైపులను ఒకదానిపై ఒకటి లేయర్లుగా అమర్చుతున్నారు.

## 'ఏడాదంతా మోసమే.. అంతా అభూత కల్పనే'



**తిరుపతి:** అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ప్రజలను వంచిస్తూనే ఉందని విమర్శించారు తిరుపతి, చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడుడ భూమన కరుణాకర్‌రెడ్డి. తమ నాయకుడు వైఎస్ జగన్.. రూ. 2 లక్షల 80 కోట్లు డీబీటీ రూపంలో ప్రజలకు నేరుగా అందిస్తే అంతకంటే ఎక్కువ ఇస్తామని చెప్పి చంద్రబాబు ప్రజలను నమ్మించి మోసం చేశాడన్నారు. ఈరోజు(ఆదివారం, జూన్ 15వ తేదీ) 'జగన్ అంటే నమ్మకం- చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని భూమన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఆర్‌కే రోజా, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ భరత్, మాజీ ఎమ్మెల్యే సునీల్, విజయానందరెడ్డి, నూకతోటి రాజేష్, తిరుపతి పార్లమెంట్ పరిశీలకుడు చవ్వా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా భూమన మాట్లాడుతూ.. 2 కోట్ల 7 లక్షల మంది మహిళలకు నెలకు రూ. 1500 ఇవ్వకుండా మోసం చేసిన ఘనత చంద్రబాబుదన్నారు. నిరుద్యోగ భృతి రూ. 3 వేలు ఇస్తామని చెప్పిన వ్యక్తి.. ఈ రోజు మోసం చేసిన విషయం కళ్లకు కనపడుతోందన్నారు. 30 లక్షల మంది తల్లులకు తల్లికి వందనం మోసం. రైతులకు రూ. 20 వేలు ఇస్తామని మోసం. తల్లికి వందనపై ప్రశ్నించే వాళ్లకు బెదిరింపులు. ఈ ఏడాది మొత్తం మోసాలు చేశాడు.. ఒక అభూత కల్పనతో మోసగించాడు. వైఎస్సార్‌సీపీ వాళ్లపై దాడులు చేయించి కేసులు పెట్టి జైల్లో పెట్టించాడు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 5 కోట్ల మంది ప్రజలకు వెన్నుపోటు పొడిచారు' అని భూమన ధ్వజమెత్తారు.

## తల్లికి వందనంపై వైసీపీవి అసత్య ఆరోపణలు

**హైదరాబాద్:** తల్లికి వందనం పథకంపై వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఏపీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకాన్ని కూటమి ప్రభుత్వంలో అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థికి రూ. 15వేలు అందిస్తున్నామని తెలిపారు. ఏపీవ్యాప్తంగా తల్లికి వందనం పథకాన్ని 65లక్షల మందికి అందజేశామని చెప్పారు. ఇవాళ(ఆదివారం) హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సందర్శించారు. అనంతరం మీడియాతో మంత్రి కొండపల్లి మాట్లాడారు. తల్లికి వందనం పథకాన్ని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్. చదువు ఒకటే భవిష్యత్‌ను మారుస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శమని ఉద్ఘాటించారు. విద్యార్థులకు సిలబస్‌లో అనేక మార్పులు చేస్తున్నామని అన్నారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో మెరుగైన విద్యాబోధన అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్‌కు తమ ప్రభుత్వం మంచి బాటలు వేస్తోందని చెప్పుకొచ్చారు. గత జగన్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యార్థులందరికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామన్నారు కానీ...ఒకరికే ఇచ్చారని అన్నారు మంత్రి కొండపల్లి శ్రీనివాస్. వైసీపీ చేస్తున్న ఆరోపణలను ప్రజలు అర్థం చేసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు దారుణంగా ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

## సంపాదకీయం

# సింధు జీవధార సమరాయుధమా


ఒక దేశం యుద్ధంలో ఉన్నప్పుడు ఆ దేశ ప్రజలు, నాయకులు శత్రుదేశానికి వ్యతిరేకంగా తీవ్ర ప్రకటనలు చేస్తారు. అవి ఆచరణ సాధ్యంకాకున్నా సరే. కానీ, బాధ్యతాయుతమైన నాయకులు ఆ ప్రకటనలను పదేపదే పునరుద్ఘాటిస్తే దేశ ప్రయోజనాల దృష్ట్యా వాటిని నిశితంగా పరిశీలించవలసి ఉన్నది. సింధు నదీజలాల ఒప్పందం (ఇండస్ వాటర్ ట్రీటీ%-% ఐడబ్ల్యుటి) విషయంలో అటువంటి పరిస్థితే ఇప్పుడు భారత్‌కు తటస్థించింది. సింధు నదీజలాల ఒప్పందం గురించి రాజకీయవేత్తలు ఇప్పుడు ఏమి మాట్లాడుతున్నప్పటికీ అది కాల పరీక్షకు నిలిచింది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య మూడు యుద్ధాలు జరిగినా వాటి ప్రభావం దాని అమలుపై పడలేదు. ఆ ఒప్పందాన్ని చారిత్రక తప్పిదంగా కొందరు ఘోషిస్తున్నారు. ఇది వివేకవంతమైన అభిప్రాయం కాదు. అంతకంటే మెరుగైన, ఉభయత్రా మేలైన ఒప్పందం ఇప్పుడు సాధ్యంకాదు. ఇరుగు పొరుగు దేశాలతో ఉమ్మడి నదీ పరీవాహక ప్రాంతాలున్న దేశం భారత్ మాత్రమే కాదు. ప్రపంచవ్యాప్తంగా కనీసం 286 నదీ పరీవాహక ప్రాంతాలను ఒకటి కంటే ఎక్కువ దేశాలు కలిగి ఉన్నాయి. 150కి పైగా దేశాలు వివిధ నదీ పరీవాహక ప్రాంతాలను పంచుకుంటున్నాయి. రాజకీయ సరిహద్దులను అధిగమించే నదీ పరీవాహక ప్రాంతాలు ప్రపంచ భూ విస్తీరణంలో 42 శాతంగా ఉన్నాయి. ఈ పరీవాహక ప్రాంతాలలో 300 కోట్ల మంది ప్రజలు నివసిస్తున్నారు. ఈ రివర్ బేసిన్‌ల నిర్వహణ, యాజమాన్యం వివిధ ఒప్పందాలకు అనుగుణంగా జరుగుతోంది. మన దేశం వివిధ నదీ పరీవాహక ప్రాతాలను డజన్‌కు పైగా దేశాలతో పంచుకుంటున్నది. ఆయా ప్రాంతాలకు భారత్ ఎగువ దేశంగాను, దిగువ దేశంగాను ఉన్నది. నదీజలాల పంపకానికి సంబంధించి అనేక అంతర్జాతీయ ఒప్పందాలు, మార్గదర్శక సూత్రాలు, చారిత్రక రివాజులు ఉన్నాయి. ప్రపంచ అగ్రరాజ్యంగా ప్రభవించాలని ఆకాంక్షిస్తున్న భారత్ వాటన్నిటినీ గౌరవించవలసి ఉన్నది. అది అనివార్యం. నీరు, ప్రాదేశిక హక్కులు ఉన్న భూమి కాదు. నది సదా దిగువకే ప్రవహిస్తుంది. వివిధ చట్టాల ప్రకారం నీటి నిర్వహణ, యాజమాన్యం ఉంటుంది. ఇది ఎవరూ కొట్టివేయలేని సత్యం. నదీ పరివాహక ప్రాంతాలకు సంబంధించిన ఒప్పందాలలో సింధు నదీజలాల ఒప్పందం (ఐడబ్ల్యుటి) కొంతమేరకు భిన్నమైనది. 1947లో దేశ విభజన కాలం నుంచి భారత్, పాకిస్థాన్‌ల మధ్య అపరిష్కృతంగా ఉన్న వివాదాన్ని సింధు ఒప్పందం ఒక కొలిక్కి తీసుకువచ్చింది. ప్రపంచవ్యాప్తంగా చాలా నదీ పరీవాహక ప్రాంతాల ఒప్పందాలు నదీజలాల పంపకానికి సంబంధించినవి కాగా ఐడబ్ల్యుటి నదుల విభజనకు సంబంధించినది. ఈ ఒప్పందం సమకూర్చిన ఏర్పాటును భారత్ స్వయంగా కోరుకున్నదే. ఇటువంటి ఏర్పాటుకు భారత్ 1954లో సానుకూలత చూపగా పాకిస్థాన్ దాన్ని అంగీకరించేందుకు చాలా సంవత్సరాలు తీసుకున్నది. ఐడబ్ల్యుటి కింద సింధు నదీ వ్యవస్థను పశ్చిమ, తూర్పు నదులుగా విభజించారు. పశ్చిమ నదులు అయిన జీలమ్, చీనాబ్, ఇండస్‌ను పాకిస్థాన్‌కు కేటాయించారు. తన భూభాగాల గుండా ప్రవహించే ఈ నదుల నీటిని భారత్ చాలా పరిమితంగా మాత్రమే వినియోగించుకోవలసి ఉన్నది. ఆ నదులలో మొత్తం ప్రవాహ పరిమాణంలో ఎటువంటి తేడా సంభవించకుండా ఉండేలా మాత్రమే వినియోగించుకోవాలి. ఈ ప్రకారం ఆ మూడు పశ్చిమ నదులపై భారత్ ఎటువంటి ఆనకట్టలు నిర్మించకూడదు. తూర్పు నదులు అయిన రావి, బియాస్, సట్లేజ్‌లను భారత్‌కు కేటాయించారు. ఈ మూడు నదులు పాకిస్థాన్‌లోకి ప్రవేశించేంతవరకు వాటిపై పూర్తి నియంత్రణ భారత్‌కు ఉంటుంది. ఈ నదులలోని ప్రతి చుక్క నీటిని భారత్ వినియోగించుకోవచ్చు. పాకిస్థాన్‌కు ఏ మాత్రం నీరు ప్రవహించకుండా చేసేందుకు కూడా భారత్‌కు హక్కులు ఉన్నాయి. పాకిస్థాన్‌కు ఆ నదులు ప్రవహించకుండా భారత్ అడ్డుకున్నా అది ఐడబ్ల్యుటి ఉల్లంఘన కిందకు రాదు. సింధు నదీపరివాహక ప్రాంతం నాలుగుదేశాల%-% పాకిస్థాన్, భారత్, చైనా, అఫ్ఘానిస్తాన్%-%లో 1.14 మిలియన్ చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్నది. సింధు ఆయకట్టులో నివసిస్తున్న మొత్తం జనాభా 2025లో 320మిలియన్లు. 2050 సంవత్సరం నాటికి ఈ జనాభా 380 మిలియన్లకు పెరగవచ్చని అంచనా. ఈ జనాభాలో 110 మిలియన్ (35శాతం) భారత్‌లో ఉండగా 195 మిలియన్ (61శాతం) పాకిస్థాన్‌లో ఉన్నారు. మిగతా 4శాతం మంది అఫ్ఘానిస్తాన్‌లో ఉన్నారు. చైనా పరిధిలో ఉన్న జనాభా సంఖ్య ఉపేక్షింపదగినది. పాకిస్థాన్ జనాభాలో 80 శాతం మంది, భారత్ జనాభాలో 8 శాతం మంది సింధు నదీపరివాహక ప్రాంతంలోనే నివసిస్తున్నారు. సింధు బేసిన్‌లో లభ్యమయ్యే మొత్తం ఉపరిత జలాల పరిమాణం 239 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బిసిఎమ్). ఇందులో తూర్పు నదుల నుంచి ప్రవహించేది 73.3 బిసిఎమ్‌లు. ఈ జలాలపై భారత్‌కు సంపూర్ణ హక్కులు ఉన్నాయి. వివిధ ప్రాకృతిక కారణాల వల్ల భారత్ ఈ జలాలను పూర్తిగా వినియోగించుకోలేకపోతోంది. కేవలం 46 బిసిఎమ్‌లను మాత్రమే వినియోగించుకోగలుగుతుంది. భారత్ తన అవసరాలకు తగ్గట్టుగా ఈ నీటిని వినియోగించుకోవచ్చు. అయితే కేవలం 16.3 బిసిఎమ్‌లను మాత్రమే నిల్వచేసుకోగల సామర్థ్యం మాత్రమే కలిగి ఉంది. మిగతా జలాలు పాకిస్థాన్‌లోకి ప్రవహిస్తున్నాయి. వాటిని నిలిపివేసే హక్కు భారత్‌కు ఉన్నది. అయితే వాటిని నిల్వ చేసుకునే సామర్థ్యం భారత్‌కు లేదు. పాకిస్థాన్‌కు కేటాయించిన పశ్చిమ నదుల నుంచి లభ్యమయ్యే సగటు నీటి సామర్థ్యం 165 బిసిఎమ్. ఐడబ్ల్యుటి ప్రకారం వాటిని సంపూర్ణంగా వినియోగించుకునే హక్కు పాకిస్థాన్‌కు ఉన్నది. తన భూభాగాల గుండా ప్రవహించే ఈ పశ్చిమ నదుల నీటిని మళ్లించేందుకుగానీ, నిల్వచేసుకునేందుకుగానీ భారత్‌కు హక్కు లేదు. ఐడబ్ల్యుటి ఇప్పటికే అంతర్జాతీయ అంశమయింది. పాకిస్థాన్ దాన్ని తన ప్రచారానికి, ఉగ్రవాదంపై చర్చను దారి మళ్లించేందుకు పూర్తి స్థాయిలో ఉపయోగించుకుంటుంది. సాయుధ సంఘర్షణ కాలంలో నదీజలాల పరిరక్షణ విషయమై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి నిర్వహించిన ఒక సమావేశంలో భారత రాయబారి మాట్లాడుతూ సింధునది ఎగువ ప్రాంత దేశంగా భారత్ ఎల్లప్పుడూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ వస్తోందని పునరుద్ఘాటిస్తూ ఐడబ్ల్యుటి పీఠిక ప్రస్తావించిన 'సుహృద్భావ, స్నేహ స్ఫూర్తిని పాకిస్థానే ఉల్లంఘించిందని విమర్శించారు. ఉగ్రవాదులు తుల్‌బుల్ నేవిగేషన్ ప్రాజెక్ట్‌పై కూడా దాడి చేశారని ఆయన పేర్కొన్నారు. పాక్ ప్రేరేపిస్తున్న ఉగ్రవాదుల వల్ల ఆ ప్రాజెక్ట్ భద్రతకు, ప్రజల ప్రాణాలకు రక్షణ కొరవడుతోందని భారత రాయబారి అన్నారు. అదే సమావేశంలో పాకిస్థాన్ ప్రతినిధి సైమా సలీమ్ మాట్లాడుతూ పాకిస్థాన్‌లో 24కోట్ల ప్రజలకు ప్రాణరక్షకంగా ఉన్న సింధుజలాల ప్రవాహానికి భారత్ అవరోధాలు కల్పిస్తోందని అంటూ, 'నీరే ప్రాణం. అది సమరాయుధం కానేకాదు' అని వ్యాఖ్యానించారు. చెప్పవచ్చినదేమిటంటే ఐడబ్ల్యుటి భవిష్యత్తును న్యూఢిల్లీలో నిర్ణయించేందుకు ఆస్కారం లేనేలేదు. అంతర్జాతీయ వేదికలలోను లేదా అంతర్జాతీయ న్యాయస్థానంలో దానిపై విస్తృత చర్చల ద్వారా అది నిర్ణయమవుతుందనేది స్పష్టం. సింధు వివాదానికి ఇటువంటి పరిష్కారం కోసమే పాకిస్థాన్ సకల ప్రయత్నాలు చేస్తోంది. పహల్గాం ఉగ్రఘాతుకానికి మొదటి ప్రతిస్పందనగా సింధు నదీజలాల ఒప్పందం అమలును నిలిపివేస్తామని భారత్ ప్రకటించింది. 2016లో కూడా భారత్ ఇటువంటి హెచ్చరికే చేసింది. అయితే అప్పుడుగానీ, ఆ తరువాత గానీ ఏమీ జరగలేదు. తమ పోరాటం ఉగ్రవాదుల నిర్మూలనకేనని భారత్ పదేపదే చెప్పుతుండగా ఐడబ్ల్యుటి అమలును నిలిపివేయడం తమ ప్రజలను అకారణంగా శిక్షించడమేనని పాకిస్థాన్ ఆక్రోశిస్తోంది. ఆపరేషన్ సిందూర్ పూర్వాపరాలను ప్రపంచ దేశాల నాయకులకు వివరించేందుకు మోదీ సర్కార్ పంపించిన భారత పార్లమెంటరీ ప్రతినిధుల బృందాలు ఐడబ్ల్యుటి అమలు నిలిపివేత విషయంలో ఎదురైన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంలో ఇబ్బందుల నెదుర్కొన్నాయి. అంతర్జాతీయ పర్యవసానాలను ఉపేక్షించి పాకిస్థాన్‌కు ప్రవహించే సింధు జలాలను నిలిపివేసేందుకు భారత్ దృఢంగా నిర్ణయించుకుందనే అనుకుందాం. ఆ నిర్ణయాన్ని అమలుపరచడం సాధ్యమవుతుందా? సింధునదిపై భారత ప్రభుత్వ నివేదిక ఒకటి ఇండస్ బేసినులో సగటు నీటి లభ్యత 73 బిసిఎమ్ (బిలియన్ క్యూబిక్ మీటర్లు) పేర్కొంది. ఉపయోగించుకోగల మొత్తం ఉపరితల జలాల లభ్యత 46 బిసిఎమ్ అని, ప్రస్తుత 'లైవ్ స్టోరేజి కెపాసిటీ' 16.3 బిసిఎమ్ అని ఆ నివేదిక పేర్కొంది.

# మట్టిని మట్టుపెడుతున్న మందు



పుడమి గర్భంలోని జీవాన్ని హరిస్తున్నది కలుపు కాదు, కలుపును చంపేందుకు మానవులు చేస్తున్న చర్యలే. దానికి మూలకారణం గ్లైఫోసేట్' అనే నాన్-సెలెక్టివ్ హెర్బిసైడ్. ఇది వాడిన భూమిలో జీవమనేదే మిగలదు. ఈ రసాయనం పడిన చోట మట్టి శ్వాస కూడా తీసుకోలేదు. పంటల మీద పడితే మాడిపోతాయి. ఆ మందు వాడిన గడ్డిని తినే మూగజీవాలు సైతం చనిపోతాయి. రైతులు తీవ్ర అనారోగ్యాల బారినపడతారు. భూమిలో జీవానికి, భూమిపై మానవాళికి పెనుముప్పుగా మారిన ఈ గడ్డి మందును చాలా దేశాలు నిషేధించాయి. కానీ, మన దేశంలో మాత్రం యథేచ్ఛగా క్రయవిక్రయాలు జరుగుతుండటం శోచనీయం.అమెరికాలోని ఒక ప్రముఖ కంపెనీ 1970లో మొదటిసారిగా గ్లైఫోసేట్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఇది మొక్కల్లోని ఒక ముఖ్యమైన ఎంజైమ్‌ను నిరోధించి, మొక్కల ఎదుగుదలను అడ్డగిస్తుంది. దీన్ని ప్రధానంగా కలుపు నివారణ కోసం వాడుతున్నప్పటికీ, ఇది పంటలు, మట్టిలోని ఇతర జీవులపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. కూలీల ఖర్చులను తగ్గించేందుకు రైతులు గ్లైఫోసేట్‌ను విస్తృతంగా వాడుతున్నారు. కలుపును నివారిస్తున్నట్టు అన్నదాతలు భావిస్తున్నారు. కానీ, దీర్ఘకాలంలో భూసారం తగ్గిపోయి దిగుబడి పడిపోతుంది. అంతేకాదు, కర్షకులు కూడా రోగాల బారినపడి అనవసర ఖర్చుల భారం మోయాల్సి వస్తుంది. గ్లైఫోసేట్ పిచికారి మూలంగా నెలకు సగటున 12 మంది రైతులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నట్టు 2023లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఒక అధ్యయనంలో తేలింది. ఎయిమ్స్ నివేదిక ప్రకారం.. గ్లైఫోసేట్ వ్యాప్తి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో గర్భస్థ శిశువుల వృద్ధిలో లోపాలు 18 శాతం వరకు పెరిగాయి. గ్లైఫోసేట్ వల్ల మట్టిలోని ఫంగై, బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవులు నశించి హ్యూమస్ ఉత్పత్తి నిలిచిపోతుంది. ఇది కార్బన్ నిల్వల తగ్గుదలకు దారితీసి, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాన్ని పెంచుతుంది. తద్వారా వాతావరణ మార్పులకు ఇది పరోక్షంగా కారకమవుతుంది. దీని వాడకం గణనీయంగా పెరగడం వల్ల వాతావరణంపై దుష్ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఐరాస ఐపీసీసీ-2022 నివేదిక స్పష్టం చేసింది. జర్మనీ, ఆస్ట్రియా, ఫ్రాన్స్, ఇటలీ, నెదర్లాండ్స్ వంటి దేశాల్లో ఈ రసాయనంపై నిషేధం కొనసాగుతున్నది. 2018లో అమెరికాలోని కాలిఫోర్నియాలో ఈ రసాయనాన్ని ఉత్పత్తి చేస్తున్న కంపెనీపై ఓ రైతు కేసు వేశాడు. దుష్ప్రభావాలు ఉన్నట్టు రుజువు కావడంతో సదరు రైతుకు 289 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాల్సి వచ్చింది. అమెరికాలో ఈ కంపెనీపై ఇప్పటివరకు ఇలాంటి కేసులు లక్షకు పైగా దాఖలయ్యాయి. ఆహార పదార్థాల్లో గ్లైఫోసేట్ అవశేషాలు ఎక్కువవుతున్నాయని కెనడాలో హెచ్చరికలు జారీ అయ్యాయి. 2022 నవంబర్‌లో కేంద్ర ప్రభుత్వం దీనిపై పాక్షిక నిషేధం విధించింది. కానీ, అది నామమాత్రమే. రసాయన కంపెనీల ప్రలోభాలకు లోనై పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు దీని వినియోగాన్ని ప్రోత్సహిస్తుండటం విషాదం. ఏపీ, తెలంగాణల్లో గతంలో 60 రోజులపాటు తాత్కాలికంగా నిషేధించారు. కానీ, ప్రస్తుతం ఇది మార్కెట్లలో విచ్చలవిడిగా లభిస్తున్నది. తమకు అధికారం లేకపోయినా కేరళ, సిక్కిం లాంటి రాష్ట్రాలు రాజకీయ సంకల్పంతో శాశ్వత నిషేధాన్ని అమలు చేస్తున్నాయి. కానీ, ఏపీ, తెలంగాణల్లో మాత్రం ఆ సంకల్పం కొరవడింది. ఈ రసాయనాన్ని వినియోగిస్తున్న రైతులు ఆర్థికంగా, శారీరకంగా చితికిపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ శాఖ, పరిశోధన సంస్థలు తమ బాధ్యతను మరిచి కార్పొరేట్ కంపెనీల ప్రలోభాలకు తలొగ్గడంతో అన్నదాతల జీవితాలు ఆవిరైపోతున్నాయి. ఇప్పటికైనా గ్లైఫోసేట్‌పై శాశ్వత నిషేధం విధించాలి. జీవ, సేంద్రియ కలుపు నివారణ పద్ధతులను అభివృద్ధి చేయాలి. రైతులకు అవగాహన కల్పించాలి. రైతు శ్వాస ఆగకూడదంటే, మట్టిలో జీవం కొనసాగాలంటే, భవిష్యత్తు పంటల భద్రత కోసం ట్గ్లైఫోసేట్‌కు శాశ్వతంగా చరమగీతం పాడాలి. ఒక్క రైతే కాదు, మట్టి, ఒక తరం, దేశ భవిష్యత్తే ప్రమాదంలో ఉంది. దీన్ని మౌనంగా చూస్తూ ఉంటే మనం కూడా మట్టి గొంతు పిసికినవాళ్లమవుతాం. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు జీవరక్షణ యజ్ఞాన్ని ప్రారంభించాలి.

# తూర్పు ఆఫ్రికాలో ఇనుపపాము




తూర్పు ఆఫ్రికాలోని ప్రాంతాలను అనుసంధానించడానికి, కెన్యా నుంచి ఉగాండా వరకూ రైలు మార్గాన్ని నిర్మించాలని బ్రిటిష్ సామ్రాజ్య పాలకులు నిర్ణయించారు. చౌక శ్రమశక్తికి వెసులుబాటు కల్పించిన బానిసత్వ వ్యవస్థ అప్పటికే రద్దయ్యింది. దీంతో రైలు మార్గాన్ని నిర్మించడానికి కాంట్రాక్ట్ ప్రాతిపాదికన, తక్కువ ధరలో ఒప్పంద కార్మికులను భారతదేశం నుంచి తెచ్చుకోవచ్చు అనుకున్నారు తూర్పు ఆఫ్రికా వలస పాలకులు. దానికోసం 'ఇంపీరియల్ బ్రిటిష్ ఈస్ట్ ఆఫ్రికా కంపెనీ'ని 1888లో స్థాపించి, 1896లో మొంబాసా నుంచి విక్టోరియా సరస్సు దాకా రైల్వే ట్రాక్ నిర్మాణాన్ని ప్రారంభించారు. అవసరమైన కార్మికులు, సహాయక అధికారులను నియమించడానికి బాధ్యత వహించే ఒక ఏజెంట్‌ను కరాచీలో నియమించారు. ప్రధాన నియామక కేంద్రమైన లాహోర్‌లో ఒక బ్రాంచ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. భారతదేశంలో రైల్వే నిర్మాణాన్ని ప్రారంభించిన దాదాపు 40 సంవత్సరాల తరువాతనే, తూర్పు ఆఫ్రికాలో రైళ్ల నిర్మాణ ఆలోచన మొదలయింది. భారతదేశంలో అటువంటి నిర్మాణ పనుల్లో పనిచేసిన కార్మికుల మీద బ్రిటిష్ వారి దృష్టి పడింది. ఉచిత ప్రయాణం, ఉచిత భోజనం, జీతం, ఉచితంగా తిరుగు ప్రయాణం లాంటి జనాకర్షక హామీలతో, పంజాబ్‌లోని గ్రామాల నుంచి కేవలం మగ, యువకార్మికులను సమీకరించగలిగారు. బ్రిటిష్ ఇండియా స్టీమ్ నావిగేషన్ కంపెనీకి చెందిన ప్రత్యేక చార్టర్డ్ స్టీమర్లలో వారినందరినీ కరాచీకి పంపారు. అక్కడి నుంచి మొంబాసాకు దాదాపు 3వేల మైళ్లు, తొమ్మిది రోజుల ప్రయాణం. 1896 జనవరి 24న మొంబాసాలో 350 మంది పంజాబీల మొదటి జట్టుతో ఒప్పంద కార్మిక వ్యవస్థ అక్కడ ప్రారంభమైంది. 7,500 మంది నైపుణ్యం ఉన్న కార్మికులు, 20 వేల మంది నైపుణ్యం లేని కార్మికులు భారతదేశం నుంచి వెళ్లారు. మొత్తం మీద, రైల్వే నిర్మాణంలో 32 వేల మంది భారతీయులు ఉపాధి పొందారు. 1898లో రైల్వే నిర్మాణం 100 మైళ్ల దూరం వరకూ సాగింది. తీరం నుంచి 326 కి.మీ దూరంలో ఉన్న నైరోబీకి మే 1899లో చేరుకుంది. ఆ తరువాత అక్కడ అది కీలకమైన ఓడరేవు అయింది. అయితే 200 మైళ్ల ప్రయాణం తరువాత, రైల్వే నిర్మాణంలో అత్యంత భయంకరమైన అధ్యాయాలలో ఒకటి 1898లో త్సావో నది మీద వంతెన నిర్మాణ సమయంలో జరిగింది. నరమాంస భక్షక మగ సింహాల జత, కార్మికుల శిబిరాలకు చేరి, రాత్రిపూట గుడారాలలో నిద్రిస్తున్న కార్మికులను బయటకు లాగి భక్షించేవి. పది నెలల పాటు కొనసాగిన ఆ దాడిలో వందమందికి పైగా మరణించారు. వందలాది మంది కార్మికులు త్సావో నుంచి పారిపోవడంతో రైల్వే నిర్మాణం దాదాపు ఆగిపోయింది. ఆ సింహాలు కొంతకాలం తర్వాత, పనిలో ఉన్న పురుషులను వెంబడించడంలో నిపుణులయ్యాయి. సింహాలు అనుసరించిన పద్ధతులు అసాధారణమైనవి కావడంతో, ఆ రెండు మగ సింహాలూ కచ్చితంగా సింహాల శరీరంలోకి ప్రవేశించిన దెయ్యాలని భారతీయ కార్మికులు నమ్మడం మొదలుపెట్టారు. సింహాలను అంతం చేసే పని రైల్వే నిర్మాణాన్ని పర్యవేక్షించే ఇంజనీర్, లెఫ్టినెంట్ కల్నల్ జాన్ ప్యాటర్సన్ మీద పడింది. వారాల తరబడి నిరంతరాయంగా వెంబడించిన తర్వాత, ప్యాటర్సన్ ప్రాణాలకు తెగించి సింహాలను అంతం చేయగలిగాడు. వీటి నిర్మూలన ఆ రైల్వే చరిత్రలో ఒక భయంకరమైన అధ్యాయానికి ముగింపు పలికింది. 'దెయ్యం' 'చీకటి' అనే మారుపేరుతో వాటిని చెప్పుకునేవారు. రైలు నైరోబీ రైల్వే రిఫ్ట్ వ్యాలీ వైపు మళ్లిన తర్వాత ఆ ప్రాంతం మరీ ప్రమాదకరంగా మారింది. నిర్మాణం త్సావో నదికి చేరుకోకముందే, రైల్వే కార్మికుల మీద అక్కడి మాసాయి తెగ భయంకరంగా దాడి చేసింది. దానికి కారణం గతంలో (నవంబర్ 1895) ఇద్దరు మాసాయి గిరిజన బాలికల మీద అత్యాచారం జరగడమే. దానికి ప్రతిక్రియగా, మాసాయి తెగ దాదాపు ఆరు వందల మందికి పైగా రైల్వే కార్మికులను హతమార్చింది. మరొక ముఖ్యమైన ప్రతిబంధకం... అక్కడి సెత్సే దోమల కాటు. ఇవి కార్మికులలో నిద్ర జబ్బును సృష్టించేవి. క్లిష్టమైన భూభాగం కారణంగా చాలామంది మలేరియా, నల్ల జ్వరంతో మరణించారు. అనేక మరణాలకు అక్కడ ఏ వైద్య సదుపాయాలూ లేవు. పేలుడు పదార్థాలతో పని చేయడం వల్ల, వడదెబ్బల వల్ల, సొరంగాల తవ్వకాలలో కార్మికులు ప్రాణాలకు తెగించి పనిచేయాల్సి వచ్చేది. విక్టోరియా సరస్సుకి దగ్గరగా రైలు మార్గం విస్తరించడంతో నిర్మాణ పనుల్లో ఆటంకాలు మరింత పెరిగాయి. కార్మికుల పరిస్థితి మరింత దిగజారింది. అయినా భారతీయ ఒప్పంద కార్మికుల అకుంఠిత కృషి కారణంగా రైల్వే అథారిటీ ఆరేడు సంవత్సరాల వ్యవధిలోనే నిర్మాణాన్ని పూర్తి చేయగలిగింది. 1899లో తీరం నుంచి నైరోబీ వరకు, 1900 నాటికి నకురు ప్రాంతం వరకూ రైల్వే పనులు పూర్తయి, 1901లో విక్టోరియా సరస్సు తీరంలో కిసుము ప్రాంతానికి రైల్వే అథారిటీ చేరుకుంది. మొంబాసా నుంచి కిసుము దాదాపు 560 మైళ్ల దూరంలో ఉంది. కిసుముకు చేరుకునే నాటికి దాదాపు 2,500 మంది మరణించారు. 1903 నాటికి విక్టోరియా సరస్సు వరకు రైలు మార్గాన్ని వేగంగా అభివృద్ధి చేశారు. పూర్తిగా స్థానిక కార్మికులపై ఆధారపడి ఉంటే రైల్వే నిర్మాణం కనీసం ఇరవై సంవత్సరాలు పట్టేదని బ్రిటిష్ అధికారులే భావించారు. ఆ ప్రశంస, కీర్తి అక్కడి ఒప్పంద భారతీయ కార్మికులకే చెందుతాయి. రైల్వేను నిర్మించడానికి మొత్తం 31,983 మంది భారతీయ కార్మికులు పని చేశారు. 6,454 మంది వ్యక్తులు ట్రాక్‌లు వేయడం మూలంగా అశక్తులయారు. రైల్వే నిర్మాణం పూర్తయిన తర్వాత 6,724 మందిని వారి సంరక్షిత రాజ్యంలో పని చేసేందుకు తీసుకున్నారు. వీరిలో 2,000 మందిని మాత్రమే రైల్వే శాఖల్లో నియమించుకున్నారు. ఆఫ్రికా సమాజానికి ఆ రైల్వే అనేక విధాలుగా ఉపయోగపడింది. భారతీయ ఒప్పంద కార్మికులు పోషించిన పాత్రతో తరువాత ఆఫ్రికా సమాజంలో అనేక మార్పులొచ్చాయి. రైల్వే నిర్మాణానికి ప్రారంభ ఖర్చు 50 లక్షల డాలర్లుగా నిర్ణయించబడినా, దాని నిర్మాణానికి బ్రిటిష్ వారికి 90 లక్షల డాలర్ల వరకూ ఖర్చయింది. అది పార్లమెంటులోను, మీడియాలోను తీవ్ర ఆగ్రహాన్ని సృష్టించింది. నిర్మాణం ప్రారంభించకముందే, ఈ ఆలోచనను వ్యతిరేకించినవారు చాలా మంది ఉన్నారు. వీరిలో ఒకరైన హెన్రీ లాబౌచెర్ కామన్స్ సభలో బ్రిటిష్ విదేశాంగ మంత్రి జార్జ్ కర్జన్‌ను ఇలా ఆక్షేపించాడు: 'దీనికి ఎంత ఖర్చవుతుందో ఏ పదాలూ చెప్పలేవు/ దాని లక్ష్యం ఏమిటో ఏ మెదడూ ఊహించలేదు/ అది ఎక్కడి నుంచి మొదలవుతుందో ఎవరూ కనిపెట్టలేరు/ అది ఎక్కడికి వెళుతుందో ఎవరికీ తెలియదు... స్పష్టంగా అది ఒక ఉన్మాద లైను తప్ప మరొకటి కాదు' అని. ఉగాండా రైల్వేను లూనాటిక్ (ఉన్మాద/పిచ్చి) అనే పదంతో పేర్కొనడం అదే మొదటిసారి. 'లూనాటిక్ ఎక్స్‌ప్రెస్' అనే పదాన్ని చార్లెస్ మిల్లర్ 1971లో తన పుస్తకం 'ది లూనాటిక్ ఎక్స్‌ప్రెస్: యాన్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇన్ ఇంపీరియలిజం'లో ఉపయోగించాడు. అయితే కొంతమంది స్థానికులు ఆ ఎక్స్‌ప్రెస్‌ను 'ఇనుప పాము' అని పిలుచుకున్నారు. దానికి కారణం%-% ఇప్పుడు కెన్యాగా పిలువబడే ప్రదేశంలో యూరోపియన్లు అడుగుపెట్టడానికి వంద సంవత్సరాల క్రితమే, కిమ్నియోల్ అనే గిరిజన ప్రవక్త గడ్డి మైదానాల గుండా జారిపోయే ఒక క్రూరమైన 'ఇనుప పాము' గురించి మాట్లాడాడు. 'అది పశువులను మింగేస్తుందని, వారి భూములను దోచుకుంటుందని, దారిలో విధ్వంసం సృష్టిస్తుందని, ఆ మృగం, ఇంతకు ముందెన్నడూ చూడని ఒక రకమైన విదేశీయుడిని తీసుకువస్తుందని, ఒక రోజు వారి భూమిని పరిపాలించే వింతైన ఎర్రటి జుట్టు గల వ్యక్తిని తీసుకొస్తుందని' అతను చెప్పాడు. అతను చేసిన ప్రవచనం ఒక విషయాన్ని స్పష్టపరిచింది%-% అక్కడి ప్రజలకు కష్టాలు రాబోతున్నాయని! కిమ్నియోల్ ప్రవచనాలు నిజమని తేలినప్పటికీ 'ఇనుప పాము' ఆ ప్రజల జీవితాలను ఆయన కూడా ఊహించలేని విధంగా మార్చింది. ఆశ్చర్యంగా బ్రిటిష్ పత్రికలు సైతం దానిని 'ఇనుప పాము' అనే అన్నాయి, ఎందుకంటే దాని నిర్మాణ సమయంలో అపారమైన సంపద వృథా అయింది. ఆ ప్రాంతంలో నివసించిన తెగలు రైల్వే నిర్మాణాన్ని ప్రతిఘటించాయి. ఈ రైలు మార్గం ఉగాండా, కెన్యా అంతర్భాగాలను, కెన్యాలోని హిందూ మహాసముద్ర నౌకాశ్రయాన్ని మొంబాసాతో అనుసంధానించింది. మొదటి ప్రపంచ యుద్ధంలో తూర్పు ఆఫ్రికాలో జర్మనీని ఓడించడానికి బ్రిటిష్ వారికి సహాయపడి, ఇతర వలస రాజ్యాలతో కమ్యూనికేషన్ కొనసాగించడానికి చాలా ముఖ్యమైనదిగా మారింది. రైల్వే రాకముందు నైరోబీ జనావాసాలు లేని చిత్తడినేల. నేడు నైరోబీ కెన్యాలో ముప్పై లక్షలకు పైగా జనాభా ఉన్న అతిపెద్ద నగరం. నిద్రాణస్థితిలో ఉన్న తీరప్రాంతం మొంబాసా అనంతరం పట్టణమై, ఆధునిక ఓడరేవుగా రూపాంతరం చెందింది. కెన్యాతో పోలిస్తే ఉగాండాకు ఇప్పుడు వ్యవసాయం నుంచి సమృద్ధిగా రాబడి వస్తోంది. 1938 నాటికి, పత్తి సాగు ఒక్కటే 30 లక్షల ఎకరాల భూమిని ఆక్రమించింది. 1900%-%04 సంవత్సరాల మధ్య బ్రిటిష్ తూర్పు ఆఫ్రికా కమిషనర్‌గా ఉన్న చార్లెస్ ఎలియట్ వీటన్నింటినీ గమనించి ఇలా వ్యాఖ్యానించాడు: 'ఒక దేశం రైల్వేను సృష్టించడం అసాధారణం కాదు, కానీ రైల్వేనే ఒక దేశాన్ని సృష్టించడం అసాధారణం.'

# నిబంధనల పేరుతో తల్లికి వందనం కోతలు వద్దు

## డివైఎఫ్ఐ డిమాండ్

**బద్వేల్ జూన్ 15 (ప్రజా జ్యోతి న్యూస్)** ఆదివారం నాడు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఎటువంటి నిబంధనలు లేకుండా తల్లికి వందనం పథకాన్ని వర్తింపచేయాలని కోరుతూ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ తెలుగుదేశం కూటమి ఎన్నికల్లో వాగ్దానం చేసినట్లుగా 'తల్లికి వందనం' నగదును అర్హులైన విద్యార్థులందరికీ నిబంధనలు సడలించి తల్లుల ఖాతాల్లో జమ చేయాలని,అడ్డగోలు నిబంధనలతో దాదాపు 9 లక్షల కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. ఆదాయ పరిమితిని సడలించి గ్రామాల్లో 2.5 లక్షలు, పట్టణాల్లో 3 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలన్నింటినీ తల్లికి వందనం వర్తింపజేయాలని, ఆదాయంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారందరికీ పథకాన్ని వర్తింపజేయాలని, ఈ విద్యా సంవత్సరం ఒకటో తరగతి, ఇంటర్‌లో అడ్మిషన్లు అయిన వెంటనే వారికి కూడా నగదు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్కీం వర్కర్స్, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఈ పథకాన్ని వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విధించిన షరతులను నాడు విమర్శించిన కూటమి నేతలు నేడు అంతకుమించిన షరతులు పెట్టి లబ్దిదారులతోపాటు నగదును కూడా తగ్గించడం సరికాదు. రూ.15,000 వేలు నేరుగా తల్లులకు చెల్లిస్తామని, ఇప్పుడు రూ.2,000 మినహాయించారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా ఇస్తామని చెప్పి, ఫీజు రీఎంబర్స్‌మెంట్ పొందుతున్న కుటుంబంలోని విద్యార్థులకు ఈ పథకం అమలు కాకుండా మినహాయించడం హామీ ఉల్లంఘనే. ఇంత వరకు ఫీజురియంబర్స్‌మెంట్ ఎవరికీ ఇవ్వకుండానే ఆ పేరుతో తల్లికి వందనంపై కోత విధించడం అన్యాయం. విద్యాహక్కు చట్టం కింద ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న వారి తల్లులకు కాకుండా



నేరుగా స్కూళ్ల మేనేజ్‌మెంట్‌ల ఖాతాలకు చెల్లించడం ప్రభుత్వ విద్యను దెబ్బతీయడమే. గ్రామ వార్డు సచివాలయాలలో వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి అర్హులందరికీ ఈ పథకం అమలు చేయాలని డివైఎఫ్ఐ గా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి షేక్ ఆదిల్ భాష, రూరల్ అధ్యక్షులు ముడమాల ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు

# సామాన్యుని గోస పట్టించుకోరా

## నేటితో 300 రోజులుగా తిరుమల వెంకన్న సన్నిధిలో నిరసన దీక్షలు కూటమి ప్రభుత్వానికి పట్టని శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సమస్య పేదలకు న్యాయంకై సిఐటియు నేతల దీక్ష

**జూన్ 15, తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** 10 నెలల బాలుడి నుంచి 75 ఏళ్ల ముదుసలి వరకు కుటుంబ సభ్యులతో సహా శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు ఆదివారం నాడు దీక్షను చేపట్టారు. స్థానిక కపిల తీర్థం రోడ్ లోని టీటీడీ పరిపాలనా భవనం వద్ద జరుగుతున్న దీక్షలు 300 రోజుకు చేరుకున్న సందర్భంగా ఆదివారం నాడు పూర్తి రోజు నిరాహార దీక్షను చేపట్టారు. ఈ దీక్షలలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం, కార్యదర్శులు ఎస్. జయ చంద్ర, పి. మునిరాజలతోపాటు వ్యాపారులు, వారి కుటుంబ సభ్యులు సామూహికంగా నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ దీక్షలలో శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల కుటుంబాలలోని మహిళలు వారి పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఫాదర్స్ డే రోజున తండ్రుల పోరాటానికి మద్దతుగా పసిపిల్లలు డిమాండ్ల చార్టులను పట్టుకుని నినాదాలు చేయడం పలువురిని ఆకర్షించింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సంఘం గౌరవ అధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ చిన్న సమస్య పరిష్కారానికి వ్యాపారులు గత 300 రోజులుగా దీక్షలు చేస్తున్నా టిటిడి యాజమాన్యం గానీ, కూటమి ప్రభుత్వం గానీ పట్టించుకుని పరిష్కారం చేయకపోవడం అధర్మమని విమర్శించారు. టిటిడి చైర్మన్ గా బిఆర్ నాయుడు బాధ్యతలు తీసుకున్న తరువాత మొదటి బోర్డు సమావేశంలో శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల గురించి చర్చించామని సమస్యను పరిష్కరించామని స్వయంగా చైర్మన్ చెప్పిన తర్వాత కూడా సమస్యను పరిష్కరించక పోవడానికి కారణాలు ఏమిటో వెల్లడి చేయాలని కందారపు మురళి అన్నారు. టీటీడీ ఇఓ శ్యామలరావు, అడిషనల్ ఇఓ వెంకయ్య చౌదరిలు పలుమార్లు బాధితుల గోడు విన్నారని అయినా







సమస్య పరిష్కరించకపోవడం దారుణమని అన్నారు.

గత ప్రభుత్వ హయాంలో సమస్యల పరిష్కారం కోసం వీధుల్లో పోరాటం ఆనవాయితీ అయిందని, అటవీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మూడున్నర సంవత్సరాలు పాటు పోరాడామని, కూటమి హయాంలోనూ 300 రోజులు దీక్షలు పూర్తయ్యాయని... వైసీపీకి టిడిపి పాలనకు తేడా ఏమిటో బాధితులకు అర్థం కావడం లేదని విమర్శించారు. సమస్యల పట్ల సానుకూలంగా యాజమాన్యం స్పందించని పరిస్థితుల్లో చిరువ్యాపారులు కుటుంబాలతో సహా నిరవధిక దీక్షలకు పూనుకోవలసి వస్తుందని మురళి హెచ్చరించారు. అఖిలపక్షం మద్దతు శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల పోరాటం 300వ రోజుకు చేరుకోవడంతో వారికి మద్దతుగా వివిధ రాజకీయ పక్షాల నేతలు హాజరై ప్రసంగించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, రిపబ్లికన్ పార్టీ దక్షిణ భారత అధ్యక్షులు పూతలపట్టు అంజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాంగాటి గోపాల్ రెడ్డి, సిపిఐ నేత ఎన్ డీ రవి, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు నీరుగట్టు నగేష్, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ నేత డీఎంసీ భాస్కర్ తదితరు లు పాల్గొని మద్దతుగా ప్రసంగించారు. టీటీడీ యాజమాన్యం 300 రోజులుగా నిరసన దీక్షలు జరుగుతున్నా పట్టించుకోకుండా ప్రేక్షక పాత్ర వహించడం సమంజసమేనా? అని ప్రశ్నించారు. పలువురు ఐఏఎస్ లు, ఐపీఎస్ లతో కూడిన అత్యున్నత టీటీడీ వ్యవస్థలో పేదల ధర్మ పోరాటాన్ని ఇంతకాలం పట్టించుకోకపోవడం న్యాయం కాదని అన్నారు. బిఆర్ నాయుడు లాంటి వారు టీటీడీ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టినప్పుడు సామాన్యులకు వెసులుబాటు ఉంటుందని తాము భావించామని బి ఆర్ నాయుడు హయాంలోనూ సామాన్యులకు రక్షణ లభించకపోవడం ధార్మిక సంస్థలో సరైనది కాదని అన్నారు. తక్షణం టీటీడీ పాలకమండలి యాజమాన్యం పేదలైన శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల మద్దతు శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల పోరాటానికి అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా ) జిల్లా కార్యదర్శి పి. సాయి లక్ష్మి, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షులు జి చినబాబు, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ జి. నాగ వెంకటేష్ మద్దతు ప్రకటించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి సంఘ అధ్యక్షులు చిట్టిబాబు అధ్యక్షత వహించగా కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి మధు, యుగంధర్, ప్రకాష్ రామ్మూర్తి, శేఖర్, నరసింహ, మల్లి, మల్లికార్జున్, రాంబాబు, చిరంజీవి, శివ, గణేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కూర్మా గ్రామ ఆధ్యాత్మిక క్షేత్రాన్ని ఆదుకుంటాను హరే రామ హరే కృష్ణ స్వామీజీలకు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు..



**పాతపట్నం జూన్ 15 ప్రజా జ్యోతి న్యూస్..** పాతపట్నం నియోజకవర్గంలో ఉన్న ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన కూర్మ గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంపై విచారం వ్యక్తం చేస్తూ సంఘటన స్థలాన్ని పరిశీలించిన పాతపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే,అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ మెంబర్ మామిడి గోవిందరావు ప్రమాదంపై విచారణ జరిపించాలని అధికారులను ఆదేశిస్తూ తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత "హరే రామ" స్వామీజీలతో కలిసి కేంద్ర రాష్ట్ర, మంత్రివర్యులు, జిల్లా కలెక్టర్ తో, ముఖ్యంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుతో అగ్ని ప్రమాదం జరిగిన తీరును వివరిస్తూ సుమారు 56 లక్షల రూపాయలు ఆస్థి నష్టం సంభవించిందని తెలియజేయడంతో సానుకూలంగా స్పందించిన మంత్రివర్యులు ప్రభుత్వం తరపున మందిరం పునర్నిర్మాణానికి అన్ని విధాల సహకరిస్తామని తెలియజేశారు. అలాగే తన వంతు కూడా వ్యక్తిగత సహాయాన్ని అందిస్తూ వచ్చే కృష్ణాష్టమి నాటికి భక్తులకు అందుబాటులో ఉండే విధంగా పునర్నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.

## విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్

**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము :** జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా ఓపెన్ డ్రింకింగుపై ప్రత్యేక డ్రైవ్స్ చేపడుతున్న పోలీసు అధికారులు. గత ఐదు మాసాల్లో 2,178 డిడి కేసులు, 9,095 ఓడి కేసులు నమోదు చేసామన్న జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపీఎస్. పట్టుబడిన మందుబాబులకు జిల్లా ఎస్పీగారి ఆదేశాలతో కౌన్సిలింగు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు. విజయనగరం జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ జూన్ 15న మందుబాబులను హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మందుబాబులపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టేందుకుగాను జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, న్యూసెన్సు చేస్తూ, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై దాడులు చేయాలని, వారిపై కేసులు నమోదు చేయాలని, పట్టుబడిన మైనర్లుకు, మందుబాబులకు కౌన్సిలింగు నిర్వహించాలని అధికారులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జూన్ 15న స్పష్టమైన ఆదేశాలు జారీ చేసారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా సంబంధిత పోలీసు అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా లే-అవుట్లు, గ్రామ శివారు ప్రాంతాల్లోను, నగర శివారు ప్రాంతాల్లోను, బహిరంగంగా మద్యం సేవించిన వారిపై పోలీసు అధికారులు, సిబ్బంది డ్రోన్స్తో దాడులు నిర్వహిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తూ, ప్రజాశాంతికి భంగం కలిగిస్తున్న మందుబాబులపై కేసులు నమోదు చేస్తున్నారు. వాహన తనిఖీలు చేపట్టిన పోలీసు అధికారులు, సిబ్బంది రహదారి భద్రత నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులకు ఈ-చలానాలను విధించారని జిల్లా ఎస్పీ





తెలిపారు. అదే విధంగా మద్యం సేవించి, వాహనాలు నడిపిన వాహనదారులపై కేసులు నమోదు చేయడం, రహదారి భద్రత నియమాలు ఉల్లంఘించిన వారిపై ఈ చలానాలను విధిస్తున్నారు. ఈ సంవత్సరంలో గడిచిన ఐదు మాసాల్లో జనవరి 1 నుండి మే 31 వరకు మద్యం సేవించి, వాహనాలు నడిపిన వారిపై 2,178 కేసులు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై ప్రభుత్వం 9,095 కేసులు నమోదు చేసామని జిల్లా ఎస్పీ తెలిపారు. మద్యం సేవించి, పట్టుబడిన మందుబాబులకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దని, ప్రజాశాంతికి భంగం కలిగించవద్దని సంబంధిత పోలీసు అధికారులు కౌన్సిలింగు నిర్వహించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

## పాలకొల్లు రసధునిసాహితీ సంస్థకు నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక.



**పాలకొల్లు.ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం.** జూన్ 15. పాలకొల్లు లోని రసధుని సాహితీ సంస్థ సమావేశం అదివారం స్థానిక లైన్స్ క్లబ్ భవనం నందు జరిగింది. ఈ సమావేశంలో 2005-2008 సంవత్సరాలకు నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. హాజరయిన సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కొట్టి భాస్కరరావు ప్రధాన కార్యదర్శిగా యర్రంశెట్టి వెంకటరత్నం కోశాధికారిగా ముచ్చర్ల వెంకట సత్యనారాయణ ఉపాధ్యక్షులుగా చేగొండి రంగారావు వి. వి ఎస్ ఎన్ రాజు ర్యాలి విష్ణుమూర్తి కార్యదర్శులుగా గడ్డం లక్ష్మీనారాయణ ఎల్బీకే మూర్తి రాజు మామిడిశెట్టి శ్రీనివాసరావు కార్యవర్గ సభ్యులుగా జె జె దుర్గారావు సిహెచ్ వి యస్ అన్నపూర్ణేశ్వరరావు కోలాటి చిన పెద్దిరాజు భట్టిప్రోలుసత్యనారాయణ తటవర్తి సుధాకరరావు దంగేటి గోపాలకృష్ణ గోపరాజు శేష సత్యనారాయణ( గోపి) జె.య న్. వి కళ్యాణశ్రీ కుమార్ శ్రీమతి అంగర నాగలక్ష్మి మానస చిప్పాడవామనమూర్తి ఎంపికయ్యారు ఎన్నికల అధికారిగా వంగానరసింహారావు వ్యవహరించగా సహాయకునిగా ఎర్రా అజయ్ కుమార్ సహకరించారు. తదనంతరం జరిగిన రసధుని కార్యవర్గం సమావేశం లో గౌరవ సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా డా. పెద్దిభొట్ల లక్ష్మి నారాయణ సలహామండలి సభ్యులు గాలి డా. త్సవటపల్లి సత్యనారాయణ మూర్తి ( డాక్టర్ బాబ్జీ) వంగా నరసింహారావు, చేగొండి వి వి సత్యనారాయణ మూర్తి డా. కె ఎస్ పి ఎన్ వర్మ మాటూరినరసింహామూర్తి మాడభూషి కృష్ణ ప్రసాద్ ను ఎన్నుకున్నారు.

## సన్యాసయ్య పాలెంలో యోగాంధ్రా వేడుకలు.



**శృంగవరపుకోట ప్రజా జ్యోతి రిపోర్టర్ సురేంద్ర.** శృంగవరపుకోట మండలం ధర్మవరం గ్రామ పంచాయతీకి చెందిన సన్యాసయ్యపాలెంలోని శ్రీ సన్యాసేస్వర స్వామి దేవస్థానంలో యోగాంధ్ర కార్యక్రమాలు ఈవో ఎం. ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దేవాలయ పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, దేవస్థానం సిబ్బంది కలిసి యోగాసనాలు చేశారు . యోగ ద్వారా ఆరోగ్యం మరియు ప్రశాంతతకు యోగా ప్రాముఖ్యతను ప్రదర్శించారు. ఈవో ప్రసాదరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ, యోగా నిత్యజీవితంలో ఒక భాగంగా మారాలి అని కోరారు. యోగా ద్వారా మనస్సుకు ప్రశాంతత, శరీరానికి ఆరోగ్యం లభిస్తాయని రోజువారీ జీవితంలో యోగాసనాలు చేయడం వలన ఒత్తిడి తగ్గి, సుఖకరమైన జీవనశైలి అలవడుతుంది అని వివరించారు . ఈ కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ఆల్బిజెపి అధ్యక్షులు తేజేశ్వరరావు ఆధ్వర్యంలో 40 కుటుంబాలు బిజెపిలో చేరిక..



**పాతపట్నం, జూన్ 15: ప్రజా జ్యోతి న్యూస్..** పాతపట్నం నియోజకవర్గం, ఎల్ ఎన్ పేట మండలం చింతలబడవంజ గ్రామస్తులు ఆదివారం నాడు బిజెపి జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు సమక్షంలో 40 కుటుంబాల వారికి బిజెపి పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. గ్రామస్తులు మాట్లాడుతూ నరేంద్ర మోదీ పరిపాలన నచ్చి, ఈ దేశానికీ, రాష్ట్రానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నందున సాధారణంగా పార్టీ లోకి చేరుతున్నట్లు తెలియచేశారు, బీజేపీ అధ్యక్షులు మాట్లాడుతూ ఈ రోజు నరేంద్ర మోదీ పరిపాలన నచ్చి పార్టీ లోకి చేరినందుకు ధన్యవాదములు తెలియచేశారు,. అదేవిధంగా 11 సంవత్సరాలు పరిపాలన పూర్తి చేసుకున్న నరేంద్రమోడీ ఈ దేశానికీ, మనరాష్ట్రానికి, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసారని చెప్పారు.ఇప్పుడు ఈ దేశానికీ ఆయన సేవలు ఎంతో అవసరం అన్నారు. మీ లాంటి యువత, గ్రామస్తులు పార్టీ లోకి వస్తున్నందుకు చాలా సంతోషం గా ఉందని చెప్పారు.ఈ కార్యక్రమం లో పూర్వ మండల అధ్యక్షులు వాన వెంకటరమణ, మండల ప్రధాన కార్యదర్శి గండివలస సోమేశ్వరరావు, నూతన మండల అధ్యక్షులు మహంతి రవి గారు, బీజేపీ నాయకులు రవీంద్ర పానీగ్రహీ, చింతాడ జాన్, గ్రామస్తులు పాల్గున్నారు.

## క్రీడాకారులకు నిర్వహించిన ప్రమోషన్ బెల్ట్ టెస్ట్...





**జూన్ 15, తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** తిరుపతి శ్రీదేవి కాంప్లెక్స్ లోని తైక్వాండో ట్రైనింగ్ సెంటర్ లో ఆదివారం క్రీడాకారులకు ప్రమోషన్ బెల్ట్ టెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. ప్రమోషన్ బెల్ టెస్ట్ కు పరిశీలకులుగా విచ్చేసిన మాస్టర్ కె.గోపి నాయుడు పర్యవేక్షణలో జరిగింది. మొత్తం 25 మందికి ప్రమోషన్ బెల్ టెస్ట్ నిర్వహించగా ఇందులో 10 మంది శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి నర్సింగ్ సిబ్బంది పాల్గొని వివిధ బెల్టులు పొందడం ఆదర్శనీయమని తైక్వాండో సెంటర్ నిర్వాహకురాలు పి.గీతా తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖ వైద్యులు డాక్టర్ సత్య చేతుల మీదుగా పలువురికి వివిధ బెల్టులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో కోచ్ లు భవ్య, రమ్య తదితరులు పాల్గొన్నారు.

# బొద్దాం- కళ్లెంపూడి రోడ్డులో ఈత ఆడుతున్న బొద్దాం గ్రామస్తులు



**విజయనగరం జిల్లా, వేపాడ మండలం, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో రోడ్డులో ఉన్న ముడుకు లోతు గాతలలో కూర్చొని ఆందోళన. బొద్దాం - కల్లెంపూడి రోడ్డు కష్టాలు నేటికీ 10 ఏళ్లుగా పడుతున్న జిల్లా అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు గాని స్పందించకపోవడంతో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో రోడ్డుపై ఉన్న ముడుకు లోతు నీటిలో చల్లా జగన్ తో పాటు, గ్రామస్తులు దుకాణదారులు, బొద్దాం ఒబలయ్యపాలెం, ముకుందపురం, కళ్ళెంపూడి గ్రామానికి చెందిన పెద్దలు, యువకులు రోడ్డుపై ఆందోళన నిర్వహించారు ఈ సందర్భంగా చల్లా జగన్ మాట్లాడుతూ సాధారణ ప్రజలకు అవసరం ఉన్నా లేక పోయిన గ్రీన్ ఫీల్డ్ హైవే, ఇతర హైవేల పేరుతో నియోజవర్గాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్న అధికారులు బొద్ధం కళ్ళెంపూడి రోడ్డును పట్టించుకోకపోవడం అన్యాయం విచారకరమన్నారు గత పదిహేళ్లుగా ఆ రోడ్డుపై ఎల్లాలంటేనే నరకయాతన పడుతున్నారని అలాగే బద్దం నుంచి కాకులపాలెం వెళ్లే తోవలో ఉన్న రోడ్డుకి డ్రైనేజీ సిస్టం లేక రోడ్డుపైనే నీరు ఉండడం ఎప్పుడో వేసిన తార్రోడు మొత్తం పాడైపోవడంతొ ఆ రోడ్డుపై వెళ్లే గ్రామాలే కాకుండా, ఆ రోడ్డువైపే మొత్తం దుకాణాలు ఉండడం, విద్యార్థులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు గతంలో పాలించిన రెండు ప్రభుత్వాలు గానీ, కూటమి ప్రభుత్వం గానీ ఆ రోడ్డుపై దృష్టి పెట్టకపోవడం విచారణమన్నారు వెంటనే స్థానిక ప్రజాప్రతినిధులు , జిల్లా పరిషత్ చైర్మన్లు కలుగజేసుకొని నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలన్నారు నెల రోజుల్లో పనులు ప్రారంభించక పోతే మూడు పంచాయతీల ప్రజలు యువకులతో బొద్దాం నడిబొడ్డులో నిరాహార దీక్షకు దిగుతామన్నారు ఈ రోడ్డు విషయంలో ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకుడు చలుమూరు శ్యామ్, పచ్చిపులుసు నగేష్ , సాయిరాం, బొద్దం యువకులు, విద్యార్థులు దుకాణదారులు, కార్పెంటర్లు మహిళలు పాల్గొన్నారు

## ప్రమాదం జరిగిన 24 గంటల్లోనే చర్యలు చేపట్టడం హర్షనీయం..

కృష్ణాష్టమి నాటికి మందిరం పునర్నిర్మాణం పూర్తి చేస్తాం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు..

అగ్ని ప్రమాద సమాచారం ఎమ్మెల్యే తెలియజేసిన వెంటనే స్పందించిన కేంద్ర, రాష్ట్ర మంత్రివర్యులు..



**పాతపట్నం జూన్ 15, ప్రజా జ్యోతి న్యూస్..** ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం కూర్మ గ్రామంలో జరిగినటువంటి అగ్ని ప్రమాదంను పరిశీలించిన పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు తక్షణమే స్పందించి జిల్లా కలెక్టర్,జిల్లా మంత్రివర్యులు కింజరాపు అచ్చెన్నాయుడుకి,,కేంద్ర మంత్ర కింజరాపు రామ్మోహన్ నాయుడు కి ,ముఖ్యంగా రాష్ట్ర విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ బాబు దృష్టికి తీసుకురావడంతో స్పందించిన మంత్రులు ప్రభుత్వపరంగా అన్ని రకాలుగా ఆదుకుంటామని తెలియజేయడం హర్షనీయమని పాతపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు కూర్మ గ్రామంలో జరిగినటువంటి అగ్ని ప్రమాదంపై స్థానిక ఎమ్మెల్యే,ప్రభుత్వం స్పందించిన తీరుకు ధన్యవాదాలు తెలియజేస్తూ ఆదివారం నాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు,ప్రమాదం జరిగిన వెంటనే అధికారులతోనూ,మంత్రివర్యులతోనూ జరిగిన అగ్ని ప్రమాద నష్టాన్ని వివరించి పున:నిర్మానానికి విశేషంగా కృషి చేసినటువంటి స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు,పాల్గొన్నారు.ద

## సన్యాసయ్య పాలెంలో యోగాంధ్రా వేడుకలు.



**శృంగవరపుకోట, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** శృంగవరపుకోట మండలం ధర్మవరం గ్రామ పంచాయతీకి చెందిన సన్యాసయ్యపాలెంలోని శ్రీ సన్యాసేస్వర స్వామి దేవస్థానంలో యోగాంధ్ర కార్యక్రమాలు ఈవో ఎం. ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దేవాలయ పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, దేవస్థానం సిబ్బంది కలిసి యోగాసనాలు చేశారు . యోగ ద్వారా ఆరోగ్యం మరియు ప్రశాంతతకు యోగా ప్రాముఖ్యతను ప్రదర్శించారు.
ఈవో ప్రసాదరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ, యోగా నిత్యజీవితంలో ఒక భాగంగా మారాలి అని కోరారు. యోగా ద్వారా మనస్సుకు ప్రశాంతత, శరీరానికి ఆరోగ్యం లభిస్తాయని రోజువారీ జీవితంలో యోగాసనాలు చేయడం వలన ఒత్తిడి తగ్గి, సుఖకరమైన జీవనశైలి అలవడుతుంది అని వివరించారు . ఈ కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ విధానంలో బీజమృతం తయారీ



**పాతపట్నం జూన్ 15, ప్రజా జ్యోతి న్యూస్** ప్రకృతి సేద్యం... పుడమి తల్లికి నైవేద్యం... అనే నినాదంతో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో బద్దుమర్రి గ్రామంలో ఉండే రైతులకు ప్రకృతి చేద్యం పైన అవగాహన కల్పించారు.సీజన్ ప్రారంభం కావడంతో రైతుల్లో సేద్యం పైన మెలకువలను వివరిస్తూ రాబోవు తరానికి ఆదర్శవంతంగా గ్రామంలో ఉండే రైతులను తీర్చి దిద్దుతూ ప్రకృతిసేద్యం వైపు వారిని మళ్ళిస్తున్నారు అందులో భాగంగా గ్రామంలో సామూహికంగా బీజామృతాన్ని తయారు చేయించి ఉపయోగాలను వివరించారు ఈ బీజామృతం ఉపయోగించడం వలన విత్తనమునుంచే సంక్రమించే వ్యాధులు గాలి ద్వారా సంక్రమించే వ్యాధులు భూమి ద్వారా సంక్రమించే వ్యాధులు నుండి విత్తనం రక్షణగా మొలక 100 శాతం వచ్చే విధంగా ఈ బీజామృతం రక్షణ కవచంగా ఉండును మొలక శాతం పూర్తిస్థాయిలో వచ్చే విధంగా ఈ బీజామృతం ఉపయోగపడుతుంది, ఈరోజు వాతావరణ పరిస్థితుల రీత్యా ప్రతి ఒక్క రైతు సోదరులు కూడా తప్పనిసరిగా ప్రకృతి సేద్యాన్ని అవలంబించాలి ఎందుకంటే మనకు వచ్చేటటువంటి ప్రతి ఒక్క జబ్బుకి మందు ప్రకృతి సేద్యం అంటూ రైతులను చైతన్యపరిచారు ఈ బీజామృతం తయారీ విధానం ఒక పల్చటి గుడ్డలో ఐదు కేజీల పేడ వేసి మూటగా కట్టి 20 లీటర్ల నీటిలో దించాలి అందులో ఐదు లీటర్ల ఆవు మూత్రాన్ని వేయాలి 12 గంటల తర్వాత బీజామృతం తయారవుతుంది 50 గ్రాములు సున్నం ను కలుపుకోవాలి అని వివరించారు తయారు చేయడానికి ఎటువంటి ఖర్చు ఉండదు ఉపయోగించడం వలన అధిక ప్రయోజనాలు ఉంటాయని వివరించారు ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు ఆశ పోయిన రాంబాబు రైతులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భీమారావు మధుసూదన్ హాజరు కావడం జరిగింది.

## తల్లికి వందనంపై హర్షం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

గ్రామ కమిటీ కన్వీనర్ సంజీవ



**ప్రజా జ్యోతి తుగ్గలి** తుగ్గలి మండలం పరిధిలోనే రాతన గ్రామంలో శనివారం తల్లికి వందనం పథకంలో లబ్ధి పొందిన తల్లులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ కన్వీనర్ సంజీవ మాట్లాడుతూ ఎమ్మెల్యే కెఈ శ్యామ్ కుమార్, మాజీ సర్పంచ్ టిడిపి రైతు విభాగపు రాష్ట్ర ఉపాధ్యక్షులు మనోహర్ చౌదరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ అమ్మ ఒడి కార్యక్రమాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చికేవలం ఒక్కరికి మాత్రమే అమ్మ ఒడి అమలు చేసి తాము ఇచ్చిన హామీని విస్మరించిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పి ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం కుటుంబంలో ఎంత మంది ఉన్నా తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీ ప్రకారం తల్లుల ఖాతాలలో డబ్బులు జమ చేసిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా ఒక్కో పథకానికి సంబంధించి హామీలని అమలు చేస్తోందని, హామీలలో భాగంగా పేదలకు సంవత్సరానికి మూడు సిలిండర్లు పంపిణీ చేస్తుందని, అదేవిధంగా తల్లికి వందనం విజయవంతంగా అమలు చేసిందని, మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని రాబోయే ఆగస్టు నెలలో ప్రారంభం చేస్తోందని, అదేవిధంగా పేదల పక్షాన కూటమి ప్రభుత్వం ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పెద్ద ఈరన్న, చిన్న ఈరన్న ,మై రాముడు, ఆవుల కృష్ణమూర్తి, ఆవుల హనుమన్న ,మాజీ ఎంపిటిసి మారెన్న, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి అధ్యక్షులు తేజేశ్వరరావు ఆధ్వర్యంలో 40 కుటుంబాలు జెపిలో చేరిక..



**పాతపట్నం జూన్ 15 ప్రజా జ్యోతి న్యూస్..** పాతపట్నం నియోజకవర్గం, ఎల్ ఎన్ పేట మండలం చింతలబడవంజ గ్రామస్తులు ఆదివారం నాడు బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు సమక్షంలో 40 కుటుంబాల వారికి బిజెపి పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. గ్రామస్తులు మాట్లాడుతూ నరేంద్ర మోదీ పరిపాలన నచ్చి, ఈ దేశానికీ, రాష్ట్రానికి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నందున సాధారణంగా పార్టీ లోకి చేరుతున్నట్లు తెలియచేశారు, బీజేపీ అధ్యక్షులు మాట్లాడుతూ ఈ రోజు నరేంద్ర మోదీ పరిపాలన నచ్చి పార్టీ లోకి చేరినందుకు ధన్యవాదములు తెలియచేశారు,. అదేవిధంగా 11 సంవత్సరాలు పరిపాలన పూర్తి చేసుకున్న నరేంద్రమోడీ ఈ దేశానికీ, మనరాష్ట్రానికి, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసారని చెప్పారు.ఇప్పుడు ఈ దేశానికీ ఆయన సేవలు ఎంతో అవసరం అన్నారు. మీ లాంటి యువత, గ్రామస్తులు పార్టీ లోకి వస్తున్నందుకు చాలా సంతోషం గా ఉందని చెప్పారు.ఈ కార్యక్రమం లో పూర్వ మండల అధ్యక్షులు వాన వెంకటరమణ, మండల ప్రధాన కార్యదర్శి గండివలస సోమేశ్వరరావు, నూతన మండల అధ్యక్షులు మహంతి రవి గారు, బీజేపీ నాయకులు రవీంద్ర పానీగ్రహీ, చింతాడ జాన్, గ్రామస్తులు పాల్గున్నారు.

## పరిమిత విద్యుత్ లోడ్ వాడాలి

లేనియెడల అవసరం మేరకు జనరేటర్లు వినియోగించుకోవాలి

శ్రీకాకుళం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వర రావు,పొందూరు ఏ.ఈ వి సుధీర్



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్:** పొందూరు మండల కేంద్రంలో నేటి నుండి మూడు రోజుల పాటు 16,17,18 తేదీలలో జరుగుతున్న నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ పరిమిత విద్యుత్ లోడ్ ను ఉపయోగించాలని శ్రీకాకుళం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వర రావు, పొందూరు ఏ.ఈ వి సుధీర్ తెలిపారు. పరిమిత లోడ్ కు మించిన విద్యుత్ వినియోగించుకోవాల్సి వస్తే జనరేటర్లు వినియోగించుకోవాలని సూచించారు. జనరెటర్లు వినియోగించడం ద్వారా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు పై అధిక లోడ్ పడి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కావునా పరిమిత లోడ్ కు మించి ఉపయోగించాలి అనుకున్న వారు జనరేటర్లు పెట్టించుకోవాలన్నారు . వీటితో పాటు తమ తమ వీధులలో అలంకరణ కోసం వినియోగించే విద్యుత్ ను జనరేటర్ల ద్వారా వచ్చేలా ఉండాలని ,ప్రభుత్వం నుండి వచ్చే విద్యుత్ లైన్ లకు కలపరాదని ఆదేశించారు. ప్రతీ ఒక్కరూ విద్యుత్ శాఖ నిబంధనలు పాటించి ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలని ఎటువంటి విద్యుత్ సమస్యలు తలెత్తిన విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేయాలన్నారు.

## రామవరం లో మట్టిగోడ కూలిపడి ఇద్దరు మరణం.



**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము.** . గంట్యాడ మండలం లోని రామవరం గ్రామంలో ఈ ఆదివారం ఉదయం విషాదకరమైన ఘటన జరిగింది. ఒక ఇంటి మిద్దెను కూలదోస్తున్న కూలీలపై పక్కనున్న మట్టిగోడ అకస్మాత్తుగా కూలిపడింది. ఈ ఘటనలో ఇద్దరు కూలీలు ప్రాణాలు కోల్పోయారు. గ్రామస్తులైన ఎర్ర చెన్నయ్య (61), కొలుసు పైడితల్లి (45) గుర్తించారు. ఇద్దరూ ఒకే కుటుంబానికి చెందినవారని, ఈ ఘటన వల్ల కుటుంబీకులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారని స్థానికులు తెలిపారు. ప్రకారం, శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాల వల్ల మట్టిగోడ సడలిందని, దీంతో ఇద్దరు కూలీలు పనిచేస్తున్న సమయంలో గోడ కూలిపడిందని అంచనా. ఘటన తర్వాత స్థానికులు మృతదేహాలను శిథిలాల కింద నుండి తీసి ప్రాథమిక చికిత్సకు ఏర్పాట్లు చేసినప్పటికీ, వారిని రక్షించుకోలేకపోయారు. ఎస్ఐ సాయి కృష్ణ తన సిబ్బందితో సహా ఘటనా స్థలాన్ని సందర్శించి, వివరాలను సేకరించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఆదుర్దా అందించాలని స్థానికులు డిమాండ్ చేశారు.


# బాపట్లలో జూన్ 16న ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**బాపట్ల జూన్ 15 ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్** జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఉద్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఈ నెల 16వ తేదీ సోమవారం నాడు బాపట్ల కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు అని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాలు మరియు తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. అర్జీలు ముందుగా నమోదు చేసుకోవడానికి ఎవవవఎశీయుఎ వెబ్‌సైట్‌ను ఉపయోగించవచ్చని, అర్జీల స్థితి తెలుసుకోవడానికి 1100 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# చెరువు మట్టి అక్రమ రవాణా

**అంతా మా ఇష్టం ? మమ్మల్ని ఎవరు ఆపేది**
**ట్రాక్టర్ మట్టి రూ "1500**




**నందిగామ, జూన్ 15 (ప్రజా జ్యోతి)** నందిగామ మండల పరిధిలోని సోమవారం చెరువు నుంచి అక్రమంగా మట్టిని అక్రమంగా ప్రోక్లైన్ పెట్టి తరలిస్తున్న ట్రాక్టర్లన చెరువు మట్టి అక్రమ రవాణా ఆపేదెవరో చూద్దాం అంటున్నారు.ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ కోట్లాది రూపాయల మట్టిని అక్రమంగా మట్టి మాఫియా తరలిస్తున్న మామూళ్ల మత్తులో అధికారులు చర్యలు తీసుకోవడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.గోరంత అనుమతి పొంది కొండంత తవ్వకాలు జరుపుతున్న చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు. ప్రజాప్రతినిధుల తీరు పట్ల సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. నందిగామ మండల పరిధిలోని సోమవారం గ్రామ చెరువు నుండి గత నెలలుగా చెరువు మట్టి తరలింపుకు కొందరు వ్యాపారులు అనుమతి తీసుకున్నామని చెప్పి ఎలాంటి అనుమతి లేకుండా ఓ గ్రామ నాయకుడు వేలాది ట్రాక్టర్ల ట్రిప్పులు తోలి జేబులు నింపుకుంటుంటే అధికారుల కండ్లకు మాత్రం కానరావడం లేదు.ప్రతిరోజు పగలు, రాత్రి తేడా లేకుండా చెరువు మట్టిని వేలాది ట్రిప్పుల ట్రాక్టర్లు తరలించినట్లు స్థానికుల ఆరోపిస్తున్నారు. దీని పట్ల పట్ల అధికారుల నిర్లక్ష్యం అర్థమవుతుంది. ఇరిగేషన్ అధికారుల తీరు ఎలా ఉంది అంటే మాకు మామూలు ముడితే చాలు ఎన్ని ట్రిప్పులైనా ఎంతైనా ఎప్పుడైనా తరలించుకోవచ్చు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికారులు చెరువుల వైపు కన్నెత్తి చూడడం లేదు మట్టి మాఫియా ఏది చెపితే వాటికే అధికారులు తలాడిస్తున్నట్టు తెలుస్తుంది. మట్టి మాఫియా కనుసైగల్లో ఇరిగేషన్ అధికారులు నడుచుకుంటుంటే ఉన్నతాధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. చెరువులో మట్టి తరలింపు పారదర్శకంగా ఉండాలని ఉన్నతాధికారులు సూచించిన మార్గదర్శకాలను తుంగలో తొక్కుతూ మట్టి మాఫియా అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. చర్యలు తీసుకోవలసిన మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడం వారికి ఎంత మేరకు మామూలు ముట్టాయో తెలిపేందుకు నిదర్శనం అంటున్నారు ప్రజలు.ఇకనైనా అధికారులు నిద్రలేచి మట్టి మాఫియా పై చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

## తెలంగాణ ఉపముఖ్యమంత్రి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన.

**తుగ్గలి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అద్దంకి నాగార్జున యాదవ్.**



**ప్రజా జ్యోతి తుగ్గలి** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు మల్లు భట్టి విక్రమార్క జన్మదినోత్సవ సందర్భంగా తుగ్గలి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాగార్జున యాదవ్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపినట్లు, ఆదివారం విలేకరులకు ఫోను లో తెలిపారు, వారు మాట్లాడుతూ ఆయురారోగ్యాలతో మరిన్ని పదవులు చేపట్టాలని కోరుకుంటున్నట్లు తుగ్గలి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నాగార్జున యాదవ్ తెలిపారు,

## ఆత్మ రక్షణకు ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలి

**ప్రముఖ వైద్యులు మంజూర్**




**గుంతకల్లు జూన్ 15 (ప్రజాజ్యోతి):** గుంతకల్లు పట్టణంలోని ఎస్ ఎల్ వి థియేటర్ ఎదురుగా ఉన్న ఏ ఎస్ గోజు రియు కరాటే అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కరాటే కలర్ బెల్ట్ ఎగ్జామ్ లో అద్భుతమైన ప్రతిభ కనబర్చిన విజేతలకు ప్రశంసపత్రాలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి లుగాలి పాల్గొన్న కె.బి. హాస్పిటల్ ప్రముఖ వైద్యులు మంజూర్ పాల్గొని మాట్లాడుతూ ముఖ్యంగా అమ్మాయిలు ఆపదలో ఉన్నప్పుడు తనకు తాము ఆత్మరక్షణ కల్పించుకునేందు కు కరాటే ఎంతగానో దోహద పడుతుందని కరాటే నేర్చుకు న్న వారు ఎప్పుడు క్రమశిక్షణ తో సమాజంలో మెలుగుతార ని వారిలో ఆత్మస్థైర్యం శారీరక మానసిక దృఢత్వాన్ని ఎక్కువ కలిగి ఉంటారని పేర్కొన్నారు. నేటి సమాజంలో ప్రతి అమ్మాయికి కరాటే ఎంతగానో అవసరమని పేర్కొనడం జరిగింది.అనంతరం కరాటే ఎగ్జామ్ లో విశేష ప్రతిభను కనబరిచిన వారికి ప్రశంస పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ యాదవ్,సంఘ సేవకులు మేస్త్రి దొడ్డప్ప, మణికంఠ భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు విశ్వనాథ్ చౌదరి,కరాటే అకాడమీ అల్ ఇండియా చీఫ్ టెక్నికల్ డైరెక్టర్ అల్తాఫ్ పాషా,ఇన్స్ట్రక్టర్ ఎస్.ఫైరోజ్, గుంతకల్లు అకాడమీ ఇంచార్జ్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ ను కలిసి అభినందనలు తెలిపిన డీఈఓ వాసుదేవరావు



**తాళ్లపూడి,15 జూన్, ప్రజాజ్యోతి న్యూస్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సి కమిషన్ చైర్మన్ గా బాధ్యతలు తీసుకున్న కె.ఎస్ జవహర్ ను కొవ్వూరు పట్టణంలోని అయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు. ఈ సందర్భంగా డిఈ ఓ వాసుదేవుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నుండి వచ్చి ఎమ్మెల్యే, మంత్రి, ఎస్సీ కమిషన్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈయనతోపాటు ఉపాధ్యాయులు పరస జగన్నాథరావు తదితరులు ఉన్నారు

# తాత లీల వరప్రసాద్‌ను పరామర్శించిన బాపట్ల ఎమ్మెల్యే



**బాపట్ల జూన్ 15 ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్** కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెంకు చెందిన మాజీ ఎంపీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు తాత లీల వరప్రసాద్ కి ఇటీవల గుండె ఆపరేషన్ చేయగా, ఆయనను పరామర్శించేందుకు బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ ఆదివారం వారి నివాసానికి చేరుకున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ, వృద్ధ నాయకులను ఆదరించటం ప్రతి ప్రజాప్రతినిధి కర్తవ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు యోమినేని శంకర్రావు, ఉదయగిరి రాంబాబు, మహేష్, పమిడిబోయిన శ్రీనివాసరావు, తాత దిలీప్ తదితరులు పాల్గొన్నారు.


## మహిళలు వారి పిల్లలతో సీఎం చంద్రబాబుకు మంత్రి లోకేష్ కు పాలాభిషేకం




**గుంతకల్లు జూన్ 15 (ప్రజాజ్యోతి):** గుంతకల్లు పట్టణంలోని పాత గుంతకల్లు 9వ వార్డు నందు మాజీ కౌన్సిలర్ జి.లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రజలకు తల్లికి వందనం పేరిట రూ: 15,000 మహిళల బ్యాంకు ఖాతాలో జమ అయినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి కృతజ్ఞతలు తెలుపుతూ 9వ వార్డు మహిళలు,వారి పిల్లలతో కలిసి సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేయడం జరిగినది.ఈ యొక్క కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగరాజు, గుమ్మానూరు గోవిందు, నారాయణ,ఎం.హనుమేశ్,జి. రవి కుమార్,వార్డు మహిళలు, టిడిపి కుటుంబ సభ్యులు పాల్గొనటం జరిగినది.

# కోకో రైతులు నుంచి ప్రతి గింజ కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధం

**ఆర్డీవో రాణి సుస్మిత**
**కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక సెల**




**కొవ్వూరు/తాళ్లపూడి, జూన్15, ప్రజాజ్యోతి న్యూస్** కోకో రైతుల నుండి కోకో గింజల సేకరణ కోసం కలెక్టర్ పి.ప్రశాంతిఆదేశాలమేరకుకొవ్వూరు ఆర్డీవోకార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటుచేయడం జరిగిందని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత ఆదివారం ఒక ప్రకటనలో తెలియచేసారు రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి, ప్రభుత్వ ఆదేశాల మేరకు తూర్పు గోదావరి జిల్లాలో కోకో పండించే రైతుల వద్ద ఉన్న ప్రతి గింజ కొనుగోలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కోకో రైతులకు లావాదేవీలు నిర్వహించే క్రమంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నా, సమస్య ఉన్నా వాటిని పరిష్కరించే దిశలో కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో ప్రత్యేక సెల్ సోమవారం నుంచి అందుబాటులోకి తీసుకుని వస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పని దినాలలో ఉదయం 10.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు వినతులు స్వీకరించడంజరుగుతుందన్నారు. వాస్తవ సాగు దారుల నుంచి కోకో దిగుబడులను ఈ నెలాఖరు లోపు పూర్తిగా సేకరించనున్నట్లుతెలిపారు. కోకో పంటనుజూన్ 30వ తేదీలోగా సేకరించాలని అధికారులకి జిల్లా కలెక్టర్ లక్ష్యం నిర్దేశించినట్లు తెలిపారు. ఏదైనా సందేహాలు ఉంటే 7995367797 నెంబర్ కి కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని రైతులకి ఆర్డీవో రాణి సుస్మిత తెలియ చేశారు. కోకో రైతులకు కనీస మద్దతు ధర రూ.500 రావాలని ఈ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందుకోసం ఒక హార్టికల్చర్ అధికారినికూడాఅందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు

## రక్తదానం చేసి ఫాదర్స్ డే ం శుభాకాంక్షలు తెలియ చేసిన కూతుర్లు

**మా నాన్నే మాకు స్ఫూర్తి**



**గుంతకల్లు జూన్ 15 (ప్రజాజ్యోతి):** ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా రెడ్ డ్రాప్ బ్లడ్ ఆర్గనైజేషన్ ఫౌండర్ రెహమాన్ కూతుర్లు రక్తదానం చేసి తండ్రికి ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. పెద్ద కూతురు టంగుటూరి రేష్మా బి పాజిటివ్ 5వ సారి, చిన్న కూతురు టంగుటూరి రోశ్ని ఎ పాజిటివ్ 3సారి రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా టంగుటూరి రేష్మ, టంగుటూరు రోశ్ని మాట్లాడుతూ 12.5 హేమోగ్లోబిన్ కల్గి ఉండి,45 కిలోల బరువు ఉన్న యువతి యువకులు లింగ బేధం లేకుండా 60 సంవత్సరా ల వరకు రక్తదానం చేయవ చ్చు అని తెలుసుకుందామని, మన రక్తం వేరొకరి శరీరంలో ప్రాణవాయువులా జీవం పోస్తుంటే అంతకన్నా ఆనందం మరొకటి లేదు అని ఈ ఫాదర్స్ డే రోజు రక్తదానం చేసి మా నాన్న రెడ్ డ్రాప్ రెహమాన్ కి బహుమతి ఇచ్చామని టంగుటూరి రేష్మా టంగుటూరి రోశ్ని తెలిపారు.

# నిజాంపట్నంలో మాజీ సైనికుల సంఘం

**నేత కుమారుని వివాహానికి హాజరైన తాండ్ర**



**బాపట్ల జూన్ 15 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** నిజాంపట్నం మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు షేక్ సుల్తాన్ మెహబూబ్ కుమారుడు షేక్ ఇమామ్ వివాహ వేడుకలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.ఈ వేడుకలో బాపట్ల, పొన్నూరు, తెనాలి ప్రాంతాల మాజీ సైనికుల ప్రతినిధులు, సంఘాల అధ్యక్షులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వివాహం అంగరంగ వైభవంగా జరగడం సంతోషకరమని తాండ్ర వ్యాఖ్యానించారు.

## నాగేశ్వరరావుకు బాపట్ల జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నివాళి





**బాపట్ల జూన్ 15 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల:పట్టణానికి చెందిన సీనియర్ ప్రెస్ ఫోటోగ్రాఫర్ నాగేశ్వరరావు దశ దిన కర్మ సందర్భంగా జరిగిన సంస్మరణ కార్యక్రమంలో బాపట్ల జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అధ్యక్షుడు బి. ధనరాజు, ఉపాధ్యక్షుడు మేధా శ్రీనివాసరావు, కోశాధికారి కరీం, ఇతర సభ్యులు ఉప్పాల శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, మార్పు ఆనంద్, కాంద్రు సురేష్, షాజు నాగేశ్వరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం నాగేశ్వరరావు కుమార్తె రామలక్ష్మికి సంఘం తరపున రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు.

# 'గ్రేటర్' గాడిన పడేనా?




**వరంగల్:** బల్దియా కొత్త కమిషనర్ చౌహత్ బాజ్‌పాయ్‌కి నగరంలోని పలు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు కలెక్టరేట్ల పరిధిలో విస్తరించి ఉన్న జీడబ్ల్యూఎంసీ, కుడా ద్వారా అభివృద్ధి పనుల కోసం రూ. కోట్లు ఖర్చు చేస్తున్నా... క్షేత్రస్థాయిలో కొన్ని విభాగాల్లో కోరలు చాస్తున్న అవినీతి, అక్రమాల వల్ల చెడ్డ పేరు వస్తోంది. పార్కులు, చెరువులు, నాలాల ఆక్రమణలు.. అక్రమ నిర్మాణాలు నగరంలో విచ్చలవిడిగా సాగుతున్నా ఎవరికీ పట్టడం లేదు. భవన నిర్మాణదారుల సంఘం ఏకంగా సీఎం పేషీలోనే ఫిర్యాదు చేసింది. కార్పొరేషన్‌కు చెందిన ఓ కీలక ప్రజాప్రతినిధిని ఒప్పించి కాంట్రాక్టర్ల సిండికేట్‌కు ఎక్సెస్ టెండర్‌పై పనులు దక్కేలా ఇంజనీరింగ్ విభాగంలో కొందరు చక్రం తిప్పుతుండడం వివాదాస్పదమైంది. ఇదే సమయంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌తోపాటు కుడా వైస్ చైర్‌పర్సన్‌గా ఉన్న అశ్విని తానాజీ వాకడేపై బదిలీ వేటు పడడం చర్చనీయాంశంగా మారింది. కొత్తగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన చాహత్ బాజ్‌పాయ్ బల్దియాపై ప్రత్యేక దృష్టి సారిస్తేనే పాలన గాడిన పడుతుందన్న చర్చ సర్వత్రా జరుగుతోంది.

**ఎక్కడికెళ్లినా తిరిగి ఇక్కడికే...**

జీడబ్ల్యూఎంసీలో పని చేయడానికి అలవాటు పడిన అధికారులు ఎక్కడికి వెళ్లినా కొద్దిరోజులే. ఆరు నెలల నుంచి ఏడాది వ్యవధిలో మళ్లీ బల్దియాకే వస్తున్నారు. ప్రస్తుతం జీడబ్ల్యూఎంసీలో ఓ విభాగానికి కీలకాధికారిగా ఉన్న ఒకరు అతడి పదవికి ముప్పు వస్తుందంటే చాలు.. పాదరసంలా పావులు కదుపుతారు. ఈ టాలెంట్‌తోనే 22 నెలల కిందటి వరకు ఏడాదికోసారి రెన్యువల్ చేయించుకుని నాలుగేళ్లు గడిపిన ఆయన.. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కొద్ది రోజులు పనిచేశారు. పదోన్నతిపై ఆయన తిరిగి 2024 అక్టోబర్ చివరి వారంలో 'రాజా'లాగా బల్దియాలోని కీలకపోస్టులో చేరారు. ఆయన ఉన్న సమయంలోనే బల్దియా నిధుల దుర్వినియోగంతోపాటు పెద్ద సంఖ్యలో జరిగిన ఔట్ సోర్సింగ్ కార్మికుల నియామకాల్లో రూ.లక్షలు చేతులు మారాయన్న ఆరోపణలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏసీబీ, స్పెషల్ బ్రాంచ్‌లు విచారణ చేపట్టాయి.

జూనియర్ అసిస్టెంట్‌గా చేరి ట్యాక్స్ ఆఫీసర్‌స్థాయి వరకు ఎదిగిన మరో అధికారి సైతం 'బల్దియా'ను వదల అన్నారు. ప్రమోషన్‌కు ముందు.. తర్వాత కొద్ది మాసాలు మాత్రమే ఇతర మున్సిపాలిటీలకు వెళ్తూ వెంటనే జీడబ్ల్యూఎంసీకి రావడం ఇతడికి పరిపాటి. ఎన్నికల నిబంధనల మేరకు ట్యాక్స్ ఆఫీసర్‌గా వర్ధన్నపేట మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లిన ఆయన తిరిగి ఇటీవల మళ్లీ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కీలక పదవిలో చేరారు. పీహెచ్‌సీ వర్కర్ నుంచి టీఓ వరకు ఎదిగిన ఒకరు 'గ్రేటర్'ను వదలడం లేదు. హెల్త్‌అసిస్టెంట్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఇక్కడే పనిచేసి.. కమిషనర్ పదోన్నతిపై భూపాలపల్లి, పరకాల, నర్సంపేట మున్సిపాలిటీల్లో కొద్ది రోజులు మాత్రమే పనిచేసిన సదరు అధికారి పన్నుల విభాగం కీలక అధికారిగా చేరారు. ఇంజనీరింగ్ విభాగంలో చిన్న ఉద్యోగిగా విధుల్లో చేరిన ఒకరు ఓ ఉన్నతస్థాయి అధికారిగా ఎదిగి ఇక్కడే ఉద్యోగ విరమణ చేశారు. 'కుడా'లో డిప్యూటీ ఈఈ నుంచి ఎస్ఈ వరకు ఇక్కడి పనిచేస్తున్న ఓ అధికారి వరంగల్‌ను వదలడం లేదు. ఇలా చాలామంది ఉన్నారు.

కొత్త కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ కొరడా ఝుళిపించేనా..

జీడబ్ల్యూఎంసీ, 'కుడా'లో ఇష్టారాజ్యం.. పలు విభాగాలపై అవినీతి ఆరోపణలు

ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ తదితర శాఖలపై అవినీతి ఆరోపణలు పెరుగుతున్నాయి. వరంగల్ నగరం చుట్టూ విచ్చలవిడిగా ఏర్పాటవుతున్న రియల్ ఎస్టేట్ వెంచర్లు, నాన్ లేఅవుట్ ప్లాట్లను 'మామూలు'గా తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నగరంలో గొలుసుకట్టు చెరువులు, జీడబ్ల్యూఎంసీ స్థలాలు, కీలకమైన నాలాలను ఆక్రమించి వెంచర్ల వేయడంతో పాటు ఇండ్లు నిర్మించుకున్న వారికి అనుమతులు ఇచ్చి పెద్దమొత్తంలో వసూలు చేశారన్న ఫిర్యాదులపై 'విజిలెన్స్' విచారణకు ఆదేశించారు. ఆరు నెలల వ్యవధిలో ఇంజనీరింగ్ విభాగం ద్వారా నిర్వహించిన సుమారు రూ.314 కోట్ల ఈ%-%ప్రొక్యూర్‌మెంట్ టెండర్లలోనూ కాంట్రాక్టర్లను మిలాఖత్ చేసి 4.99 శాతం ఎక్సెస్ టెండర్ పనులు దక్కేలా చక్రం తిప్పారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా పెద్దమొత్తంలో అందరూ కలిసి వాటాలు పంచుకున్నారన్న ప్రచారం ఉంది.

# రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి



**చెన్నూరు :** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బంగారు భవిష్యత్తు అందించేందుకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ఆదివారం జిల్లాలోని మందమర్రి మండలం సండ్రన్ పల్లి గ్రామంలోని కెఆర్ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. సొంత ఇంటి స్థలం కలిగి ఉండి అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద రూ. 5 లక్షలు ఆర్థిక సహాయం, ఉచితంగా ఇసుకను అందజేస్తుందని పేర్కొన్నారు. గతంలో రూ. 5 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచిందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలోని సోమనపల్లిలో 200 కోట్ల రూపాయల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం 50 వేల ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తుందని వివరించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల నుంచి రూ. 2, 500 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో చేరడం సంతోషంగా ఉందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 419 మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. రైతు భీమా పథకం క్రింద 6 మంది లబ్ధిదారుల కుటుంబాలకు చెక్కులు అందజేశారు. మండలంలోని సారంగపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్ రావు, మందమర్రి మండల తహసీల్దార్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఆయురారోగ్యాలతో ఉండాలి



**రాజేంద్రనగర్ :** ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఆయురారోగ్యాలతో ఉండాలని కాంగ్రెస్ పార్టీ శంషాబాద్ మండల ప్రధాన కార్యదర్శి మహేందర్ ముదిరాజ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క జన్మదినం సందర్భంగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్ల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ లోని గాంధీభవన్లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన శంషాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మహేందర్ ముదిరాజ్, ఎన్ఎస్యుఐ రాష్ట్ర నాయకులు జిల్లా ఆనంద్. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క జన్మదిన సందర్భంగా రక్తదానం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. మనం రక్తదానం చేయడం వల్ల ఇతరులకు ప్రాణదానం చేసినట్లే అన్నారు. రాష్ట్రంలో 10 ఏళ్లపాటు ప్రజల పక్షాన ఉండి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఎంతో కృషి చేసిన నాయకుడు బట్టి విక్రమార్క అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఆధ్వర్యంలో రాష్ట్రం ఎంతగానో అభివృద్ధి చెందుతూ ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆశీర్వాదాలతో బట్టి విక్రమార్క అష్టైశ్వర్యాలతో ఆయురారోగ్యాలతో వందేళ్లు సుఖంగా ఉండి మరెన్నో పదవులు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహేందర్ ముదిరాజ్, ఎన్ఎస్యుఐ రాష్ట్ర నాయకులు జిల్లా ఆనంద్,కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేష్ నాయక్, ఆంజనేయులు, గోపాల్, పవన్, ఇంద్రారెడ్డి, రాజేష్, బొబ్బిలి శేఖర్, కృష్ణ, నర్సింలు తదితరులు పాల్గొని రక్తదానం చేశారు.

## టైగర్ కన్జర్వేషన్ రిజర్వు జీవోను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి



**కాగజ్ నగర్ :** కుమురంభీం టైగర్ కన్జర్వేషన్ రిజర్వు జీవోను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి సిర్పూర్ శాసన సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎటువంటి సంప్రదింపులు లేకుండా ఏక పక్షంగా, ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం జీవో నం.49 ను తీసుకువచ్చిందని ఆరోపించారు. జీవో వల్ల జిల్లాలోని రైతులకు, గిరిజనులకు, గిరిజనేతరులకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లోని దాదాపు 4 లక్షల ఎకరాల అటవీ ప్రాంతాన్ని కన్జర్వేషన్ రిజర్వుగా ప్రకటించడంతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడి, ప్రజలు తిరగలేని పరిస్థితి దాపురిస్తుందని తెలిపారు. ఇప్పటికే పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ రోడ్లకు కనీసం మరమ్మతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇంకా కన్జర్వేషన్ రిజర్వు పేరిట అటవీ అనుమతులు వచ్చే పరిస్థితి ఉండదని విమర్శించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు వేయలేని పరిస్థితి వచ్చిందని, తాగునీటికి బోరింగ్లు వేయనీయకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఇక టైగర్ కన్జర్వేషన్ రిజర్వు పేరిట అటవీ అధికారులు పెట్రేగి పోయి ప్రజల మాన ప్రాణాలతో చెలగాటం ఆడటం జరుగుతుందని ఆరోపించారు. జీవో నంబర్ 49పై ఆదివాసీ సంఘాలు ఆందోళన చేస్తుంటే, కనీసం మాట మాత్రం కూడా గిరిజన ఇన్‌చార్జి మంత్రి సీతక్క మాట మాత్రం స్పందించక పోవడం అన్యాయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ నిలదీసి అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రేపటి నుంచి బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయాల ఎదుట జీవో నం.49 ప్రతులను దహనం చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, పట్టణ అధ్యక్షులు శివ, మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్, మండల అధ్యక్షులు పుల్ల అశోక్, మాజీ ఎంపీటీసీ గణపతి, తిరుపతి, గజ్జల లక్ష్మణ్, తిరుపతి గౌడ్, మహేష్, చిలుకయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



**బెల్లంపల్లి :** తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బెల్లంపల్లి ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు యూనియన్ మంచిర్యాల జిల్లా జేఏసీ అధ్యక్షుడు కట్ట రాంకుమార్ తెలిపారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంటా చౌరస్తాలో సింగరేణి అన్వేషణ విభాగం ప్రహారీని ఆనుకుని ఉన్న స్థలాన్ని ఆటో యూనియన్‌కు కేటాయించాలని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లకు భోజన వసతి, మీటింగ్ హాల్ ఏర్పాటు చేసుకోవడానికి ప్రస్తుతం ఉన్న ఆటో స్టాండ్ స్థలాన్ని కేటాయిస్తూ అనుమతినివ్వాలని కోరారు. పట్టణంలో ఉన్న పలు ఆటో స్టాండ్ స్థలాలు కబ్జాలకు గురయ్యాయని, భవిష్యత్తులో ఆ స్థలాలు మరింతగా కబ్జా కాకుండా కలెక్టర్ చొరవ చూపాలని పేర్కొన్నారు. 30 సంవత్సరాలుగా ఆటోలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని వివరించారు. కబ్జాలను అడ్డుకోకపోతే తాము రోడ్డున పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెటూరి బస్టాండ్ వెనుక ప్రస్తుత ఆటో స్టాండ్‌ను కొంతమంది కబ్జా చేయడానికి యత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ స్థలాన్ని ఆటో యూనియన్‌కు మంజూరు చేయాలని కోరారు.

## ఏరువాక కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి



**కూసుమంచి :** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కూసుమంచిలో జరిగిన ఏరువాక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన స్వయంగా అరక పట్టి చేల్లో అచ్చు తోలిన అనంతరం మహిళా కూలీలతో కలిసి పత్తి గింజలను నాటారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతులకు పెట్టుబడి సాయం నిమిత్తం రైతు భరోసా కార్యక్రమం కింద సోమవారం నుంచి పెట్టుబడి సాయం అందిస్తామని తెలిపారు. సాగులో ఉన్న ప్రతి ఎకరానికి 12 వేల రూపాయల చొప్పున రైతు భరోసా అందిస్తామని హామీ ఇచ్చారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

## కేసుల పరిష్కారంలో రాజీమార్గమే రాజ మార్గం



**రాజేంద్రనగర్ :** కేసుల పరిష్కారంలో రాజీమార్గమే రాజ మార్గం అని రాజేంద్రనగర్ మండల్ న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ న్యాయమూర్తి నీలిమ అన్నారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ పదకొండవ అదనపు న్యాయమూర్తి నీలిమ ఆధ్వర్యంలో ఆదివారం రాజేంద్రనగర్ లోని కోర్టు వద్ద నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం 2,046 కేసులను పరిష్కరించారు. లోక్ అదాలత్ లో రాజీపడిన కేసులు 274,అడ్మిషన్ కేసులు 423,డంకన్ డ్రైవ్ కేసులు 957, సైబర్ క్రైమ్ కేసులు 118, ఇ-పెట్టి కేసులు 274 లను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో 13వ అదనపు న్యాయమూర్తి నిష్క పాత్రుడు, స్పెషల్ కోర్టు న్యాయమూర్తి రవికుమార్, ఏపీపీ ప్రవీణ్ నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కాసోజు యాదగిరి,కార్యదర్శి బందయ్య, లోక్‌అదాలత్ సభ్యులు వెంకట్ రెడ్డి, సుదర్శన్, సుధాకర్ రెడ్డి,సుజాత,వరప్రసాద్,శ్రీనివాసులు, ణేశ్వర్ చారి, తలారి శ్రీ శైలం, కోర్టు సిబ్బంది రవీందర్, వెంకటరంగారెడ్డి, మంజుల, సునిత, నరేష్ గౌడ్, సంబంధిత ఠాణాల ఎస్ హెచ్ ఓ లు,సిబ్బంది,బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎక్కువగా వాకింగ్ చేయడం మంచిదేనా..?



నడక ఆరోగ్యాన్ని పెంచడంలో సహాయపడే చాలా సులభమైన వ్యాయామం. శరీరాన్ని చురుకుగా ఉంచడంలో, మనసును ప్రశాంతంగా ఉంచడంలో ఇది ముఖ్య పాత్ర పోషిస్తుంది. అయితే ఏదైనా హద్దుకు మించి చేస్తే దాని ప్రభావం చెడుగా మారే అవకాశం ఉంది. అదే విధంగా అతి ఎక్కువగా నడవడం వల్ల కూడా శారీరక సమస్యలు రావచ్చు. సాధారణంగా చాలా మంది ఆరోగ్యంగా ఉండటానికి రోజుకు 10,000 అడుగులు నడవాలని అనుకుంటారు. కానీ ఇది అందరికీ ఒకేలా వర్తించదు. మీ వయస్సు, ఆరోగ్యం, జీవనశైలి ఆధారంగా ఇది మారవచ్చు. సాధారణంగా 8,000 నుంచి 10,000 అడుగుల వరకు నడవడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు వస్తాయి. దీని వల్ల షుగర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయి, గుండె సంబంధిత సమస్యలు అదుపులో ఉంటాయి. మీ శరీరం శక్తి మేరకు నడక పరిమితి ఉండాలి. కొత్తగా నడక ప్రారంభించిన వారు 30 నిమిషాలు నడిస్తే ఇబ్బంది, కీళ్ల నొప్పులు అనుభవించవచ్చు. కానీ అనుభవం ఉన్నవారు గంటల తరబడి నడిచినా ఇబ్బంది లేకుండా ఉండవచ్చు. అయితే శరీరం చెప్పే సంకేతాలను పట్టించుకోకుండా నడిస్తే నెమ్మదిగా సమస్యలు మొదలవుతాయి. గతంలో గాయపడిన కీళ్ల ప్రాంతాల్లో మళ్లీ నొప్పి మొదలవుతుంది. ఎక్కువగా నడవడం వల్ల కీళ్లపై ఒత్తిడి పెరిగి సమస్యలు వస్తాయి. చెప్పులు సరిగా లేకపోవడం లేదా ఎక్కువగా నడవడం వల్ల కాళ్లపై గడ్డలు, బొబ్బలు ఏర్పడతాయి. ఇవి నడిచేటప్పుడు ఇబ్బందిగా మారతాయి. శరీరం అలసిపోయినట్లు అనిపించడం, చిన్న పని చేసినా శ్వాస తీసుకోవడం కష్టంగా అనిపించడం వంటి లక్షణాలు ఎక్కువగా నడుస్తున్నారని సూచిస్తాయి. మొత్తం రోజంతా నడిచిన తర్వాత కాళ్లలో వాపు, నొప్పి రావడం సహజం. ఇది క్రమంగా పెద్ద సమస్యగా మారవచ్చు.నడక మనసుకు శాంతిని ఇవ్వగలిగే శక్తి ఉన్నా.. హద్దు మించి చేస్తే ఆందోళన, నిరాశ, కోపం వంటి భావోద్వేగాలు పెరిగే అవకాశం ఉంటుంది.తాజాగా నడక మొదలుపెట్టే వారు రోజుకు 15 నిమిషాల పాటు నడవడం ప్రారంభించాలి. ఆ తర్వాత ప్రతి వారం కొద్దిగా సమయం పెంచుకుంటూ 30 నిమిషాల వేగవంతమైన నడక సాధన దిశగా కదలాలి.నడక సమయంలో నోటితో కాకుండా ముక్కుతో శ్వాస తీసుకోవడం మంచిది. పూర్తి ప్రయోజనాల కోసం వారంలో కనీసం 3 రోజులపాటు నడక చేయడం మంచిది. నడక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన సాధనమే అయినా.. దానికి కూడా పరిమితి అవసరం. శరీరానికి విశ్రాంతి ఇవ్వకుండా ఎక్కువగా నడవడం వల్ల దీర్ఘకాలిక నష్టాలు కలుగుతాయి. కాబట్టి నడకను ఒక ఆరోగ్య అలవాటుగా చేసుకోండి కానీ మించిపోకుండా జాగ్రత్త వహించండి.

# 15 నిమిషాల్లో సిద్ధమయ్యే టిఫిన్ రెసిపీలు



ఉదయం పూట ఇంట్లో అందరూ బిజీగా ఉంటారు. అలాంటి సమయంలో ఆరోగ్యకరమైన టిఫిన్ త్వరగా చేయాలంటే చాలా మంది కంగారు పడుతుంటారు. ముఖ్యంగా దక్షిణ భారత వంటలు అంటే పిండి నానబెట్టి, పులియబెట్టి, ఎక్కువ సమయం పడుతుందనే అపోహ ఉంటుంది. కానీ కొన్ని సులభమైన టిఫిన్ ఐటెమ్స్ నిజానికి 15 నిమిషాల్లోనే సిద్ధమవుతాయి. మిగిలిపోయిన అన్నం ఉంటే చాలు ఇది సులభంగా తయారవుతుంది. ఒక పాన్ లో నూనె వేయాలి. ఆవాలు, కరివేపాకు, పచ్చిమిరపకాయలు, మినపప్పు, వేరుశెనగలు వేసి వేయించాలి. కొద్దిగా పసుపు, ఉప్పు వేయాలి. చివరగా నిమ్మరసం చిందించి అన్నంలో కలిపితే సరిపోతుంది. చల్లారినా రుచిలో మార్పు ఉండదు. రవ్వ ఉప్మాతో తయారయ్యే ఈ ఉప్మా ఉదయం ఆకలిని బాగా తీరుస్తుంది. దీన్ని తయారు చేయడానికి ముందుగా రవ్వను వేయించాలి. తర్వాత ఒక పాన్ లో నూనె వేసి ఆవాలు, కరివేపాకు, అల్లం ముక్కలు, ఉల్లిపాయలు వేసి వేయించాలి. అవి వేగాక వేడి నీళ్లు పోసి రవ్వను నెమ్మదిగా జల్లుతూ ఉండలు కట్టకుండా కలుపుకోవాలి. ఇలా చేస్తే తక్కువ సమయంలోనే రుచికరమైన ఉప్మా సిద్ధమవుతుంది. ఇది త్వరగా సులభంగా చేసుకునే అల్పాహారం.

పెసరపప్పుతో తయారయ్యే ఈ దోశ ఉదయపు భోజనానికి చాలా సరైనది. నానబెట్టిన పెసరపప్పుతో టొమాటో, అల్లం, మిరపకాయలు వేసి మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని పెనంపై పోసి రెండు వైపులా కాల్చితే చాలు. చట్నీ లేకుండానే రుచిగా తినవచ్చు.

ఇడ్లీ లేదా దోశ పిండి లేనప్పుడు రాగి పిండి మంచి ప్రత్యామ్నాయం. రాగి పిండి, బియ్యపు పిండి, పెరుగు, ఉల్లిపాయలు, కొత్తిమీర కలిపి నీటితో పల్చగా చేయాలి. పెనంపై వేసి కాల్చాలి. ఇది ఐరన్, కాల్షియంతో కూడిన ఆరోగ్యకరమైన ఆహారం.

రెడీ టు కుక్ రైస్ వర్మిసెల్లి ఉపయోగించండి.. చాలా త్వరగా ఈ వంటకం తయారవుతుంది. వేడి నీటిలో వర్మిసెల్లిని నానబెట్టి వడపోసి పాన్ లో కరివేపాకు, ఆవాలు, ఉల్లిపాయలు, క్యారెట్, క్యాప్సికం వేయించాలి. చివరగా వర్మిసెల్లి రైస్ ని ఉప్పుతో కలపాలి. తేలికగా ఉండే ఈ వంటకం టిఫిన్ బాక్స్ కోసం చాలా బాగుంటుంది.

ఇడ్లీలు మిగిలిపోయినప్పుడు వాటిని చిన్న ముక్కలుగా కట్ చేసుకోండి. ఒక పాన్ లో నూనె వేసి ఆవాలు, కరివేపాకు వేయాలి. ఆ తర్వాత ఇడ్లీ ముక్కలను వేసి బాగా వేయించాలి. ఇలా తయారు చేసిన పొడి ఇడ్లీ చాలా రుచిగా ఉంటాయి. ఇది టిఫిన్ బాక్స్ లో చల్లారినా కూడా దాని రుచి మారదు. అలాగే ఉంటుంది.

పెరుగు అన్నం తయారు చేయడం చాలా సులభం.. తినడానికి చాలా హాయిగా ఉంటుంది. ముందుగా అన్నంలో పెరుగు, కొద్దిగా పాలు, ఉప్పు వేసి బాగా కలపాలి. ఆ తర్వాత ఆవాలు, కరివేపాకు, అల్లంతో తాలింపు వేసి అన్నంలో కలుపుకోవాలి. చివరగా పైన ద్రాక్షలు లేదా దానిమ్మ గింజలు వేసుకుంటే పెరుగు అన్నానికి ఒక ప్రత్యేకమైన రుచి వస్తుంది.

# చేప గుడ్లు తింటున్నారా..?



నాన్ వెజ్ ప్రియులు చికెన్, మటన్‌తో పాటు చేపలు కూడా ఎక్కువగా తింటూ ఉంటారు. అలాగే, చేపలతో పాటు వాటి గుడ్లను చాలా మంది ఇష్టంగా తింటుంటారు. కానీ, చేప గుడ్లను తరచూ తినటం వల్ల శరీరంలో కలిగే మార్పులు, ఆరోగ్య ప్రయోజనాలేంటో ఎప్పుడైనా ఆలోచించారా..? ఈ చేప గుడ్లలో ప్రధానంగా మెగ్నీషియం, ఫాస్ఫరస్, విటమిన్ డి, కాల్షియం ఉంటాయి. చేప గుడ్లు తినే అలవాటు కూడా చాలామందిలో ఉంటుంది. ఈ గుడ్లలో పోషకాలు ఉంటాయి. పొటాషియం కలిగి ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గిస్తుంది. అయితే లోబీపీతో బాధపడేవారు తీసుకోకూడదని నిపుణులు చెబుతున్నారు. అలాగే, గుండె ఆరోగ్యానికి కూడా చేప గుడ్లు ఎంతో ప్రయోజనకరం అంటున్నారు నిపుణులు. తరచూ చేప గుడ్లు తినటం వల్ల గుండె ప్రమాదాలు దరి చేరకుండా తప్పిస్తాయి. ఇందులో ఉండే ఒమేగా 3 ఫ్యాటీ ఆసిడ్స్ మెదడు పనితీరును మెరుగు చేస్తుంది. అంతేకాదు చేప గుడ్ల వల్ల కంటి ఆరోగ్యం కూడా బాగుంటుంది. ఇవి కొన్ని రకాల క్యాన్సర్లకు వ్యతిరేకంగా పోరాడుతాయి. చేప గుడ్లలోశరీరానికి అవసరమైన న్యూట్రిషన్లు, బి 12, డి, ఎ తదితర విటమిన్లు, మినరల్స్, ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. మతిమరపు సమస్య ఉన్నవారు, అల్జీమర్స్ పేషెంట్లు కూడా క్రమం తప్పకుండా చేప గుడ్లను తినటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. చేప గుడ్లలో లభించే విటమిన్ ఏ కంటి చూపు మెరుగుపరచడంలో సాయపడుతుంది. చేపలు, వాటి గుడ్లు తినటం వల్ల రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరిగి రక్తం శుద్ధి చేస్తుంది. రక్తహీనతతో బాధపడే వారికి చేపగుడ్లు బెస్ట్ ఆప్షన్ అంటున్నారు నిపుణులు. రెగ్యులర్‌గా చేప గుడ్లు తింటే బీపీ సమస్య తగ్గుతుంది. చేప గుడ్లలో ఉండే విటమిన్ డి తో ఎముకలు, దంతాలను దృఢంగా మారతాయి. చేప గుడ్లు చర్మ ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయి. వీటితో చర్మానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. వృద్ధాప్యాన్ని దూరం చేస్తుంది. శరీరానికి అవసరమైన పాళ్లలో అయోడిన్ ఉంటుంది. హర్మోన్ బ్యాలెన్స్‌కి, జీర్ణక్రియకు ఇది ఉపయోగపడుతుంది. కండరాల ఎదుగుదలకు చేపగుడ్లు ఉపయోగపడతాయి. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

# ఖాళీ కడుపుతో ఈ జ్యూస్ తాగితే ఎన్ని ప్రయోజనాలో..



బూడిద గుమ్మడికాయ ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరం అంటున్నారు ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే ప్రకృతి ప్రసాదం అంటున్నారు. ఇందులో విటమిన్ సి, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు వంటి అనేక పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శరీరాన్ని అనేక సమస్యల నుండి రక్షిస్తాయి. ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. బూడిద గుమ్మడికాయ జ్యూస్ శరీరాన్ని డిటాక్స్ చేయడమే కాక, పలు ఆరోగ్య సమస్యలకు పరిష్కారం కూడా. ఇందులో అత్యంత తక్కువ కేలరీలు ఉండడం, అధిక నీరు, విటమిన్లు, ఖనిజాలు ఉండడం దీన్ని ఆరోగ్యానికి అమృత సమానంగా మారుస్తుంది.బూడిద గుమ్మడికాయ జ్యూస్‌లో క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, జింక్ ఇందులో సమృద్ధిగా ఉంటాయి. విటమిన్ సి, బి కాంప్లెక్స్ కూడా ఉంటాయి. బూడిద గుమ్మడికాయ రసం శరీరాన్ని డిటాక్స్ చేస్తుంది. అన్నిటికన్నా ముఖ్యంగా బూడిద గుమ్మడికాయ రసం బరువు తగ్గించడంలో చాలా సహాయపడుతుంది. కడుపులో మంట, అజీర్ణం లాంటి సమస్యలు ఉంటే ఈ జ్యూస్ తాగడం వల్ల తగ్గిపోతాయి. ఈ జ్యూస్ రోజు తీసుకోవడం వల్ల.. గ్యాస్, అల్సర్ సమస్యలు తగ్గుతాయి. రోగనిరోధక శక్తిని పెంచడానికి బూడద గుమ్మడికాయ జ్యూస్ సహాయం చేస్తుంది. బూడిద గుమ్మడికాయ జ్యూస్‌ను తీసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్స్ నుంచి దూరంగా ఉండొచ్చు. షుగర్‌ను కంట్రోల్ చేయడానికి ఈ జ్యూస్ బాగా హెల్ప్ చేస్తుంది. షుగర్ ఉన్న వాళ్లు రెగ్యులర్‌గా తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. ప్రతి రోజు ఈ జ్యూస్ తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్ సమస్య రాదు. రెగ్యులర్‌గా తీసుకుంటే అనేక ప్రయోజనాలు పొందవచ్చు. నిద్రలేమితో బాధపడే వాళ్లకి బూడిద గుమ్మడికాయ జ్యూస్ మంచి ఎంపిక. ఈ జ్యూస్‌ను రెగ్యులర్‌గా తీసుకుంటే నిద్రలేమి నుంచి బయిటపడొచ్చు.గుమ్మడికాయ రసాన్ని తెలుసుకోవడం వలన వాత, పిత్త దోషాలు బ్యాలెన్స్ అవుతాయి. హెల్తీగా ఉండొచ్చు. బూడిద గుమ్మడికాయ జ్యూస్ తాగితే కిడ్నీ ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఈ జ్యూస్ తాగితే కిడ్నీ సమస్యలు దూరం అవుతాయి. కిడ్నీలో రాళ్లు తగ్గుతాయి. మూత్ర సంబంధిత సమస్యలకు దూరంగా ఉండడానికి ఈ జ్యూస్ బాగా ఉపయోగపడుతుంది. ఈ జ్యూస్ తాగితే యూటిఐ తగ్గుతుంది. ఈ జ్యూస్ ని తీసుకుంటే మంచి ఎనర్జీని ఇస్తుంది. రెగ్యులర్‌గా దీన్ని తీసుకోవడం వలన ఒంట్లో ఉన్న మలినాలు బయటకు వెళ్లిపోతాయి. సైనస్ సమస్యలు ఉంటే కూడా దీనిని తీసుకోవడం మంచిది.


# ఇంట్లో ఈ ప్రదేశంలో డబ్బులు పెడుతున్నారా..



వాస్తు శాస్త్రంలో ఇంట్లో సుఖ శాంతులు, సిరి సంపదలు నిలవాలంటే ఇంట్లోని వస్తువులు ఎక్కడ ఉంచాలి? ఎక్కడ ఉంచడం మంచిది కాదో కూడా వివరించింది. మనం ఇంట్లోకి రాగానే డబ్బులను తోచిన చోట పెట్టేస్తాం. అంతేకాదు ఇంట్లో డబ్బులు పెట్టుకునే సేఫ్ లాకర్ ని కూడా సరైన స్థానంలో పెట్టుకోవాలి. లేదంటే లక్ష్మీ దేవి ఆగ్రహం కలుగుతుంది. ఆ ఇంటి నుంచి దూరంగా వెళ్ళిపోతుంది. అప్పుడు డబ్బులకు ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. మన జీవితంలో వాస్తు శాస్త్రం ప్రాముఖ్యత ఎంతో ఉంది. ఎవరైనా సరే వాస్తు శాస్త్రంలో పేర్కొన్న నియమాలను సరిగ్గా పాటిస్తే ఫలితాలు చాలా శుభప్రదంగా, సంపన్నంగా ఉంటాయి. అదే సమయంలో ఈ నియమాలను విస్మరించినప్పుడు దాని ఫలితాలు కూడా ప్రతికూలంగా ఉంటాయి. వాస్తు శాస్త్రంలో డబ్బు లేదా సంపద గురించి అనేక రకాల నియమాలు చెప్పబడ్డాయి. ఈ రోజు మీరు పొరపాటున కూడా డబ్బును ఇంట్లో ఉంచకూడని కొన్ని ప్రదేశాల గురించి తెలుసుకుందాం. మీరు ఈ ప్రదేశాలలో డబ్బును ఉంచితే లక్ష్మీదేవి మీ నుంచి శాశ్వతంగా దూరమవుతుంది. జీవితం పేదరికంలో గడిచిపోతుంది. దక్షిణ దిశలో డబ్బు ఉంచవద్దు. వాస్తు శాస్త్రం ప్రకారం మీరు పొరపాటున కూడా ఇంటికి దక్షిణ దిశలో డబ్బు ఉంచకూడదు. ఈ దిశను ఎల్లప్పుడూ యమరాజు దిశగా పరిగణిస్తారు. ఈ దిశలో డబ్బు ఉంచడం ప్రారంభించినప్పుడు అప్పుల ఊబిలో కూరుకుపోతారు. జీవితం పేదరికంలో గడిచిపోతుంది. సురక్షితంగా ఉంచేటప్పుడు దీన్ని గుర్తుంచుకోండి వాస్తు శాస్త్రం ప్రకారం మీరు చీకటిగా ఉన్న ప్రదేశంలో ఎప్పుడూ సేఫ్‌ను ఉంచకూడదు. మీరు సేఫ్‌ను ఉంచే స్థలం శుభ్రంగా ఉండేలా, అక్కడ తగినంత వెలుతురు ఉండేలా జాగ్రత్త వహించాలి. మీరు సేఫ్‌ను చీకటిలో ఉంచితే మీ జీవితంలో ప్రతికూలత పెరుగుతుంది. టాయిలెట్ కి సమీపంలో ఉంచొద్దు వాస్తు శాస్త్రం ప్రకారం మీరు బాత్రూమ్ దగ్గర ఎప్పుడూ సేఫ్ ఉంచకూడదు. ఈ ప్రదేశం అపరిశుభ్రంగా ఉంటుంది. ప్రతికూల శక్తి కూడా ఇక్కడ నివసిస్తుంది. మీరు ఈ స్థలంలో డబ్బు ఉంచవద్దు.

## బిజినెస్

### ఇంటెల్‌లో ఉద్యోగ కోతలు!




**ఇంటర్నెట్ డెస్క్:** ప్రముఖ టెక్ కంపెనీ ఇంటెల్ కొందరు ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమవుతోంది. మార్చిలో కంపెనీ సీఈఓగా లిప్-బు టాన్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఉద్యోగుల తొలగింపుపై దృష్టిపెట్టారు. జులై మధ్య నుంచి మొదలుకానున్న ఈ ప్రక్రియ నెలాఖరు నాటికి పూర్తవుతుందని సమాచారం. కంపెనీ తన కార్యకలాపాలను క్రమబద్ధీకరించి, పోటీతత్వాన్ని పెంచే వ్యూహాత్మక ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఈ లేఆఫ్ విషయాన్ని కంపెనీ ధ్రువీకరించినట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఎంత మందిని తొలగించవచ్చు, ఏ ప్రాంతాల్లో కోతలు జరుగుతాయనే వివరాలు వెల్లడించలేదు. పీసీ, ల్యాప్‌ట్యాప్ విక్రయాలు తగ్గడం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో ఎన్విడియా, ఏఎమ్‌డీల నుంచి తీవ్రమైన పోటీ ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇంటెల్ ఈ నిర్ణయం తీసుకుంది.

### ఐపీఓకు ముందు రూ.260 కోట్లు సమీకరించిన హీరో ఫిన్‌కార్ప్





**ఇంటర్నెట్ డెస్క్:** ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ ఆర్థిక సేవల విభాగం హీరో ఫిన్‌కార్ప్ లిస్టింగ్‌ను వేగవతం చేస్తోంది. అందులో భాగంగానే ఐపీఓకు ముందు రూ.260 కోట్లను సమీకరించింది. దీంతో పబ్లిక్ ఇష్యూలో విక్రయించాల్సిన తాజా షేర్ల మొత్తం రూ.2,100 కోట్ల నుంచి రూ.1,840 కోట్లకు తగ్గింది. మొత్తం ఐపీఓ పరిమాణం రూ.3,668 కోట్ల నుంచి రూ.3,408 కోట్లకు తగ్గింది. ఇందులో రూ.1,568 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి పెట్టారు. జూన్ 5న కంపెనీ నిర్వహించిన ప్రీ- ఐపీఓ రౌండ్‌లో 12 మంది పెట్టుబడిదారులతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఒక్కో షేరు రూ.1,400 చొప్పున 18.57 లక్షల వాటాలను వారికి కేటాయించింది. దీని ద్వారా రూ.260 కోట్లు సమీకరించింది. హీరో ఫిన్‌కార్ప్ ఐపీఓ ప్రణాళికను గతేడాది ప్రకటించింది. నాటి నుంచి వీటి పబ్లిక్ ఇష్యూ రాక కోసం మదుపర్లు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది మేలో సెబీ నుంచి ఐపీఓకు అనుమతి లభించింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించిన నిధుల్ని భవిష్యత్తు రుణ కార్యకలాపాల కోసం కంపెనీ మూలధనాన్ని పెంచేందుకు ఉపయోగించనుంది. హీరో ఫిన్‌కార్ప్ నాన్- బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ. రిటైల్, సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి వ్యాపారాలకు రుణాలు అందిస్తోంది. 2024 మార్చి నాటికి కంపెనీ ఆస్తులు రూ.51,821 కోట్లుగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ కంపెనీకి 1.18 కోట్ల మంది కస్టమర్లు ఉన్నారు.

# పెరుగుతున్న అపార్ట్‌మెంట్ లోడింగ్

నివాస విభాగాన్ని కరోనా కంటే ముందు, ఆ తర్వాత అని విభజించే పరిస్థితులు వచ్చాయి. కోవిడ్ కంటే ముందు వరకూ అపార్ట్‌మెంట్ విస్తీర్ణంలో కార్పెట్ ఏరియాకే అధిక ప్రాధాన్యం ఇచ్చేవారు. అంటే ఫ్లాట్ ఏరియాలో వాస్తవంగా గృహ యజమాని వినియోగించే స్థలం ఎంత ఉందని చూసుకునేవారు. కానీ, కోవిడ్ తర్వాత నుంచి కొనుగోలుదారుల అభిరుచిలో మార్పులు వచ్చాయి. ఫ్లాట్‌లో నివాసితుడు వినియోగించే స్థలం కంటే క్లబ్‌హౌస్, పార్క్, గార్డెన్, లాబీ వంటి వసతులకు ఎంత స్థలం కేటాయిస్తున్నారనే దానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. లగ్జరీ లైఫ్ స్టయిల్‌ను కోరుకునే యువ జనరేషన్ పెరుగుతుండటంతో అపార్ట్‌మెంట్‌లో కార్పెట్ ఏరియా క్రమంగా తగ్గుతోందని అనరాక్ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది. అపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్‌లో ఫ్లాట్ల స్థలంతో పాటు లిఫ్ట్, మెట్లు, క్లబ్‌హౌస్, పార్క్ ఇతరత్రా వసతుల కోసం కేటాయించిన స్థలాన్ని కూడా కలిపితే దాన్ని సూపర్ బిల్టప్ ఏరియాగా పేర్కొంటారు. ఇక, ఫ్లాట్‌లో వాస్తవంగా గృహ యజమాని వినియోగించే స్థలం(గోడ నుంచి గోడ వరకూ ఉండే స్పేస్)ను కార్పెట్ ఏరియాగా పేర్కొంటారు. కరోనా మహమ్మారి కంటే ముందు వరకూ గృహ కొనుగోలుదారులు కార్పెట్ ఏరియాకు అధిక ప్రాధాన్యత ఇవ్వగా.. కోవిడ్ తర్వాత నుంచి కార్పెట్ కంటే అపార్ట్‌మెంట్‌లోని వసతులకు(లోడింగ్) ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ఏడాది తొలి త్రైమాసికం (క్యూ1) నాటికి దేశంలోని ప్రధాన నగరాలలో అపార్ట్‌మెంట్ లోడింగ్ 40 శాతానికి చేరుకుంది. 2019లో ఇది 31 శాతంగా ఉంది. నివాస సముదాయాలలో అధునిక వసతులు, సౌకర్యాలు పెరుగుతున్నాయి. దీంతో ప్రధాన నగరాలలో అపార్ట్‌మెంట్ల లోడింగ్(వసతులు)పెరుగుతోంది. విలాసవంతమైన జీవనశైలి కారణంగా గృహ కొనుగోలుదారులు అధిక వసతులు, సౌకర్యాలను కోరుతున్నారు.

**వసతులకు ప్రాధాన్యం**

దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో అపార్ట్‌మెంట్లలోని మొత్తం స్థలంలో 60 శాతం నివాసయోగ్యమైన స్థలం కాగా మిగిలిన 40 శాతం సాధారణ ప్రాంతం. లిఫ్ట్, లాబీ, మెట్లు, క్లబ్ హౌస్, వసతులు, టైరస్ వంటి కామన్ ఏరియాలు. కరోనా కంటే ముందు వరకూ 30 శాతం కంటే తక్కువ లోడింగ్ సాధారణంగా భావించేవారు. కానీ, కరోనా తర్వాతి నుంచి విలాసవంతమైన జీవనశైలి అలవాటైపోయింది. ప్రాజెక్ట్ చిన్నదైనా, పెద్దదైనా ఆధునిక వసతులు ఉండాలని కోరుకుంటున్నారు. దీంతో అపార్ట్‌మెంట్లలో నివాసయోగ్యమైన స్థలం కార్పెట్ ఏరియా తగ్గుతుంది. గృహ కొనుగోలుదారులు ప్రాథమిక జీవనశైలి సౌకర్యాలతో సంతృప్తి చెందడం లేదు. ఫిట్‌నెస్ కేంద్రాలు, క్లబ్ హౌస్, పార్క్, గార్డెన్, గ్రాండ్ లాబీలు ఉండాలని కోరుకుంటున్నారు.



**రీసేల్ విలువ పెరుగుదల..**

లోడింగ్ పెరిగితే కమ్యూనిటీ నివాస యోగ్యత, రీసేల్ విలువలను కూడా పెరుగుతుంది. అయితే గృహ కొనుగోలుదారులు తమ అపార్ట్‌మెంట్లలో వాస్తవంగా ఉపయోగించే స్థలాన్ని కోల్పోతారు. ప్రతి ప్రాజెక్ట్‌లో అపార్ట్‌మెంట్‌లోని మొత్తం స్థలంలో గృహ కొనుగోలుదారులు వాస్తవంగా ఉపయోగించే స్థలం, సౌకర్యాల కోసం కస్టమర్లు ఎంత చెల్లిస్తున్నారో స్పష్టంగా పేర్కొనేలా రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) నిబంధనలు రూపొందించాలి. దీంతో కస్టమర్లు చెల్లించే సొమ్ములో దేనికెంత వ్యయం అవుతుందో స్పష్టత ఉంటుంది.

**లోడింగ్ శాతాన్ని ఎలా లెక్కిస్తారంటే..**

సూపర్ బిల్టప్ ఏరియా నుంచి కార్పెట్ ఏరియాను తీసి వేసి, కార్పెట్ ఏరియాతో భాగించాలి. వచ్చిన ఫలితాన్ని వందతో గుణిస్తే వచ్చేదే లోడింగ్ శాతం. ఉదాహరణకు.. హైదరాబాద్‌లో మీరు 1,500 చ.అ. అపార్ట్‌మెంట్ కొంటున్నారని అనుకుందాం. ఇందులో ఫ్లాట్‌లో కస్టమర్ వినియోగించే స్థలం 750 చ.అ.లే ఉంటుంది. మిగిలిన స్థలం లిఫ్టు, లాబీ, మెట్లు, క్లబ్ హౌస్ వంటి కామన్ ఏరియాలు ఉంటాయి. అంటే ఫ్లాట్ ఖరీదులో కస్టమర్ వాస్తవంగా వినియోగించే కార్పెట్ ఏరియాతో పాటు కామన్ ఏరియా కూడా కలిపే ఉంటుందన్నమాట.

**నగరంలో లోడింగ్ 38 శాతం..**

హైదరాబాద్‌లో లోడింగ్(వసతులు) శాతం 2019లో 30 శాతంగా ఉండగా.. 2022 నాటికి 33కు, ఈ ఏడాది క్యూ1 నాటికి ఏకంగా 38 శాతానికి పెరిగింది. 2025 క్యూ1 నాటికి దేశంలోని ప్రధాన నగరాలలో అత్యధికంగా 43 శాతం లోడింగ్‌తో ముంబై ప్రథమ స్థానంలో నిలిచింది. 2019లోనూ ఈ ఆర్థిక నగరంలో అత్యధిక లోడింగ్ 33 శాతంతో టాప్‌లో నిలిచింది. అత్యల్పంగా 36 శాతం లోడింగ్‌తో చెన్నై చివరి స్థానంలో నిలిచింది. 2019లో ఇక్కడ లోడింగ్ 30 శాతంగా ఉంది. ఏటేటా బెంగళూరులో అపార్ట్‌మెంట్ లోడింగ్ క్రమంగా పెరుగుతోంది. 2019లో ఇక్కడ 30 శాతం లోడింగ్ ఉండగా.. 2025 క్యూ1 నాటికి ఏకంగా 41 శాతానికి పెరిగింది. 2022లో ఇది 35 శాతంగా ఉంది. గత ఏడేళ్లలో బెంగళూరులో సగటు లోడింగ్ అత్యధిక శాతం వృద్ధిని నమోదు చేస్తూ ఉంది. ఎన్‌సీఆర్ లో 2019లో లోడింగ్ శాతం 31 శాతం నుంచి 2025 క్యూ1 నాటికి 41 శాతానికి చేరింది. పుణేలో 32 శాతం నుంచి 40కు, కోల్‌కతాలో 30 శాతం నుంచి 39 శాతానికి పెరిగింది.

## ఎంజీ మోటార్ ఆఫర్.. ఈవీపై రూ.4.4 లక్షలు డిస్కౌంట్!

**ఇంటర్నెట్ డెస్క్:** ప్రముఖ కార్ల తయారీ సంస్థ ఎంజీ మోటార్ తన ఈవీ కార్లపై భారీ డిస్కౌంట్ ప్రకటించింది. భారత్ మార్కెట్లోకి అడుగు పెట్టి ఆరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ప్రత్యేక ఆఫర్ తీసుకొచ్చింది. తన తొలి ఎలక్ట్రిక్ వాహనం జెడ్ఎస్ ఈవీపై ఏకంగా రూ.4 లక్షల తగ్గింపు ప్రకటించింది. పరిమిత కాలం మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని తెలిపింది. జెడ్ఎస్ ఎస్‌యూవీ ఎగ్జిక్యూటివ్ వేరియంట్‌పై రూ.13వేలు రాయితీ అందిస్తోంది. దీంతో ఈ కారు ధర రూ.16.88 లక్షల నుంచి రూ.16.75 లక్షలకు తగ్గింది. ఎక్సైట్ ప్రో వేరియంట్‌పై రూ.48వేలు డిస్కౌంట్ అందిస్తోంది. ఈ కారు ధర రూ.18.97 లక్షలు (ఎక్స్- షోరూమ్) కాగా.. ఆఫర్‌లో భాగంగా రూ.18.49 లక్షలకు కొనుగోలు చేయొచ్చు. రూ.23.64 లక్షలున్న ఎక్స్‌క్లూజివ్ ప్లస్ వేరియంట్‌ను రూ.19.49 లక్షలకే లభిస్తుంది. టాప్-ఎండ్ ఎసెన్స్ వేరియంట్‌పై అత్యధిక డిస్కౌంట్ అందిస్తోంది. ఈవీ ధర రూ.24.93 లక్షలు (ఎక్స్- షోరూమ్) కాగా.. ఆఫర్‌లో భాగంగా రూ.20.49 లక్షలకు కొనుగోలు చేయొచ్చు. అంటే ఏకంగా రూ.4.44 లక్షలు తగ్గింపు పొందొచ్చు. ఎంజీ మోటార్.. భారత మార్కెట్లోకి తీసుకొచ్చిన తొలి విద్యుత్ వాహనమే ఎంజీ జెడ్ఎస్. టాటా కర్వ్.ఈవీ, హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్, మహీంద్రా బీఈ6 వంటి మోడళ్లకు పోటీగా తీసుకొచ్చింది. 50.3 కేడబ్ల్యూహెచ్ బ్యాటరీ ప్యాక్‌తో తీసుకొచ్చిన ఈ కారు సింగిల్ ఛార్జ్‌తో 461 కిలోమీటర్లు ప్రయాణించొచ్చు.



# ఆస్ట్రేలియా డబుల్ స్ట్రోక్.. టీమిండియాకు ఆరో ఓటమి!

యూరప్ గడ్డపై జరుగుతున్న హాకీ ప్రో లీగ్‌లో భారత జట్టు ఆరో ఓటమి ఎదురైంది. ఇప్పటికే నెదర్లాండ్స్, అర్జెంటీనా చేతిలో పరాజయంతో కుమిలిపోతున్న టీమిండియా.. ఆస్ట్రేలియా చేతిలో వరుసగా రెండో ఓటమిని చవి చూసింది. గత పోరులో ఆఖర్లో గోల్స్ సమర్పించుకున్న భారత్.. ఈసారి ప్రత్యర్థిని నిలువరించలేక మళ్లీ విజయం వాకిట బొక్కబోర్లాపడింది. శనివారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ సేన 2-3తో వెనకబడింది. గత మ్యాచ్‌లో మాదిరిగానే భారత ఆటగాళ్లు తొలి అర్ధ భాగంలోనే గోల్ సాధించారు. డిఫెండర్ సంజయ్ రానా 3వ నిమిషంలోనే పెనాల్టీ కార్నర్ ద్వారా తొలి గోల్ అందించాడు. కానీ, ఆ తర్వాత ఆసీస్ ఆటగాళ్లు టిమ్ బ్రాండ్ (4వ నిమిషం), బ్లేక్ గోవర్స్ 5 వ నిమిషంలో గోల్స్ చేయగా భారత్ వెనకబడింది. అయితే.. దిల్‌ప్రీత్ సింగ్ 36వ నిమిషంలో గోల్ చేయగా టీమిండియా 2-2తో స్కోర్ సమం చేసింది. దాంతో 'హమ్మయ్య మ్యాచ్‌ను కాపాడుకుంటాం' అని హర్మన్‌ప్రీత్ సేన ధీమాగా ఉన్న వేళ.. భారత డిఫెండర్లను ఏమారుస్తూ కూపర్ బర్న్స్(36 నిమిషం) గోల్‌తో ఆస్ట్రేలియా ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 27వ నిమిషంలో టీమిండియాకు రెండు పెనాల్టీ కార్నర్లు లభించాయి. కానీ.. వాటిని హర్మన్‌ప్రీత్ బృందం సద్వినియోగం చేసుకోలేకపోయింది. 400వ మ్యాచ్ ఆడుతున్న మాజీ కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ తీవ్రంగా నిరాశపరిచాడు. మరో 10 నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా ఆసీస్ ఆటగాళ్లు రెండు పెనాల్టీ కార్నర్లు సాధించారు. అయితే.. గోల్ కీపర్ పాఠక్ వాటిని సమర్థంగా అడ్డుకోవడంతో ఒక్క పాయింట్ తేడాతో భారత జట్టు పరాజయం పాలైంది. వరుసగా ఆరు ఓటములతో డీలాపడిన టీమిండి తదుపరి మ్యాచ్‌లో జూన్ 21న బెల్జియంతో తలపడనుంది.




### కెప్టెన్‌గా చిరస్మరణీయ విజయాలు అందించా.. కానీ, నా జుట్టును కోల్పోయా..!

శ్రీలంక మాజీ కెప్టెన్ ఎంజెలో మాథ్యూస్ త్వరలోనే సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు పలుకుతున్న విషయం తెలిసిందే. స్వదేశంలో బంగ్లాదేశ్‌తో జరుగబోయే తొలి టెస్టు అతడికి చివరి మ్యాచ్ కానుంది. రిటైర్మెంట్ వార్తను ఇప్పటికే ప్రకటించిన మాథ్యూస్ .. తన కెరియర్‌లోని పలు ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. కెప్టెన్సీ సమయంలోనే తన జుట్టు ఎక్కువగా ఊడిపోయిందని చెప్పాడీ ఆల్‌రౌండర్. 'కెప్టెన్సీ చేపట్టిన తర్వాత నా జుట్టు చాలా పోయింది. నేను ఒక్కడినే కాదు లంకకు సారథ్యం వహించిన పలువురు ఆటగాళ్లకు కూడా పెద్దగా జుట్టు లేదు. ఎందుకంటే.. దేశానికి ప్రాతినిధ్యం వహించడం వేరు. జట్టును నడిపించడం వేరు. ప్రతిసారి అదనపు బాధ్యతలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రతిఒక్కరు మనల్నే గమనిస్తారు. టీమ్ గెలిచినా, ఓడినా మనం ఏం చెబుతామో వినాలని కోట్లాది మంది ఎదురుచూస్తారు. అందుకు.. అప్పుడప్పుడు ఒత్తిడిగా అనిపిస్తుంది. అయినా.. నేను ఆ సవాళ్లతో కూడిన ప్రయాణాన్ని ఎంతగానో ఆస్వాదించాను. నాకు అవకాశం లభించింది. జట్టును మరొక స్థాయికి తీసుకువెళ్లాలి' అనే లక్ష్యంతో పని చేశాను అని మాథ్యూస్ వెల్లడించాడు. బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా లంక జట్టులోకి వచ్చిన మాథ్యూస్ 2013లో టెస్టు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. 25 ఏళ్లకు పగ్గాలు అందుకున్న అతడు పిన్నవయస్కుడైన సారథిగా రికార్డు నెలకొల్పాడు. మాథ్యూస్ నేతృత్వంలోని లంక విదేశీ పర్యటనల్లో అద్భుతంగా రాణించింది. 2014లో ఇంగ్లండ్ గడ్డపై సిరీస్ విజేతగా నిలిచింది. అనంతరం వన్డే, టీ20 సారథిగానూ సేవలందించాడు మాథ్యూస్. అయితే.. 2017 జింబాబ్వే చేతిలో వన్డే సిరీస్ ఓటమితో అతడు మూడు ఫార్మాట్ల నుంచి కెప్టెన్‌గా వైదొలిగాడు.




## స్పోర్ట్స్

### అదే నాలో స్ఫూర్తి నింపింది.. ఎక్కువ సేపు క్రీజులో ఉండేలా చేసింది: మార్‌క్రమ్




**ఇంటర్నెట్ డెస్క్:** డబ్ల్యూటీసీ ఫైనల్‌లో ఆస్ట్రేలియాను ఓడించి తన సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది దక్షిణాఫ్రికా. 27 ఏళ్ల అనంతరం ఆ జట్టు ఐసీసీ టైటిల్‌ను గెలిచింది. ఈ విజయం ఆ జట్టు ఆటగాళ్లతోపాటు అభిమానులకూ ఎంతో భావోద్వేగంతో కూడినదే. చివరి దాకా వచ్చి.. ఒత్తిడికి తలొగ్గే అలవాటున్న ఆ జట్టు ఈ సారి మాత్రం పట్టువిడవలేదు. ఆ జట్టు విజయంలో సెంచరీతో కీలకంగా నిలిచిన మార్‌క్రమ్ కూడా అదే చెప్పాడు. ఈ సారి టైటిల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ వదలకూడదనే లక్ష్యంతో ఆడినట్లు వెల్లడించాడు. గత టీ20 ప్రపంచకప్ ఫైనల్‌లో టీమ్‌ఇండియాపై ఓటమి దక్షిణాఫ్రికాను తీవ్రంగా కుంగదీసిన విషయం తెలిసిందే. అప్పుడు తాను ఔట్ అయిన తర్వాత.. ఎంతో నిరాశకు గురయ్యానని.. మళ్లీ అలాంటి ఫీలింగ్ ఈ డబ్ల్యూటీసీ ఫైనల్‌లో రాకుడదని కోరుకున్నానని మార్‌క్రమ్ తెలిపాడు. ఆ ఆలోచనే తనలో స్ఫూర్తి నింపిందని.. వీలైనంత ఎక్కువ సేపు క్రీజులో ఉండేలా చేసిందని పేర్కొన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్‌గా వెనుదిరిగన మార్‌క్రమ్.. రెండో ఇన్నింగ్స్‌లో 136 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. "డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా.. గత టీ20 ప్రపంచకప్‌లో ఓటమి గురించి నేను చాలా ఆలోచించాను. టీ20 వరల్డ్ కప్ ఫైనల్‌లో ఔట్ అయిన తర్వాత నేను ఒంటరిగా కూర్చుని ఎంతో నిరాశకు గురయ్యాను. మరోసారి అలాంటి పరిస్థితి రాకూదని నిర్ణయించుకున్నాను. ఆ ఆలోచనే నాలో స్ఫూర్తినింపింది. అందుకే ఎక్కువ సేపు క్రీజులో ఉండగలిగాను" "ఇక సెంచరీ సాధించిన తర్వాత నేను చాలా భావేద్వేగానికి గురయ్యాను. జట్టు విజయం కోసం పోరాడుతున్నందుకు కన్నీళ్లు కూడా వచ్చాయి. ఇక చివరి రోజు జట్టు విజయానికి 69 పరుగుల దూరంలో ఉన్నప్పుడు.. అంతకుముందు రోజు రాత్రి నాకు నిద్ర పట్టలేదు. నిద్ర మాత్రలు తీసుకోవడానికి కూడా ప్రయత్నించాను. కానీ నాకు విశ్రాంతి దొరకలేదు. నా మనసు నిండా ఏవేవో ఆలోచనలు. అయితే.. చివరి రోజు మేం విజయం సాధించాం" అని మార్‌క్రమ్ భావోద్వేగానికి




## మోహన్ బాబుని కాల్చి చంపేస్తానన్న మోహన్ లాల్..

మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందింది. భారీ పాన్ ఇండియన్ మూవీగా రూపొందిన కన్నప్ప చిత్రాన్ని జూన్ 27న గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. భారీ బడ్జెట్‌తో, స్టార్ కాస్టింగ్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్ విష్ణు కెరీర్‌లో ఒక పెద్ద మైలురాయిగా మారనుంది. ఈ సినిమాలో మంచు మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తుండడంతో పాటు నిర్మాతగానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విశేషం ఏమిటంటే .. ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్‌లాల్, శరత్ కుమార్, కాజల్ అగర్వాల్ లాంటి పలు ఇండస్ట్రీ స్టార్ నటులు ఈ చిత్రంలో భాగమవుతున్నారు.అందుకే ఈ సినిమాపై ఓ రేంజ్‌లో హైప్ వచ్చింది. ఇక సినిమా విడుదల సమీపిస్తున్న వేళ, మూవీ ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో, తాజాగా కన్నప్ప ట్రైలర్ లాంచ్ ఈవెంట్ కేరళలోని కొచ్చిలో ఎంతో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు మంచు విష్ణు, మోహన్ బాబు, డైరెక్టర్ ఆంటోనీ తదితర యూనిట్ సభ్యులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్ లాల్ మాట్లాడుతూ .. "ఇప్పటివరకు నేను కలిసిన స్వీటెస్ట్ పర్సన్స్ లో మోహన్ బాబు సర్ ఒకరు. ఆయన సుమారు 600 సినిమాల్లో నటించడం నిజంగా అద్భుతం అంటూ మోహన్ బాబుపై ప్రశంసల వర్షం కురిపించారు. ఇంతలో ఒక సరదా సంభాషణను మోహన్ బాబు.. మోహన్ లాల్‌తో షేర్ చేస్తూ .."మీరు నటించే సినిమాలో నేను విలన్‌గా నటించాలనుంది" అన్నారు. దీనికి మోహన్ లాల్ స్పందిస్తూ.."మీరే హీరో, నేనే విలన్‌గా చేస్తా.. ఆ ఛాన్స్ నాకు ఇవ్వండి" అంటూ నవ్వుతూ చెప్పారు.ఆంటోనీ ఇది సాధ్యమవుతుందా అని మోహన్ లాల్ కింద ఉన్న డైరెక్టర్ ను అడగ్గానే ఆయన ఓకే అన్నారు. వెంటనే మోహన్ లాల్ నవ్వుతూ.. "నేను విలన్ అయితే ఫస్ట్ సీన్‌లోనే మిమ్మల్ని కాల్చి చంపేస్తా అని అన్నారు. అయితే మోహన్ లాల్ ఈ మాటలు మలయాళంలో చెప్పడంతో మోహన్ బాబుకి అర్థం కాలేదు. వెంటనే విష్ణు వాటిని తెలుగులోకి అనువదించగా, మోహన్ బాబు నవ్వుతూ "వద్దు వద్దు,, అలా చేయొద్దు" అంటూ రియాక్ట్ అయ్యారు. ప్రస్తుతం ఈ సరదా సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అభిమానులు ఈ కాంబినేషన్‌ని తెరపై చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## లోకల్ ట్రైన్‌లో హీరోయిన్‌తో అసభ్య ప్రవర్తన..



ప్రస్తుతం దక్షిణాది సినిమా పరిశ్రమలో టాప్ హీరోయిన్లలో ఆమె ఒకరు. తమిళం, మలయాళం భాషలలో వరుస సినిమాల్లో నటించిన ఆమె.. ఇప్పుడు తెలుగులో తొలి సినిమా చేస్తుంది. ఈ క్రమంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. తనకు ముంబై లోకల్ ట్రైన్ లో ఎదురైన ఓ చేదు సంఘటనను పంచుకుంది. ముంబై లోకల్ ట్రైన్ లో ప్రయాణిస్తున్న సమయంలో తనతో ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడని.. తన స్నేహితులతో కలిసి రాత్రి సమయంలో ఓ లోకల్ ట్రైన్ లో వెళ్తుండగా.. కంపార్ట్మెంట్ వద్ద ఉన్న గ్లాస్ డోర్ నుంచి ఓ వ్యక్తి తమ వైపు చూస్తూ ముద్దిస్తావా అని సైగలు చేశాడని చెప్పుకొచ్చింది. ఆ సమయంలో తాను ఎంతో భయాందోళనకు గురయ్యానని.. ముంబైలాంటి నగరంలో మహిళల భద్రత లేదని చెప్పుకొచ్చింది. తాజాగా ఈ హీరోయిన్ కామెంట్స్ పై ముంబై పోలీసులు రియాక్ట్ అయ్యారు. ఇంతకీ ఈ హీరోయిన్ ఎవరో తెలుసా.. ? తనే రాజాసాబ్ బ్యూటీ మాళవిక మోహనన్. ప్రస్తుతం రాజాసాబ్ చిత్రంలో నటిస్తున్న మాళవిక మోహనన్.. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని చెప్పుకొచ్చింది. ఆమె కామెంట్స్ పై ముంబై పోలీసులు స్పందించారు. "మాళవిక గారు మేము మీ చెప్పిన విషయాలు చూశారు. మీకెదురైన అనుభవాన్ని పంచుకున్నారు. నగరలో మహిళల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనల అనుభవాలు చాలా కాలం వరకు ప్రభావాన్ని చూపిస్తుంటాయి. నగంరోల రోజులో ఏ సమయంలోనైనా .. లేదా ఎక్కడైనా ప్రయత్నిస్తుంటే దయచేసి 112, 100 నంబర్స్ కు కాల్ చేయండి. మేము వీలైనంత త్వరగా మీకు అండగా నిలుస్తాము " అంటూ ట్వీట్ చేశారు. ప్రస్తుతం ముంబై పోలీసుల ట్వీట్ నెట్టింట వైరలవుతుంది. ఇదిలా ఉంటే.. మాళవిక మోహనన్.. తమిళంలో సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన పెట్ట సినిమాతో ఎక్కువగా ఫేమస్ అయ్యింది. ప్రస్తుతం డైరెక్టర్ మారుతి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న హారర్ కామెడీ డ్రామా రాజాసాబ్ చిత్రంలో నటిస్తుంది. ఈ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ మూవీతోనే మాళవిక తెలుగు తెరకు పరిచయం కాబోతుంది. త్వరలోనే ఈ మూవీ టీజర్ రిలీజ్ కానుంది.



## 'కాంతార' షూటింగ్‌లో నటుడు రిషబ్ షెట్టికి ప్రమాదం

కన్నడ నటుడు రిషబ్ షెట్టి నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ కాంతార చాప్టర్1కి వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే. గతేడాది ఈ సినిమాలో నటిస్తున్న జూనియర్ ఆర్టిస్టులు ప్రయాణిస్తున్న వ్యాన్‌కు ప్రమాదం చోటు చేసుకోగా.. ఆ తర్వాత కొన్నిరోజులకే కపిల్ అనే నటుడు నదిలో కొట్టుకుపోయి చనిపోయాడు. మరోవైపు అదే నెలలో రాకేశ్ పూజారి అనే మరో నటుడు గుండెపోటుతో కన్నుమూయగా.. నిన్న శనివారం రోజున కాంతారలో నటిస్తున్న మిమిక్రీ ఆర్టిస్ట్ కళాభవన్ నిజూ (43) సైతం గుండెపోటుతో మృతి చెందాడు. అయితే ఈ సంఘటనలు మరవకముందే మరో ప్రమాదం చోటు చేసుకుంది. అయితే ఈ ప్రమాదంలో నటుడు రిషభ్ షెట్టి కూడా ఉండడం విశేషం. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం కర్ణాటకలోని మాణి జలాశయం వద్ద జరుగుతుండగా.. ఈ షూటింగ్‌లో పాల్గోన్న నటుడు రిషభ్‌షెట్టితో పాటు 30 మంది ఆర్టిస్టులు కలిసి ప్రయాణిస్తున్న బోట్ ప్రమాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. దీంతో వెంటనే వారందరూ ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. ఈ ఘటనలో కెమెరాతో పాటు సాంకేతిక పరికారలు కొట్టుకుపోగా.. రిషభ్‌తో పాటు పలువురు నటులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.




## కోరుట్లలో విషాదం.. విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి.. ఆరుగురికి గాయాలు



**జగిత్యాల:** కోరుట్లలో విషాదం చోటు చేసుకుంది. వినాయక విగ్రహాలు తరలిస్తుండగా ఇద్దరు యువకులు మృతి చెందారు. మరో ఆరుగురికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుల్ని అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ దుర్ఘటనలో మృతులు బంటిసాయి,వినోద్‌లుగా గుర్తించారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. బాలాజీ కళా ఆర్ట్స్ విగ్రహాల తయారి యజమాని అల్వాల వినోద్, బంటి సాయి అనే ఇద్దరు యువకులు కోరుట్ల పట్టణం శివారులోని వినాయక విగ్రహాల తయారు చేస్తున్నారు. అయితే, ఆదివారం షెడ్డులో ఉంచిన విగ్రహాలు తడిగా ఉండటంతో ఎండలో ఆరబెట్టేందుకు పక్కనే ఉన్న మరో షెడ్డుకు తరలించే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నంలో కొండ్రికర్ల నుండి వచ్చే 133/11 కేవీ విద్యుత్ వైర్లకు 13అడుగుల వినాయక విగ్రహం తగిలింది. దీంతో ఆరు నుంచి తొమ్మిదిమందికి విద్యుత్ షాక్ తగిలింది. విద్యుత్ షాక్‌తో విలవిల్లాడుతూ ఒక్కసారిగా కుప్పకూలారు. ప్రమాదంతో అప్రమత్తమైన స్థానికులు కర్రల సాయంతో కరెంట్ షాక్ ప్రమాదాన్ని నిలువరించారు. అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుల్లో ఇద్దరు మృతి చెందారు. మిగిలిన బాధితులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

## దాడికి పాల్పడ్డ తండ్రి, కొడుకును అరెస్టు చేయాలని గ్రామస్థుల రాస్తారోకో

**దండేపల్లి :** మంచిర్యాల జిల్లా మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ మల్టిపర్పస్ వర్కర్ ప్రభాకర్‌పై దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. గ్రామానికి చెందిన తండ్రి, కుమారుడు భారతారపు లింగయ్య, కుమారస్వామి భూమి విషయమై మహిళతో గొడవపడ్డారు. ఆమె జీపీ మల్టిపర్పస్ వర్కర్ ప్రభాకర్‌కు విషయాన్ని వివరించడంతో అతడు అక్కడికి చేరుకున్నాడు. దివ్యాంగుడైన ప్రభాకర్‌ను తండ్రి, కొడుకులు చితకబాదడడంతో అతడికి తీవ్ర గాయాలు కావడంతో అతడిని ఆసుపత్రిలో చేర్పించారు. దాడికి పాల్పడ్డ ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎస్సై పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ గ్రామస్థులు రాస్తారోకో చేశారు. ఎస్సై తహసీనోద్దిన్ రాస్తారోకో ప్రాంతానికి చేరుకుని గ్రామస్థులను శాంతింప చేశారు. నిందితులపై చర్యలు తీసుకుంటామని సీఐ రమణమూర్తి హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

## ప్రతి సోమవారం విద్యుత్తు ప్రజావాణి



రాష్ట్రంలో వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలనే సదుద్దేశంతో ప్రతి సోమవారం విద్యుత్తు ప్రజావాణి నిర్వహిస్తున్నారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి ప్రత్యేక చొరవతో గత సంవత్సరం జూన్‌లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సంవత్సరంలో కేవలం 120 దరఖాస్తులు వచ్చాయంటే స్పందన ఎలా ఉందో తెలుస్తోంది. ఎలాంటి ఇబ్బందులున్నా రాత పూర్వకంగా : విద్యుత్తు పరంగా ఎలాంటి సమస్య ఉన్నా కంప్లైంట్ చేయవచ్చు. మీటర్ పని చేయకపోయినా, రీడింగ్‌లో తప్పు వచ్చినా, వ్యవసాయం చేసే రైతులకు సిబ్బంది పరంగా ఏమైనా సమస్యలు, ఇబ్బందులు ఉన్నా గృహజ్యోతి పథకం అమలు కాకపోయినా, ఇలా ఎలాంటి సమస్య అయినా అధికారులకు రాత పూర్వకంగా తెలియజేయవచ్చు.

ప్రచారం చేయని కారణంగా ప్రజలకు తెలియడం లేదు : ప్రతి సోమవారం విద్యుత్తు ప్రజావాణిని తెలంగాణ వ్యాప్తంగా నిర్వహిస్తారు. మండల స్థాయిలో ఏఈ, సబ్ డివిజన్‌లో ఏడీఈ, డివిజన్‌లో డీఈలు ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అందుబాటులో ఉంటారు. అదే రోజు జిల్లా కేంద్రంలోని సర్కిల్ ఆఫీస్?లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్ఈ స్వయంగా కంప్లైంట్ స్వీకరిస్తారు. దీనిపై సరైన విధంగా ప్రచారం చేయని కారణంగా ప్రజలకు తెలియడం లేదు. అధికారులు దృష్టి సారిస్తే ఉపయోగించుకునే అవకాశం ఉంది. ప్రతి సోమవారం విద్యుత్తు ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామని నిజామాబాద్ విద్యుత్తు శాఖ ఎస్ఈ రవీందర్ తెలిపారు. జిల్లాలోని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఈ, ఏడీఈ, డీఈ స్థాయిలో సమస్యలకు పరిష్కారం చూపుతారని, అక్కడ కాకుంటే తమ దృష్టికి తీసుకురావొచ్చని ఆయన పేర్కొన్నారు.





















Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com